ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
7
ప్రకాశం
జిల్లా వార్తలు
శనివారం 26, అక్టోబరు 2024



ఒంగోలులో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జనార్దన్, వేదికపై టీడీపీ ముఖ్య నేతలు

నేటి నుంచి సభ్యత్వ నమోదు

ప్రతి నలుగురు ఓటర్లలో ఒకరిని టీడీపీలో సభ్యుడిగా చేర్పించడమే లక్ష్యం

- సాంకేతిక పరిజ్ఞానం వినియోగం
- శాశ్వత సభ్యత్వంపైనా దృష్టి

ఒంగోలు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు శనివారం నుంచి ప్రారంభంకానుంది. ఈసారి ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఆపార్టీ తదనుగుణ చర్యలు చేపట్టింది. నియోజకవర్గం యూనిట్‌గా ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిల పర్యవేక్షణలో ప్రక్రియ సాగేలా ఆదేశించింది. ప్రతి నలుగురు ఓటర్లలో కనీసం ఒకరు పార్టీ సభ్యులుగా నమోదయ్యేలా చూడాలని అధిష్ఠానం దిశానిర్దేశం చేసింది. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో రెండు లక్షల నుంచి రెండున్నర లక్షల మంది ఓటర్లు ఉన్నారు. అంటే ఒక్కో నియోజకవర్గంలో 50 వేల నుంచి 60వేలమందిని సభ్యులుగా చేర్పించాల్సి ఉంటుంది. పార్టీ సభ్యత్వ రుసుం ఒక్కొక్కరికి వంద రూపాయలు కాగా సభ్యత్వం పొందిన పార్టీ కార్యకర్తల కోసం పలు సంక్షేమ పథకాలను అమలు చేయనుంది. గతంలో రెండు లక్షల ప్రమాద బీమా సౌకర్యం ఉండగా దానిని ప్రస్తుతం రూ.5 లక్షలకు పెంచారు. అలాగే పార్టీ సభ్యత్వం ఉన్న కుటుంబ సభ్యులలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు, అనారోగ్య సమస్యల పరిష్కారానికి తోడ్పాటు ఇవ్వనున్నారు. ఇలాంటి సంక్షేమ పథకాలపై కూడా కార్యకర్తలకు అవగాహన కల్పించాలని అధిష్ఠానం సూచించింది. మరోవైపు ఈసారి శాశ్వత సభ్యత్వం ఇచ్చేలా ఏర్పాటు చేశారు. సభ్యత్వ రుసుం కింద రూ.లక్ష చెల్లించే వారిని శాశ్వత సభ్యులుగా పరిగణిస్తారు. అధిష్ఠానం సూచనలతో జిల్లాలో శనివారం నుంచి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టేందుకు అన్ని ప్రాంతాల నేతలు సన్నాహాలు చేస్తున్నారు. పలు చోట్ల నియోజకవర్గస్థాయి సమావేశాలు

మిగతా 8వ పేజీలో

డీఈవోగా కిరణ్‌కుమార్ నేడు బాధ్యతల స్వీకరణ



- సుభద్రను రిలీవ్ చేసిన పాఠశాల విద్య కమిషనర్

ఒంగోలు విద్య, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లా విద్యాశాఖాధికారిగా నియమితులైన అత్తోటి కిరణ్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇప్పటి వరకూ ఇక్కడ పనిచేస్తున్న సుభద్రను రిలీవ్ చేస్తూ పాఠశాల విద్య కమిషనర్ విజయరామరాజు శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. అవి డీఈవో కార్యాలయానికి అందాయి. కిరణ్‌కుమార్‌కు బాధ్యతలు పూర్తిగా అప్పగించి విధుల నుంచి రిలీవ్ కావాలని ఆ ఉత్తర్వుల్లో సుభద్రను ఆదేశించారు. కిరణ్‌కుమార్ ఆయన సొంత వేతన శ్రేణిలోనే పనిచేయమన్నారు.

కొత్త పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహికులను ప్రోత్సహించాల్సిన జిల్లా పరిశ్రమల కేంద్రం అవినీతికి కేరాఫ్‌గా మారింది. ఇక్కడి సిబ్బంది నిరుద్యోగులను జలగల్లా పీల్చుతున్నారు. పైసలిస్తేనే రుణానికి సంబంధించిన ఫైలు కదులుతుందని కరాఖండిగా చెప్తున్నారు. ఈ వ్యవహారం ఆ శాఖలో చాలాకాలంగా రాజ్యమేలుతోంది. గతంలో కలెక్టర్ నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఒక జిల్లా అధికారి పరిశ్రమల శాఖలో జరుగుతున్న అవినీతి బాగోతంపై నేరుగా ఫిర్యాదు చేయడం అక్కడి పరిస్థితికి అద్దంపడుతోంది. అయినా కలెక్షన్ కింగ్‌లపై నేటికీ తగిన చర్యలు లేకపోవడంతో యథేచ్ఛగా అవినీతి వ్యవహారాన్ని నడిపిస్తున్నారు.



ఒంగోలు సంతపేటలో జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం కార్యాలయం

లక్షకు రూ.వెయ్యి!

రుణం కావాలంటే పర్సంటేజీ ఇవ్వాల్సిందే!

ఒంగోలు నగరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిశ్రమల కేంద్రానికి ప్రధాన మంత్రి ఎంప్లాయ్‌మెంట్ గ్యారెంటీ ప్రోగ్రాం (పీఎంఈజీపీ) పథకం కల్పవృక్షంలా మారింది. కొన్నేళ్లగా దీన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఈ పథకం కింద రుణం పొంది యూనిట్లను ఏర్పాటు చేసుకుంటే గరిష్ఠంగా యూనిట్ విలువలో 35శాతం సబ్సిడీగా లభిస్తోంది. దీంతో అనేకమంది ఈ పథకం కింద లబ్ధిపొందేందుకు దరఖాస్తు చేసుకుంటున్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలతో పోల్చి చూస్తే మన జిల్లానే ముందు వరుసలో ఉంది. వందలాది మంది ఈ పథకం కింద ఇప్పటికే రుణం పొంది యూనిట్లను స్థాపించుకోగా.. ఈ ఆర్థిక సంవత్సరంలో కూడా పెద్దఎత్తున దరఖాస్తు చేసుకుంటున్నారు. ఇలా చేసుకున్న వారు జిల్లా పరిశ్రమల కేంద్రంలో ఓ సీనియర్ ఉద్యోగికి అడిగినంత ముట్టజెబితేనే అక్కడ నుంచి ఫైలు రుణం మంజూరుకు బ్యాంకుకు వెళ్లడం మామూలైంది.

గరిష్ఠంగా రూ.50లక్షల రుణం

పీఎంఈజీపీ పథకం కింద యూనిట్లను స్థాపించుకునేందుకు గరిష్ఠంగా రూ.50లక్షల వరకూ రుణం లభిస్తోంది. తయారీ పరిశ్రమలకు అయితే రూ.50లక్షలు, సర్వీసు యూనిట్లకు అయితే రూ.20లక్షల మేర రుణం మంజూరవుతోంది. ఈ పథకం కింద మహిళలకు, ఎస్సీ, ఎస్టీలకు యూనిట్ విలువలో 35శాతం కేంద్రప్రభుత్వం సబ్సిడీగా ఇస్తోంది.

కాసులివ్వందే పనిచేయని సిబ్బంది

ఎవరైనా రూ.10లక్షల యూనిట్ ఏర్పాటుకు పీఎంఈజీపీ కింద దరఖాస్తు చేసుకుంటే రూ.10వేలు పరిశ్రమల కేంద్రంలో ముట్టజెప్పాల్సి వస్తోంది. ఈ పథకం కింద ముందు దరఖాస్తును ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఆన్‌లైన్ ద్వారా పంపుకోవాలి. యూనిట్ పూర్తి సమాచారాన్ని (డీపీఆర్) తెలియజేస్తూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. అది మొదటిగా జిల్లా పరిశ్రమల కేంద్రం లాగిన్‌లోకి వెళుతుంది. ఈ దరఖాస్తును అక్కడి అధికారులు పరిశీలించి యూనిట్ ఏర్పాటుకు ఎలాంటి ఇబ్బంది లేదంటూ బ్యాంకుకు పంపాల్సి ఉంది. అయితే ఇక్కడే మెలిక పడుతోంది. దరఖాస్తు బ్యాంకుకు వెళ్లాలంటే దరఖాస్తుదారుడు పరిశ్రమల కేంద్రం గడప తొక్కాల్సిందే. అక్కడ సీనియర్ ఉద్యోగితో మాట్లాడి

మిగతా 8వ పేజీలో

జిల్లా పరిశ్రమల కేంద్రంలో పెచ్చరిల్లిన అవినీతి

- కలెక్షన్ కింగ్‌గా ఓ సీనియర్ ఉద్యోగి
- పీఎంఈజీపీ దరఖాస్తు బ్యాంకుకు పంపాలంటే ఆయన్ను కలవాల్సిందే
- నిరుద్యోగులను నిలువు దోపిడీ చేస్తున్న సిబ్బంది



కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్ల ద్వారా రాష్ట్రప్రభుత్వం ఆయా వర్గాల నిరుద్యోగులకు రుణాలను మంజూరు చేయలేదు. దీంతో కార్పొరేషన్ల అధికారులు కూడా నిరుద్యోగులకు పీఎంఈజీపీ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా వెలుగు, డీఆర్‌డీఏ శాఖ అధికారులు కూడా మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు పీఎంఈజీపీ కింద రుణాలు ఇప్పించేందుకు దరఖాస్తులు సమర్పించారు. ఆన్‌లైన్ ద్వారా అందిన దరఖాస్తులను పరిశీలించి సంబంధిత బ్యాంకులకు పంపించడంలో తీవ్ర జాప్యం జరిగింది. ఈ విషయమై గతంలో జరిగిన సమీక్షా సమావేశంలో అప్పటి కలెక్టర్ ప్రశ్నించారు. దీంతో కార్పొరేషన్‌లకు సంబంధించి ఓ జిల్లా అధికారి ఏకంగా కలెక్టర్‌కే జిల్లా పరిశ్రమల కేంద్రంలో జరుగుతున్న వసూళ్ల గురించి వివరించారు. ఆ వెంటనే ఆ కలెక్టర్ బదిలీపై వెళ్లడంతో పరిశ్రమల కేంద్రంలో కలెక్షన్‌లకు ఏమాత్రం అడ్డుకట్ట పడలేదు.

ప్రజల భాగస్వామ్యంతో నీటి సంరక్షణ పనులు

- అధికారులకు కలెక్టర్ అన్సారియా ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అన్ని వర్గాల ప్రజలను భాగస్వాములను చేసి నీటి సంరక్షణ పనులను పెద్దఎత్తున చేపట్టాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ప్రకాశం భవన్‌లో నీటి సంరక్షణ పనులపై సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సదస్సులో కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. నీటి సంరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదన్నారు. జిల్లాలోని 57 గ్రామాల్లో పరిమితికి మించి భూగర్భ జలాలను వినియోగించినట్లు గుర్తించామన్నారు. వీటిలోని పలు గ్రామాలపై కొన్ని సంస్థలు ఇప్పటికే అధ్యయనం చేసి వాటర్ బడ్జెట్ ప్రణాళికను రూపొందించాయన్నారు. అదేతరహాలో జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఎంత నీరు అందుబాటులో ఉంది? ఎంత వినియోగిస్తున్నారు? ఇంకా నీటి అవసరం ఎంత ఉంది? తదితర విషయాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి విలేజ్ వాటర్ బడ్జెట్ ప్రణాళికను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అందులో గ్రామస్థులను భాగస్వామ్యం చేసి వారి సూచనలు, సలహాలు తీసుకోవాలన్నారు. ఇంకుడు గుంతలు, రూఫ్ టాప్ వాటర్ హార్వెస్టింగ్, ఫారం పాండ్‌లపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. నీటి సంరక్షణ కార్యక్రమాల అమలులో ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలను భాగస్వామ్యం చేయాలన్నారు. జిల్లాలో 33వేల ఇంకుడు గుంతల నిర్మాణాలకు అనుమతిచ్చినట్లు

మిగతా 8వ పేజీలో

163 పనులు.. రూ.13.88కోట్లు



- నీటి సరఫరా మెరుగునకు మంజూరు చేసిన ప్రభుత్వం
- త్వరితగతిన పనులను ప్రారంభించాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులకు మంత్రి నిమ్మల ఆదేశం

ఒంగోలు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో సాగునీటి సరఫరా మెరుగునకు తక్షణం చేపట్టాల్సిన 163 పనులకు రూ.13.88 కోట్లు మంజూరయ్యాయి. ఒక్కో పని విలువ రూ.5 లక్షల నుంచి 40 లక్షల వరకూ ఉన్నట్లు సమాచారం. ప్రధానంగా నీటి సరఫరా జరిగే కాలువల్లో జంగిల్ క్లియరెన్స్, పూడికతీత, కట్టల పటిష్ఠత, అక్కడక్కడా షట్టర్లు, డ్రాపుల నిర్మాణం వంటి పనులు ఉన్నాయి. రాష్ట్రం మొత్తం మీద ఈతరహా పనులకు ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క రూపాయి విడుదల చేసిన పాపానపోలేదు. ఫలితంగా కాలువలు, ఇతర నీటి సరఫరా జరిగే వనరులు అధ్వానంగా తయారై సరఫరా అస్తవ్యస్తంగా మారింది. ఈ దుస్థితిని తొలి సమీక్షలోనే కూటమి ప్రభుత్వం గుర్తించి తక్షణ మరమ్మతులపై దృష్టి సారించింది. సర్కిళ్ల వారీగా అత్యవసర పనులపై

మిగతా 8వ పేజీలో



సీఈ శ్యాంప్రసాద్‌కు మొక్కను ఇచ్చి స్వాగతం పలుకుతున్న ఎస్ఈ సలీం

ప్రాజెక్టుల సీఈగా శ్యాంప్రసాద్ బాధ్యతల స్వీకరణ

పనులపై అధికారులతో సమీక్ష

ఒంగోలు, అక్టోబరు 25 ఆంధ్రజ్యోతి) : జలవనరుల శాఖ ప్రాజెక్టుల విభాగం ఒంగోలు చీఫ్ ఇంజనీర్ (సీఈ)గా బి.శ్యాంప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఏలూరులో పోలవరం ప్రాజెక్టు కుడికాలువ ఎస్ఈగా పనిచేస్తున్న ఆయన్ను ఇక్కడ సీఈగా పూర్తి అదనపు బాధ్యతతో ప్రభుత్వం నియమించింది. ఇక్కడ సీఈగా పనిచేస్తున్న కె.రవికుమార్ ఆగస్టు 31న ఉద్యోగ విరమణ చేశారు. అప్పటి నుంచి ఆ పోస్టు ఖాళీగానే ఉంది. ప్రస్తుతం శ్యాంప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన పదవీకాలం వచ్చే ఏడాది అక్టోబరు వరకు ఉన్నట్లు సమాచారం. కాగా శ్యామ్ ప్రసాద్‌ను ప్రాజెక్టుల ఎస్ఈ సలీం, జలవనరులశాఖ ఎస్ఈ వరలక్ష్మి, పలువురు ఈఈలు, ఇతర ఇంజనీరింగ్ అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో నిర్మాణంలో ఉన్న వెలిగొండ ప్రాజెక్టుతోపాటు గుండ్లకమ్మ, రామతీర్థం రిజర్వాయర్లు, ఇతర ప్రాజెక్టులు, అలాగే సాగర్‌ప్రాజెక్టు కుడికాలువ పరిధిలోని ప్రకాశం, బాపట్ల, పల్నాడు, గుంటూరు జిల్లాల్లోని ఆయకట్టు, ఎడమకాలువ పరిధిలోని ఎన్టీఆర్ జిల్లాలో ఉన్న ఆయకట్టు ఇక్కడి సీఈ పర్యవేక్షణలో ఉన్నాయి. బాధ్యతల స్వీకరణ అనంతరం జిల్లాలోని ప్రాజెక్టుల పనులు, సాగర్ నీటి సరఫరాకు సంబంధించిన అధికారులతో శ్యాంపసాద్ సమీక్షించారు.



విన్యాసం.. అబ్బురం!

పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా స్థానిక పోలీసు కల్యాణ మండలంలో శుక్రవారం నిర్వహించిన ఓపెన్ హౌస్ ఎగ్జిబిషన్ విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన డాగ్‌షో అబ్బురపరిచింది. పోలీసు జాగిలాలు నిర్వహించిన విన్యాసాలు సంభ్రమాశ్చర్యాలకు గురిచేశాయి. వాటిని చూసిన విద్యార్థులు ఆనందంతో కేరింతలు కొట్టారు.

పశుగణన ప్రారంభం

- ఫిబ్రవరి వరకూ కొనసాగనున్న ప్రక్రియ

ఒంగోలు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా చేపట్టిన 21వ పశుగణన జిల్లాలో శుక్రవారం ప్రారంభమైంది. పశుసంవర్ధకశాఖ అధికారి బేబీరాణి, పశుగణన నోడల్ అధికారి చంద్రమోహన్‌లు శుక్రవారం ఉదయం కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి అందుకు సంబంధించిన షెడ్యూల్‌ను విడుదల చేశారు. అనంతరం కలెక్టర్ బంగ్లాలో ఉన్న ఆవులు, కోళ్లు, బాతులు ఇతరత్రా వివరాలను సేకరించారు. అదేసమయంలో జిల్లా అంతటా అన్ని గ్రామాల్లో సిబ్బంది చేపట్టారు. ఈ ప్రక్రియ వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకూ కొనసాగనుంది. మొత్తం 21 అంశాలకు సంబంధించిన వివరాలను పశుగణనలో భాగంగా యాప్‌లో నమోదు చేయనున్నారు. ఆవులు, గేదెలు, కోళ్లు, కుక్కలు, గుర్రాలు, గాడిదలు, ఇతరత్రా అన్నింటి వివరాలను సేకరించనున్నట్లు పశుగణన నోడల్ అధికారి చంద్రమోహన్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలుచేసే పశుగణాభివృద్ధి పథకాల రూపకల్పనలో ఈ వివరాలు కీలకమవుతాయన్నారు. ఈదృష్ట్యా జిల్లాలోని పశుపోషకులు సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.



కలెక్టర్ బంగ్లాలో పశుగణన చేస్తున్న జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి బేబీరాణి, సిబ్బంది

రియల్‌ఎస్టేట్ వ్యాపారిపై హత్యాయత్నం కేసులో

ఐదుగురి అరెస్ట్

- నిందితుల్లో గ్రేహౌండ్స్ కానిస్టేబుల్
- పరారీలో సూత్రధారి
- కేసులో ఇరుక్కున్న అమాయకులను తప్పించి కిరాయి హంతకులను పట్టుకున్న పోలీసులు
- వివరాలను వెల్లడించిన ఎస్పీ దామోదర్

వివరాలు 8వ పేజీలో..

రూ.లక్షకు వెయ్యి

(7వ పేజీ తరువాయి)

యూనిట్ విలువను బట్టి రూ.లక్షకు రూ.వెయ్యి వంతున ముట్టజెప్పాల్సిందే. లేకపోతే దరఖాస్తు తిరస్కరణకు గురవుతుంది. ఇలా నిరుద్యోగుల నుంచి పీఎంఈజీపీ కింద ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నారు.

వేలు ఖర్చుపెడితేనే రుణం మంజూరయ్యేది

పీఎంఈజీపీ పథకం కింద రుణం కోసం దరఖాస్తు చేసుకోవాలంటే నిరుద్యోగులు వేలల్లో ఖర్చు చేసుకోవాల్సి వస్తుంది. తాము స్థాపించబోయే యూనిట్ గురించి డీపీఆర్ తయారుచేయాలంటే ముందుగా ఆడిటర్‌ను కలవాలి. డీపీఆర్, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు పంపేందుకు ఆడిటర్లు రూ.2వేల నుంచి రూ.5వేలు తీసుకుంటున్నారు. ఆడిటర్ నుంచి దరఖాస్తు జిల్లా పరిశ్రమల కేంద్రానికి వెళితే రూ.లక్షకు రూ.వెయ్యి వంతున ముట్టజెబితేనే ఆ దరఖాస్తు బ్యాంకుకు వెళుతుంది. అనంతరం దరఖాస్తుదారుడు బ్యాంకు చుట్టూ తిరగాల్సి వస్తోంది. ఇలా బ్యాంకు నుంచి రుణం మంజూరు కావాలంటే వేలల్లో ఖర్చుచేయాల్సి వస్తోందని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఒంగోలుకు చెందిన ఓ నిరుద్యోగి రూ.20 లక్షల వాహనం కొనుగోలుకు దరఖాస్తుచేయగా రూ.20వేలు లంచం ఇస్తేనే జిల్లా పరిశ్రమల కేంద్రం నుంచి ఈ ఫైలు బ్యాంకుకు చేరింది. ఇలా ఎవరికీ మినహాయింపు లేకుండా ఆ శాఖలో వసూళ్లపర్వం కొనసాగుతూనే ఉంది.

దరఖాస్తులు దండిగా.. వసూళ్లు మెండుగా....

పీఎంఈజీపీ కింద రుణం కోసం జిల్లాలో ఏటా దండిగా దరఖాస్తులు వస్తున్నాయి. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎలాంటి రుణ పథకాలు అమల్లో లేకపోవడంతో జిల్లాలోని నిరుద్యోగులకు పీఎంఈజీపీ ఒక్కటే దిక్కయ్యింది. దీంతో వేలాది మంది ఈ పథకం కింద రుణం పొంది యూనిట్లను స్థాపించుకునేందుకు ఆసక్తి చూపించారు. ఇది జిల్లా పరిశ్రమల కేంద్రం అధికారులకు వరంగా మారింది. గత ఆర్థిక సంవత్సరంలో ఈ పథకం కింద మొత్తం 2,376 మంది దరఖాస్తు చేయగా ఇందులో 581 మందికి రుణం మంజూరై యూనిట్లను ఏర్పాటు చేసుకున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 88 దరఖాస్తులు వచ్చాయి. ఈ ఏడాదితోపాటు గత ఏడాది మిగిలినవి కలిపి 176 యూనిట్లను గ్రౌండింగ్ చేశారు. రుణం మంజూరైనా కాకపోయినా దరఖాస్తును బ్యాంకులకు పంపాలంటే యూనిట్ విలువలో రూ.లక్షకు రూ.వెయ్యి చొప్పున ముట్టజెప్పాల్సిందే. అప్పుడే దరఖాస్తుకు ఎలాంటి కొర్రీపడకుండా బ్యాంకులకు చేరేది.

మామూళ్లపై దృష్టిసారిస్తా

పీఎంఈజీపీ పథకం కింద రుణం కోసం దరఖాస్తు చేసుకున్న వారి నుంచి తన కార్యాలయంలో ఉద్యోగులు మామూళ్లు వసూలు చేస్తున్నారన్న ఆరోపణపై దృష్టి సారిస్తా. నిజమని తేలితే చర్యలు తీసుకుంటా. నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేయకూడదు.

శ్రీనివాసరావు, జీఎం, జిల్లా పరిశ్రమల కేంద్రం

163 పనులు.. రూ.13.88 కోట్లు

(7వ పేజీ తరువాయి)

నివేదికలు కోరింది. తదనుగుణంగా జలవనరులశాఖ ఒంగోలు సర్కిల్ పరిధిలో మొత్తం 163 పనులకు రూ.13.86 కోట్లకు అధికారులు ప్రతిపాదనలు పంపగా వాటిని మంజూరు చేసింది. అలా రాష్ట్రంలో సుమారు రూ.287 కోట్లు మంజూరు చేసినట్లు సమాచారం.

ఎన్ఎస్పీ దర్శి డివిజన్‌కు రూ.4.17కోట్లు

జిల్లాకు మంజూరైన నిధుల్లో ఎన్ఎస్పీ దర్శి డివిజన్‌లో 35 పనులకు రూ.4.71 కోట్లు మంజూరు య్యాయి. అద్దంకి డివిజన్ పరిధిలో 12 పనులకు రూ.3.29కోట్లు, రెగ్యులర్ జలవనరుల ఒంగోలు డివిజన్ పరిధిలో 70 పనులకు రూ.4.08 కోట్లు కేటాయించారు. మార్కాపురం డివిజన్‌లో 29 పనులకు రూ.1.42కోట్లు, రాళ్లపాడు ప్రాజెక్టు డివిజన్‌లో 17 పనులకు రూ.37.70 కోట్లు మంజూరయ్యాయి. ఇలాంటి పనులు అత్యవసరం ఉన్న ఎన్ఎస్పీ చీమకుర్తి డివిజన్ పరిధిలోని సంతనూతలపాడు, ఒంగోలు నియోజకవర్గాలకు ఒక్క రూపాయి కూడా మంజూరు కాలేదు. చీమకుర్తి డివిజన్ పర్యవేక్షణాధికారైన ఈఈ సకాలంలో ప్రతిపాదనలు పంపక ఆ పరిస్థితి ఏర్పడినట్లు సమాచారం.

తక్షణం టెండర్లు

పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి అన్ని జిల్లాల జలవనరుల శాఖ అధికారులతో శుక్రవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఒంగోలు నుంచి సీఈ శ్యాంప్రసాద్, ఎస్ఈలు వరలక్ష్మి, అబుల్ సలీం, ఈఈలు రామకృష్ణ, నాగమురళీమోహన్, శివరాం తదితరులు హాజరయ్యారు. రూ.20 లక్షల లోపు పనులకు టెండర్ పిలిచే అధికారం ఈఈలది కాగా ఇప్పటికే పనుల ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నందున తక్షణం టెండర్లు పిలవాలని మంత్రి ఆదేశించారు. అలాగే పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి నిమ్మల అధికారులను ఆదేశించారు.

ప్రజల భాగస్వామ్యంతో నీటి సంరక్షణ పనులు

(7వ పేజీ తరువాయి)

కలెక్టర్ తమీమ్ అన్సారియా చెప్పారు. మండలానికి వెయ్యి నిర్మించేలా లక్ష్యాన్ని నిర్దేశించడంతోపాటు జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీలో ఒకే రోజున నమూనా ఇంకుడు గుంత నిర్మాణం చేపట్టి దాని వలన ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నీటి సంరక్షణ కార్యక్రమాల్లో స్వయం సహాయక సంఘాల సభ్యులను కూడా భాగస్వాములను చేయాలన్నారు. సమావేశంలో డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు విద్యాసాగర్, చిరంజీవి, శ్రీనివాసరావు, వసుంధర, రవికుమార్, వెంకటేశ్వరరావుతోపాటు పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

నేటి నుంచి సభ్యత్వ నమోదు

(7వ పేజీ తరువాయి)

నిర్వహించారు. శుక్రవారం రాత్రి ఒంగోలు నియోజకవర్గస్థాయి సమావేశం ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఆధ్వర్యంలో జరిగింది. నగరంలోని వార్డుల వారీ, రూరల్ ప్రాంతంలో గ్రామాల వారీ సభ్యత్వ చేర్పింపు లక్ష్యాలను నిర్దేశించుకున్నారు. అలాగే దర్శి నియోజకవర్గంలో ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి నేతృత్వంలో సమావేశం జరిగింది. ఇతర చోట్ల కూడా ఇలాంటి సమావేశాలు నిర్వహించారు. సభ్యత్వ నమోదు డిజిటల్ రూపంలో చేయనున్నారు. ఫోన్, టెలిగ్రాం యాప్‌లో, ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లోనూ నమోదు చేసేలా సాఫ్ట్‌వేర్ రూపొందించారు. రాష్ట్రంలో మారిన రాజకీయ పరిస్థితులు, కూటమి ప్రభుత్వం ఏర్పడటం తదితర సానుకూల పరిస్థితులలో పూర్తి జోష్ మీద ఉన్నటీ డీపీ శ్రేణులు పెద్దఎత్తున సభ్యత్వం తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు గడువు పెంపు

ఒంగోలు నగరం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎస్సీ, ఎస్టీలకు డీఎస్సీ పరీక్షకు ఉచిత కోచింగ్‌కు ఇచ్చేందుకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం గడువును పొడిగించిందని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.లక్ష్మానాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత వసతి, భోజన సౌకర్యంతో శిక్షణ పొందేందుకు ఈ నెల 27వ తేదీ వరకు గడువు పెంచిదన్నారు. అభ్యర్థులతో పాటు శిక్షణ ఇచ్చే సంస్థల యజమానులు కూడా తమ సంస్థ దరఖాస్తులను జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.



జాకీ, మ్యాగీ జాగిలాలతో డాగ్ షో చేయిస్తున్న పోలీసులు



మ్యాగీ జాగిలంతో చిన్నారుల కరచాలనం



డ్రోన్ వినియోగంపై వివరిస్తున్న ఎస్పీ

విన్యాసం.. అబ్బురం!

- ఆసక్తిరేకెత్తించిన డాగ్‌షో
- ఓపెన్ హౌస్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన ఎస్పీ

పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా స్థానిక పోలీసు కల్యాణ మండలంలో శుక్రవారం నిర్వహించిన ఓపెన్ హౌస్ ఎగ్జిబిషన్ విశేషంగా ఆకట్టుకుంది. జాగిలాల షో ఆసక్తిదాయకంగా సాగింది.

జాకీ జాలం జంప్ అదుర్స్

నేరపరిశోధనలో ఆరితేరిన జాకీ జాగిలం లక్ష్యాన్ని ఛేదించేందుకు చేసిన అడిల్స్ జంప్ (మంటల్లో నుంచి దూకడం) ఉత్కంఠభరితంగా సాగింది. కేవలం కర్తవ్య నిర్వహణ మాత్రమే తన ముందు ఉన్న లక్ష్యం అంటూ అగ్నిగోళాన్ని లెక్క చేయకుండా జంప్ చేస్తూ నేరాన్ని ఛేదించేందుకు ముందుకు సాగిన వైనం ఆకట్టుకుంది. రెండు ప్రాంతాల్లో అగ్నిగోళాలనూ, మరో రెండు ప్రాంతాల్లో ఎత్తుగా ఉన్న ఇనుప కంచెలనూ దాటుకుని నేర పరిశోధనలో కీలకమైన ఆధారాన్ని పట్టుకుని హ్యాండ్లర్ (జాగిలం మాస్టర్) చేతికి ఇచ్చింది.

నేర పరిశోధనలో మ్యాగీ జాగిలం సూపర్

ఐదు సూట్ కేసులు వరుసగా పెట్టి.. వాటిలో రెండు సూట్‌కేసుల్లో పేలుడు పదార్థాలు ఉంచి మ్యాగీ జాగిలాన్ని వదిలారు. అన్నింటినీ వాసను చూసుకుంటూ వెళ్లి పేలుడు పదార్థాలున్న సూట్‌కేసులు వద్ద చుట్టూ తిరిగి అక్కడే కూర్చుండి పోవడం చూసి విద్యార్థులు నివ్వెరపోయారు. నేర పరిశోధనలో ఆధారాల సేకరణకు జాగిలాలు పోలీసులకు ఎంతగా తోడ్పడతాయో ఈ ప్రదర్శన చూసి విద్యార్థులు చర్చించుకున్నారు.

పోలీసు ఆయుధాలు ప్రదర్శన

ఎస్పీ మల్టీషెల్ లాంచర్‌తో పోలీసు గురి తప్పదంటూ చూపిన ప్రదర్శన విద్యార్థులను ఆకట్టుకుంది. పోలీసు విధి నిర్వహణలో వినియోగించే ఆయుధాలు, వాటి పనితీరుపై విద్యార్థులకు ఎస్పీ దామోదర్ వివరించారు. ఏకే -47, ఎస్ఎల్ఆర్ గన్స్ రైఫిల్స్ లాంటి పరికరాలు వాటి వినియోగాన్ని వివరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె.నాగేశ్వరరావు, ఏఆర్ అదనపు ఎస్పీ ఆశోక్ బాబు, ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, సీఐలు పాల్గొన్నారు.

- ఒంగోలు క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి)



బాంబును గుర్తిస్తున్న మ్యాగీ జాగిలం



ఆయుధాలను ప్రదర్శిస్తూ..



ఆయుధాలను వివరిస్తూ..

రియల్‌ఎస్టేట్ వ్యాపారి హత్యాయత్నం కేసులో

ఐదుగురు నిందితుల అరెస్టు

- వారిలో గ్రేహౌండ్స్ కానిస్టేబుల్
- పరారీలో సూత్రధారి
- కేసులో ఇరుక్కున్న అమాయకులను తప్పించి కిరాయి హంతకులను పట్టుకున్న పోలీసులు
- వివరాలను వెల్లడించిన ఎస్పీ దామోదర్

ఒంగోలు క్రైం, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ వ్యాపారంలో వచ్చిన వివాదం కారణంగా ఒకరిపై హత్యాయత్నం చేసిన నిందితులను పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసులో సూత్రధారి పరారీలో ఉండగా, ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. హత్యాయత్నం పథకం రూపొందించిన రియల్ ఎస్టేట్ వ్యాపారి పోలీసులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశాడు. ఈ మేరకు శుక్రవారం ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎస్పీ ఏఆర్.దామోదర్ ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. పొదిలిలో ఈనెల 5 తేదీన పెమ్మని ఓంకార్‌పై ఆయనతో రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేసే పొల్లా రమేష్ హత్యాయత్నం చేయించాడు. అందుకు సంబంధించిన కేసులో రమేష్ పరారీలో ఉండగా నిందితులు పొదిలి మండలం కొన్తలపల్లికి చెందిన దొండ్ల రామిరెడ్డి, చీమకుర్తి మండలం బక్కిరెడ్డిపాలెం నకు చెందిన గ్రేహౌండ్స్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఇట్టా భాస్కరరావు, కంభం మండలం రావిపాడుకు చెందిన జగన్నాథం సిసింద్రీ, దూదేకుల నాయబ్‌రసూల్, బేస్తవారపేటకు చెందిన మునగపాటి బాలశివప్రసాద్‌లను అరెస్టు చేసినట్లు ఎస్పీ తెలిపారు. శుక్రవారం ఉదయం పొదిలిలోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఈ ఐదుగురిని సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అరెస్టు చేసినట్లు ఆయన చెప్పారు.

హత్యాయత్నం జరిగింది ఇలా...

రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే పొల్లా రమేష్, పెమ్మని ఓంకార్ మధ్య గొడవలు వచ్చాయి. దీంతో ఓంకార్‌ను మట్టుపెట్టాలని రమేష్ పథకం రూపొందించాడు. ఆ విషయాన్ని దొండ్ల రామిరెడ్డితో చర్చించాడు. వారు ఇరువురు కలిసి హైదరాబాద్‌లో గ్రేహౌండ్స్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ ఇట్టా భాస్కర్‌రావును సంప్రదించారు. ఆయనకు పెద్దమొత్తంలో నగదు ఆశ చూపించి, అతనికి రెవెన్యూ కార్యాలయంలో ఉన్న పనులు చేయిస్తామని



మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

నమ్మించి ఓంకార్‌ను హత్య చేయాలని కోరాడు. వెంటనే భాస్కరరావు తన మేనల్లుడు అయిన సిసింద్రీ ద్వారా నాయబ్‌రసూల్, బాలశివసాద్‌లను కలుపుకుని నలుగురు కలిసి పలుమార్లు పొదిలిలో ఓంకార్‌ను హత్య చేసేందుకు ప్రయత్నం చేశారు. ఈక్రమంలో ఈనెల 5వ తేదీన రాత్రి 11గంటల సమయంలో ఓంకార్ తన బైక్‌పై వస్తుండగా నిందితులు విచక్షణారహితంగా మారణాయుధాలతో కొట్టడంతో తీవ్రంగా గాయపడిన ఓంకార్ మృతి చెందాడని వారు వెళ్ళిపోయారు. అయితే చావు అంచుల దాకా వెళ్లిన ఓంకార్ చికిత్స పొంది బతికాడు. ఈమేరకు ఓంకార్ సోదరుడు పెమ్మని బాలవెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు పొదిలి పోలీసులు కేసు నమోదు చేశారు.

పోలీసులను తప్పుదొవ పట్టించే ప్రయత్నం

అయితే కేసు దర్యాప్తులో సూత్రధారి పొల్లా రమేష్ పోలీసులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశాడు. హత్యాయత్నంలో పాల్గొన్న వారిలో నలుగురు బదులుగా మరో నలుగురుని పొదిలి పోలీస్‌స్టేషన్‌కు పంపించి తామే ఈ పని చేశామని ఒప్పించేలా చేశాడు. అందుకు వారికి ఒక్కోక్కరికి రూ.లక్ష చొప్పున ఇస్తానని రమేష్ ఒప్పదం చేసుకున్నాడు. దీంతో కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు తమదైన శైలిలో విచారించగా వారు అమాయికులని తేలింది. ఎట్టకేలకు వారిని వదిలి వేసి నేరం చేసిన నిందితులను పట్టుకొని అరెస్టు చేశారు.

ఎస్పీ అభినందన

హత్యాయత్నం కేసులో డబ్బు కోసం ఆశపడి ఇరుకున్న అమాయకులను రక్షించి అసలైన కిరాయి హంతకులను పట్టుకున్న దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ, పొదిలి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ వేమన, పోలీసు సిబ్బందిని ఎస్పీ దామోదర్ ప్రత్యేకంగా అభినందించారు.

రవాణాశాఖ సాఫ్ట్‌వేర్‌లో మార్పులు

- నెలాఖరులోపు ఈ-ప్రగతి నుంచి వాహన్‌లోకి..
- జాయింట్ కమిషనర్ శివప్రసాద్

ఒంగోలు క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రవాణాశాఖలో ప్రస్తుతం ఉన్న సాఫ్ట్‌వేర్‌ను మార్పు చేస్తున్నట్లు జిల్లా జాయింట్ కమిషనర్ ఎస్.శివప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఒంగోలులోని క్విజ్ కాలేజీలోని కాన్ఫరెన్స్‌హాలులో ఉమ్మడి గుంటూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాలలో పనిచేసే రవాణాశాఖ సిబ్బంది, అధికారులతో పాటు వాహనదారులకు ఫైనాన్స్ చేసే కంపెనీ ప్రతినిధులకు నూతన సాఫ్ట్‌వేర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జాయింట్ కమిషనర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు రవాణాశాఖ సాఫ్ట్‌వేర్ ఈ-ప్రగతిలో ఉందని, ఈనెలాకరిలోపు వాహన్‌లోకి మార్పు చేస్తామన్నారు. అందుకు అనుగుణంగా వచ్చే సమస్యల పరిష్కారం కోసం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉదయం సెషన్‌లో ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు, సాయంత్రం రవాణాశాఖలో పనిచేస్తున్న సిబ్బందికి శిక్షణ ఇప్పించామని తెలిపారు. అవగాహన కార్యక్రమాన్ని ఆహ్లాదకరమైన వాతావరణంలో ఏర్పాటు చేసిన డీటీసీ ఆర్.సుశీల, సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో మార్కాపురం ఆర్టీవో అమర్‌నాయక్, ఎంవీఐలు కిరణ్‌ప్రభాకర్, రామచంద్రరావు, సురేంద్రప్రసాద్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న జాయింట్ కమిషనర్

జైళ్లశాఖ పెట్రోల్‌బంకులో దసరా మామూళ్లు

- బెంబేలెత్తున్న వాహనదారులు

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ వెళ్ళిపోయి పదిరోజులు అయినా ఇంకా మామూళ్ల వసూలు ఇంకా కొనసాగుతోంది. ఒంగోలు నగరం రైల్వే స్టేషన్‌రోడ్‌లోని జైళ్లశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్‌బంకులో ముక్కుపిండి మరీ దసరా మామూళ్లు వసూలు చేస్తున్నారు. శుక్రవారం ఓ వ్యక్తి రూ.500లు ఇచ్చి రూ.200లకి పెట్రోలు కొట్టాలని కోరారు. బంకులో పనిచేస్తున్న ఓ ఖైదీ పెట్రోలు కొట్టి మిగిలిన డబ్బులు ఇవ్వకపోవడంతో వాహనదారుడు తనకు రావాల్సిన నగదు అడిగారు. అయితే అది దసరా మామూలు, ఇవ్వబోమని సదరు పంప్ బాయ్ (డ్యూటీలో ఉన్న ఖైదీ) చెప్పారు. అదేమని అడగ్గా బిర్యానీతో కలుపుకుని రూ.300 అని చెప్పడంతో వాహనదారుడు అవాక్కయ్యాడు. అసలు దసరా మామూలు ఎందుకు ఇవ్వాలని అడగటంతో రూ.100 డిమాండ్ చేసి మరీ తీసుకుని రూ.200 ఇవ్వడంతో ఏమిచేయాలో తోచక వాహనదారడు ఇంటిబాట పట్టాడు. దీనిపై జైళ్లశాఖ అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వాహనదారులు కోరుతున్నారు. గత నెల 10వ తేదీ నుంచి మొదలైన దసరా మామూళ్లపర్వం బంకులో ఇంకా కొనసాగుడంతో వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు.

పట్టించుకోకుంటే ప్రమాదం!

- చేతికి అందే ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్లు

ఒంగోలు క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : నగరంలో పలుచోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదభరితంగా మారుతున్నాయి. దిమ్మె ఐదు అడుగులు ఎత్తు కూడా లేకుండా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. పైగా వాటి చుట్టు రక్షణ కంచె లేకపోవడం, చిల్లచెట్లు పెరగడంతో మరింత ప్రమాదకరంగా మారింది. నిత్యం ప్రజలు రాకపోకలు సాగించే స్థానిక గాంధీరోడ్డు చావడి వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చూస్తే ఎవరైనా భయపడాల్సిందే. శివారు ప్రాంతమైన ఇందిరమ్మకాలనీలో రోడ్డు ఎత్తు లేని సమయంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు ప్రస్తుతం రోడ్డు వేయడంతో ఎత్తు తగ్గిపోయింది. దీంతో ఆ ప్రాంతాల్లో చిన్నపిల్లలు తెలియక అటు వైపు వెళ్లి ప్రమాదాల బారినపడే అవకాశం ఉందని వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఎత్తు తక్కువలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను ఎత్తైన దిమ్మెలపై ఏర్పాటు చేసి చుట్టూ కంచే వేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



రైల్‌పేటలో ఇలా..



కొత్తపట్నం రోడ్డులోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద ఇలా..



కొత్తపట్నం రోడ్డులోని రైతు బజార్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే వాహనాలు



మామిడిపాలెంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను అల్లుకున్న తీగలు



రాజీవ్‌గృహకల్ప 5వ వీధిలో రోడ్డు కన్నా తక్కువ ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్

డీపీవోను కలిసిన ఎంపీడీవో సుందరరామయ్య


డీపీవోకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీడీవో సుందరరామయ్య

తాళ్లూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాపంచాయతీఅధికారి(డీపీఓ) గొట్టిపాటి వెంకటనాయుడును ఎంపీడీవో కల్లూరి సుందరరామయ్య ఒంగోలు జిల్లా కార్యాలయంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలో పారిశుద్యం పరిరక్షణకు తీసుకుంటున్న చర్యల గురించి,అభివృద్ధికార్యక్రమాలు ఇతరఅంశాలపై చర్చించారు. డీపీవోను కలిసిన వారిలో తాళ్లూరుగ్రామపంచాయతీ కార్యదర్శి ఇడమకంటి రమణారెడ్డిఉన్నారు.

తాళ్లూరులో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి


బ్లీచింగ్ చల్లుతున్న సిబ్బంది

తాళ్లూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) : తాళ్లూరులో పారిశుధ్య పనులను వేగవంతం చేశారు. ఎంపీడీవో కె.సుందరరామయ్య ఆదేశంతో సర్పంచ్ చార్లెస్‌సర్జన్, పంచాయతీకార్యదర్శి ఐ.రమణారెడ్డిలు గతవారం రోజులుగా పారిశుధ్య పనులు చేయిస్తున్నారు. అలాగే 300పైగా కుక్కలను పట్టించి ఇతరప్రాంతాలకు తరలించారు. ఎస్సీ కాలనీల్లోని మురుగు కాలువ పూడిక తీత పనులు చేపట్టారు. దోమలు ఉధృతి చెందకుండా గ్రామ వీధులన్నింటిలో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు.

శ్రీనివాసులు మృతికి సంతాపం

పామూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : పామూరుకు చెందిన కాపు సంఘం నాయకులు ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి గద్దె శ్రీనివాసులు మృతదేహానికి శుక్రవారం టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యుడు ఆకుపాటి వెంకటేష్, రియల్టర్ పువ్వాడి వెంకటేష్, నీరుకట్టు నాయబ్‌రసూల్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీనివాసులు అకాల మృతి పట్ల ఎమ్మెల్యే ఉగ్ర, ఏఎంసీ మాజీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, బైరెడ్డి జయరామిరెడ్డి, సయ్యద్ అమీర్‌బాబు, ఉప్పలపాటి హరిబాబు, డాక్టర్ గద్దె ఏడుకొండలు సంతాపం తెలిపారు.

28 నుంచి శనగ విత్తనాల కోసం రిజిస్ట్రేషన్

కొండపి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ప్రభుత్వం రాయితీపై ఇచ్చే శనగ విత్తనాల రిజిస్ట్రేషన్ ఈనెల 28 నుంచి ప్రారంభమవుతుందని మండల వ్యవసాయశాఖఅధికారి డి.విజయ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం 25శాతం సబ్సిడీ ఇస్తుందన్నారు. క్వింటా ఎర్ర శనగలు ఖరీదు రూ.9,400 కాగా అందులో రాయితీ రూ.2,350 పోను 7,050 చెల్లించాల్సి ఉంటుందన్నారు. తెల్ల శనగలు క్వింటా రూ.12,100 ఉండగా అందులో సబ్సిడీ రూ.3,025 పోను రూ.9,075 చెల్లించాలని ఏవో వివరించారు. రైతులు వారి ఆధార్ కార్డు, పొలం పాస్‌పుస్తకం, ఫోన్ నంబరుతో వచ్చి ఓటీపీ చెప్పి శనగ విత్తనాలు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆయన సూచించారు.

బ్యారన్ రిజిస్ట్రేషన్ గడువు పొడిగింపు

టంగుటూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : పొగాకు బ్యారన్ రెన్యువల్, రిజిస్ట్రేషన్ గడువును వచ్చేనెల 25 వరకూ పొడిగించినట్లు స్థానిక వేలం కేంద్రం సూపరింటెండెంట్ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. అప్పటి వరకూ ఎలాంటి అపరాధ రుసుం ఉండదన్నారు. వచ్చేనెల 25 నుంచి డిసెంబర్ 9వ తేదీ వరకూ రూ.100 పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుందన్నారు. డిసెంబరు 9 తర్వాత రూ.400 అపరాధ రుసుంతో అదే నెల 19వరకూ బ్యారన్ రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేసుకోవచ్చని తెలిపారు.

సెక్టోరల్ పోస్టులకు సర్టిఫికెట్ల పరిశీలన

ఒంగోలు విద్య, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు కార్యాలయంలో ఖాళీగా ఉన్న సెక్టోరల్, అసిస్టెంట్ సెక్టోరల్ పోస్టులకు దరఖాస్తు చేసిన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన శుక్రవారం స్థానిక సమగ్రశిక్ష ప్రాజెక్టు కార్యాలయంలో ప్రారంభించారు. సీఎంవో పోస్టుకు 17మంది, ఐఈసీవో పోస్టుకు 8, ఏఎల్ఎస్ కో ఆర్డినేటర్ పోస్టుకు 14, జీసీడీవో పోస్టుకు 2, ఎంఐఎస్అండ్ ప్లానింగ్ కోఆర్డినేటర్ పోస్టుకు 9, ఏఎస్‌వో పోస్టుకు 8 మంది మొత్తం ఆరు పోస్టులకు 58మంది దరఖాస్తులు చేసుకున్నారు. అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన శనివారం కూడా జరగనుంది.

27లోపు డీఈఎల్ఈడీ పరీక్ష ఫీజు చెల్లించాలి

ఒంగోలు విద్య, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రైవేటు డీఈఎల్ఈడీ కళాశాలల్లో 2018-20 బ్యాచ్ మేనేజ్‌మెంట్, స్పాట్ అడ్మిషన్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఈనెల 27వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చని డైట్ ప్రిన్సిపాల్ కె.నారాయణరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అపరాధ రుసుంతో ఈనెల 31వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చు. మూసివేసిన ప్రైవేటు డీఈడీ కళాశాల లాగిన్ ఝైనంపాడు ప్రభుత్వ డైట్‌కు ఇచ్చినందున 2018-20 బ్యాచ్ విద్యార్థులు ఝైనంపాడు డైట్ నుంచి పరీక్ష ఫీజు చెల్లించవచ్చని ఆయన పేర్కొన్నారు.

రేపు జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక, విద్యాశాఖ సహకారంతో ఆదివారం చీమకుర్తిలోని చీమకుర్తి పబ్లిక్ స్కూలులో జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నట్లు జేవీవీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మండ్లా శ్రీనివాసులు, జయప్రకాష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా అక్టోబరు 1తేదీన జరిగిన మండల స్థాయి చెకుముకి పరీక్షల్లో మొదటి స్థానం సాధించిన విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు హాజరుకావాలని కోరారు. వివరాలకు 9440522775, 9849868311 సెల్ నెంబర్లను సంప్రదించాలని వారు సూచించారు.

మందుబాబు ఆత్మహత్యాయత్నం

రూ.99కు క్వార్టర్ ఇవ్వడం లేదని ఆగ్రహం

రాయవరంలో మద్యం దుకాణం వద్ద ఘటన


మద్యం షాపు వద్ద ఒంటిపై డీజిల్ పోసుకుంటున్న వెంకటేశ్వర్లు

మార్కాపురం రూరల్, అక్టోబర్ 25 (ఆంధ్రజ్యోతి) : క్వార్టర్ మద్యం సీసా రూ.99కే ఇవ్వలేదని ఓ మందుబాబు ఆత్మహత్యకు యత్నించాడు. ఈ ఘటన ప్రకాశం జిల్లా మార్కాపురం మండలం రాయవరంలో గురువారం రాత్రి చోటుచేసుకొంది. రాయవరం రైల్వేస్టేషన్ సమీపంలోని ఓవర్ బ్రిడ్జి వద్ద లైసెన్స్ మద్యం దుకాణం ఉంది. అక్కడకు రాయవరానికి చెందిన తిమ్మిశెట్టి వెంకటేశ్వర్లు మద్యం కోసం వెళ్లాడు. రూ.99కి క్వార్టర్ ఇవ్వాలని కోరాడు. స్టాక్ లేదని చెప్పడంతో అక్కడే నిరసనకు దిగాడు. ప్రభుత్వం చెప్పిన ప్రకారం తనకు రూ.99 మద్యం కావాల్సిందే అని పట్టుబట్టారు. అనంతరం వెంటతెచ్చుకున్న డీజిల్‌ను ఒంటిపై పోసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. దీంతో చుట్టుపక్కలవారు అడ్డుకున్నారు. అనంతరం ఆయన్ను వారించి ఇంటికి పంపించారు. ఘటనపై ఎక్సైజ్ సీఐ వెంకటరెడ్డిని వివరణ కోరగా.. ప్రస్తుతం క్వార్టర్ మద్యం రూ.99కే వస్తున్నదన్నారు. ప్రభుత్వం రేషన్ విధించి అందరికీ సర్దుబాటు చేస్తున్నదన్నారు. రాయవరం దుకాణానికి 3 కేసుల మద్యం వస్తే అది కొద్దిసేపట్లోనే అయిపోయిందని తెలిపారు. వెంకటేశ్వర్లు అనే వ్యక్తికి వైన్‌షాప్ నిర్వాహకులు 99 రూపాయల మద్యం లేదని చెప్పడంతో ఒంటిపై డీజిల్ పోసుకున్నట్లు తెలిసిందన్నారు. ఎక్సైజ్ శాఖకు ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదు.





చీమకుర్తి కూరగాయల మార్కెట్‌కు మోక్షం

- ఏడేళ్లుగా నిరుపయోగంగా మారిన వైనం
- 13షాపులకు 28న వేలం
- ఈసారైనా దుకాణాలు తెరుచుకునేనా..

చీమకుర్తి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) : చీమకుర్తి పట్టణంలో దాతల సహకారంతో నిర్మించిన కూరగాయల మార్కెట్‌కు ఎట్టకేలకు మోక్షం కలగనుంది. గత ఏడేళ్లుగా నిరుపయోగంగా మూతపడి ఉన్న మార్కెట్ నిర్వహణకు ఎట్టకేలకు మార్గం సుగమం అయింది. అందులోని 13షాపులకు ఈనెల 28వ తేదీన ఉదయం 11.30లకు స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో వేలం నిర్వహించనున్నట్లు కమిషనర్ వై.శివరామకృష్ణయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోటరీ క్లబ్ ఆఫ్ చీమకుర్తి, మాజేటి హనుమాన్‌ల ఆధ్వర్యంలో నిర్మించిన మాజేటి సువర్చలా దేవి కూరగాయల మార్కెట్‌ను గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు అప్పటి మంత్రి శిద్దా రాఘవరావు చేతులమీదుగా ప్రారంభోత్సవం నిర్వహించారు. తర్వాత ఒకసారి షాపులకు వేలం నిర్వహించగా బాగానే స్పందన వచ్చింది. కానీ షాపులను వేలంలో దక్కించుకున్న వారు మార్కెట్‌లో అమ్మకాలను సాగించకుండా పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో అనువుగా ఉన్నచోట వ్యాపారం చేసుకున్నారు. దీంతో మార్కెట్‌లో షాపులు తెరుచుకోలేదు. అప్పటి వైసీపీ ప్రభుత్వం హయాంలో వేలం నిర్వహణ జోలికి పోలేదు. దీంతో అసలే ఆదాయ వనరులు లేని మున్సిపాలిటీలో ఆదాయం వచ్చే కూరగాయల మార్కెట్ నిర్వహణ కూడా మూలనపడటంతో నిధులకు కటకటలాడాల్సి వచ్చింది. కూటమి ప్రభుత్వం రావటం, నూతన కమిషనర్ బాధ్యతలు చేపట్టిన తర్వాత కూరగాయలమార్కెట్‌ను తెరిపించాలనే విషయంపై దృష్టి సారించారు. కాగా వేలంలో షాపులు దక్కించుకున్నవారు మార్కెట్‌లోనే వ్యాపారాలను నిర్వహించటం అనేది అధికారులకు సవాల్‌గా మారనుంది. అందరం రూ.లక్షలు వెచ్చించి వేలంలో దక్కించుకున్న తర్వాత వ్యాపారం ఇక్కడే నిర్వహించాలంటే వారికి ఒక సమస్య వేధిస్తుంది.



నిరుపయోగంగా ఉన్న కూరగాయల మార్కెట్

వేలం ముగిసిన తర్వాత నిబంధనలు మేరకు పట్టణంలో మార్కెట్లో తప్ప మరోచోట కూరగాయలు విక్రయించటానికి వీలులేదు. కానీ ఈ నిబంధనలు అమలు చేయటం ప్రాక్టికల్‌గా అధికారులకు కష్టసాధ్యం అవుతుంది. మరో చోట షాపులు పెట్టకుండా నివారించకలిగినా తోపుడు బండ్లు మీద కూరగాయల విక్రయాలు సాగించే వారిని అమ్మకాలు సాగించకుండా నిలువరించటం అంత తేలికగా జరగదు. దీంతో రూ.లక్షలు వెచ్చించి షాపులు దక్కించుకొని ఇపుడు ఎంతో ఆదాయం లభిస్తున్న చోటును వదలి మార్కెట్‌లో షాపు పెడితే తమకు ఎంతవరకు గిట్టుబాటు అవుతుందనే ఆలోచనలో ప్రస్తుతం కూరగాయల వ్యాపారాన్ని వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తున్నవారు ఉన్నారు. అందుకే వేలంలో షాపు పాడుకొంటే వ్యాపారం చేసుకోవటానికి లైసెన్స్ ఉంటుంది కాబట్టి గతంలో వలే తమకు ఇష్టం వచ్చినచోటనే వ్యాపారం చేసుకోవచ్చని వ్యాపారులు చేస్తున్న యోచన, అధికారుల ఆలోచనకు విరుద్ధంగా ఉంది. ఈ సమస్యను ఎలా అధిగమిస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది. ఈసారైనా కూరగాయల మార్కెట్ తలుపులు తెరుచుకుంటాయే లేదో వేచి చూడాల్సి ఉంది. కాగా దినసరి మార్కెట్ నిర్వహణ, కబేళాలు, చేపల మార్కెట్ల రుసుము వసూలు చేసే హక్కు కోసం ఈ నెల 28న వేలం నిర్వహించనున్నారు.

రైల్వే మంత్రిత్వశాఖ సంప్రదింపుల కమిటీ సభ్యునిగా మాగుంట

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రైల్వేశాఖకు సంబంధించిన సంప్రదింపుల కమిటీ చైర్మన్‌గా ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ సెక్రటరీ ఉమాంగ్‌నారుళ్ళ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.



స్పీకర్‌ను సత్కరిస్తున్న ఎంపీ మాగుంట

లోక్‌సభ స్పీకర్‌తో..

లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాను ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఢిల్లీలోని స్పీకర్ కార్యాలయంలో ఎంపీ మాగుంట గృహ, పట్టణ వ్యవహారాల కమిటీ చైర్మన్ హోదాలో కలిశారు. ఈ సందర్భంగా ఓంబిర్లాను శాలువతో సత్కరించారు. అనంతరం పలు అంశాలపై స్పీకర్‌తో మాగుంట చర్చించారు.

నేడు లాకళాశాలలో గ్రాడ్యుయేషన్ డే

ఒంగోలు విద్య, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని ఇందిర ప్రియదర్శిని న్యాయ కళాశాలలో శనివారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపా ల్ డాక్టర్ కె.నాటరాజకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2021-24 బ్యాచ్‌మూడు సంవత్సరాల విద్యార్థులు, 2019-24 బ్యాచ్ ఐదు సంవత్సరాల విద్యార్థులు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రిటైర్డ్ హైకోర్టు జడ్జి కే జీ.శంకర్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు.

రేపు జిల్లా స్థాయి చెకుముకి సంబరాలు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక, విద్యాశాఖ సహకారంతో ఆదివారం చీమకుర్తిలోని చీమకుర్తి పబ్లిక్ స్కూలులో జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నట్లు జేవీవీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మండ్లా శ్రీనివాసులు, జయప్రకాష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా అక్టోబరు 1తేదీన జరిగిన మండల స్థాయి చెకుముకి పరీక్షల్లో మొదటి స్థానం సాధించిన విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు హాజరుకావాలని కోరారు వివరాలకు 9440522775, 9849868311 సెల్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

పౌష్టికాహారం అందజేత

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీకోటయ్య మెమోరియల్ సొసైటీ ద్వారా హెచ్‌ఐవీతో బాధపడుతున్న వారికి ప్రతి నెలా పౌష్టికాహారాన్ని అందజేసి వారికి అండగా నిలుస్తున్నామని సొసైటీ గౌరవాధ్యక్షుడు డి.ప్రేమ్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక పాత మార్కెట్ సెంటర్‌లోని సొసైటీ కార్యాలయంలో శుక్రవారం పది మంది బాధితులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు అయినాబత్తిన ఘనశ్యాం, కిశోర్, రాఘవ, సీహెచ్. శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.



పౌష్టికాహారం అందజేస్తున్న ప్రేమ్‌కుమార్

సెక్టోరల్ పోస్టులకు సర్టిఫికెట్ల పరిశీలన

ఒంగోలు విద్య, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు కార్యాలయంలో ఖాళీగా ఉన్న సెక్టోరల్, అసిస్టెంట్ సెక్టోరల్ పోస్టులకు దరఖాస్తు చేసిన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన శుక్రవారం స్థానిక సమగ్రశిక్ష ప్రాజెక్టు కార్యాలయంలో ప్రారంభించారు. సీఎంవో పోస్టుకు 17మంది, ఐఈసీవో పోస్టుకు 8, ఏఎల్ఎస్ కో ఆర్డినేటర్ పోస్టుకు 14, జీసీడీవో పోస్టుకు 2, ఎంఐఎస్అండ్ ప్లానింగ్ కోఆర్డినేటర్ పోస్టుకు 9, ఏఎస్‌వో పోస్టుకు 8 మంది మొత్తం ఆరు పోస్టులకు 58మంది దరఖాస్తులు చేసుకున్నారు. అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన శనివారం కూడా జరగనుంది.

డీఈఎల్ఈడీ పరీక్ష ఫీజు చెల్లించాలి

ఒంగోలు విద్య, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రైవేటు డీఈఎల్ఈడీ కళాశాలల్లో 2018-20 బ్యాచ్ మేనేజ్‌మెంట్, స్పాట్ అడ్మిషన్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఈనెల 27వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చని డైట్ ప్రిన్సిపాల్ కె.నారాయణరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అపరాధ రుసుంతో ఈనెల 31వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చు. మూసివేసిన ప్రైవేటు డీఈడీ కళాశాల లాగిన్ మైనంపాడు ప్రభుత్వ డైట్‌కు ఇచ్చినందున 2018-20 బ్యాచ్ విద్యార్థులు మైనంపాడు డైట్ నుంచి పరీక్ష ఫీజు చెల్లించవచ్చన్నారు.

విద్యార్థులకు నాసా కిట్స్ అందజేత



విద్యార్థులకు నాసా కిట్స్ అందజేస్తున్న ప్రతినిధులు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక లాయర్‌పేటలోని శ్రీచైతన్య స్కూలులో విద్యార్థులకు నాసా కిట్స్‌ను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా నాసా కో ఆర్డినేటర్ వెంకటరమణ మాట్లాడుతూ నాసా ప్రయోగాలను వివరించారు. ప్రిన్సిపాల్ జోసఫ్‌తంబి మాట్లాడుతూ పరిశోధనలపై విద్యార్థులు ఆసక్తి పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ అనిల్, పర్యవేక్షకులు జి.శ్రీనివాసరావు, డీన్ బాలసుబ్రహ్మణ్యం, నాసా ఇన్‌చార్జి మధుస్మిత, వైస్‌ప్రిన్సిపాల్ శివపార్వతి పాల్గొన్నారు.

నేడు, రేపు వీహెచ్‌పీ శిక్షణ తరగతులు

మద్దిపాడు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో మద్దిపాడు మండలం మల్లవరంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం ప్రాంగణంలో సత్సంగ శిక్షణ కార్యక్రమం శని, ఆదివారాల్లో నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రముఖ్ సోమా సుబ్బారావు తెలిపారు. శిక్షణ తరగతులు మహిళలకు బ్రాహ్మణ అన్నదాన సత్రంలో, పురుషులకు ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో వేర్వేరుగా జరుగుతాయన్నారు. హిందూ ధర్మ బలోపేతం కోసం నిర్వహించే ఈ శిక్షణ తరగతులకు ప్రజలు హాజరై సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. పలువురు సభ్యులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రతినిధులు

టీడీపీ సభ్యత్వంతో కార్యకర్త కుటుంబానికి భరోసా

- ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వంతో కార్యకర్త కుటుంబానికి భరోసా లభిస్తుందని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. శుక్రవారం ఒంగోలులోని ఎన్టీఆర్‌భవన్‌లో నిర్వహించిన నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన దామచర్ల మాట్లాడుతూ ఈనెల 26వ తేదీ నుంచి జరిగే పార్టీ సభ్యత్వ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. రూ.100 సభ్యత్వ రుసుంతో కార్యకర్తతోపాటు వారి కుటుంబానికి భరోసా, భద్రత ఉంటుందని చెప్పారు. క్లస్టర్, యూనిట్, బూత్, డివిజన్ స్థాయిలో సభ్యత్వ నమోదును అత్యధికంగా చేసి, జిల్లాలోనే ప్రథమస్థానంలో ఉంచాలని కోరారు. గతంలో ప్రమాద బీమా రూ.2లక్షలు ఉండేదని, అయితే దానిని రూ.5లక్షలకు పెంచారని వెల్లడించారు. ప్రమాదవశాత్తు మరణిస్తే తక్షణం మట్టిఖర్చుల కింద రూ.10వేలు అందించడంతోపాటు కార్యకర్త కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని వివరించారు. రూ.లక్ష చెల్లిస్తే శాశ్వత సభ్యత్వం ఉంటుందని, దేశంలో ఏ పార్టీకి లేని విధంగా కార్యకర్తలకు, నమ్మినవారికి అండగా ఉండే విధంగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ చొరవ చూపారని చెప్పారు. పార్టీలో పదవులు కేటాయింపు, ఇతర అంశాల్లో ప్రాధాన్యత ఉండాలంటే సభ్యత్వ నమోదు తప్పనిసరని ఎమ్మెల్యే దామచర్ల పేర్కొన్నారు. కావున సభ్యత్వ నమోదులో భాగస్వాములు కావాలన్నారు. సమావేశంలో నియోజకవర్గ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.





కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జనార్దన్

పొగాకు నారులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

- బోర్డు కార్యనిర్వహణ అధికారి రామకృష్ణ

మద్దిపాడు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పొగాకు నారు మండుల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని బోర్డు కార్యనిర్వహణ అధికారి కోవి రామకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం కొలచనకోటలోని పొగాకు నారుమళ్లను ఆయన పరిశీలించి అనంతరం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నారుమడిలో చీడపీడలు రాకుండా చూడాలన్నారు. మేలిమి రకం నారుకు మంచి డిమాండ్ ఉందని చెప్పారు. వేలం కేంద్రం రైతు సంఘం అధ్యక్షుడు అబ్బూరి శేషగిరిరావు మాట్లాడుతూ పొగాకు సాగు తగ్గించి ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టిసారించాలన్నారు. శనగ, మినుము, కంది, నువ్వు మొదలైన పంటల సాగుకు కృషిచేయాలని చెప్పారు. శ్రీహర్ష అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రామాంజనేయులు, నారిపెద్ది వరహాలచౌదరి, రావి ఉమామహేశ్వర రావు, మండవ గోవిందరాజులు, ఎం.శ్రీరామ మూర్తి, బోడపాటి వెంకయ్యచౌదరి పాల్గొన్నారు.



పొగాకు నారును పరిశీలిస్తున్న రామకృష్ణ, ప్రతినిధులు

భూ సమస్యలను నిర్దిష్ట గడువులోపు పరిష్కరిస్తాం

- రెవెన్యూ అధికారులు

సంతనూతలపాడు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): గుమ్మళంపాడులో శుక్రవారం నిర్వహించిన రీసర్వే, భూసమస్యలకు సంబంధించి 90 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ వి.ఆదిలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూసమస్యలకు సంబంధించి 45 రోజుల్లో సంబంధిత రైతులకు పరిష్కారం చూపిస్తామన్నారు.

దొడ్డవరం, గార్లపాడులో 17 అర్జీలు

మద్దిపాడు: మండలంలోని దొడ్డవరం, గార్లపాడు గ్రామాల్లో శుక్రవారం తహసీల్దార్ సృజనకుమార్ ఆధ్వర్యంలో భూమి రీసర్వే గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా 17 అర్జీలను అందాయి. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ రీసర్వే అర్జీలను 15 రోజుల్లో పరిష్కరిస్తామని చెప్పారు. టీడీపీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు మాట్లాడుతూ రైతులు తమ భూ సమస్యలను తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో దొడ్డవరం సర్పంచ్ పూనూరి సుబ్బారావు, వట్టెంపూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పాదర్తిలో 112..

కొత్తపట్నం(ఒంగోలునగరం): మండలంలోని పాదర్తి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన భూ రీసర్వే గ్రామ సభలో గ్రామస్థులు మొత్తం 112 అర్జీలను అధికారులకు అందజేశారు. తహసీల్దార్ మధుసూదనరావు, సర్పంచ్ కట్టా సౌందర్య, రెవెన్యూ అధికారులు ప్రజల నుంచి భూ సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించారు.

శానంపూడిలో 60..

సింగరాయకొండ: రీసర్వేలో వచ్చిన భూ సమస్యలపై మండలంలోని శానంపూడి గ్రామంలో శుక్రవారం తహసీల్దార్ బి.రవి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ప్రజల నుంచి 60 అర్జీలు వచ్చాయి. వాటిలో అధికంగా మ్యూటేషన్‌కు సంబంధించి 42, జాయింట్ ఎల్‌పీఎంకు సంబంధించి ఎనిమిది, విస్తీర్ణంలో తేడాలకు సంబంధించి ఆరు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బల్లెకూర బ్రహ్మయ్య, సర్వేయర్ బ్రహ్మం పాల్గొన్నారు.



శానంపూడిలో అర్జీని స్వీకరిస్తున్న తహసీల్దార్ రవి

శ్రీవారికి మేల్‌ఛాట్ వస్త్రాల సమర్పణ



మేల్‌ఛాట్ వస్త్రాలను సమర్పిస్తున్న భక్తులు

ఒంగోలు(కల్చరల్), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం శ్రీగిరిలోని శ్రీవేంకటేశ్వర స్వామివారికి దాసరి హరిప్రియ కుటుంబసభ్యులు శుక్రవారం మేల్ ఛాట్ వస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఝాన్సీరాణి మాట్లాడుతూ ఈ నెల 27న ఆలయంలో సుదర్శన హోమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. పాల్గొనదలచిన భక్తులు 7981688677 నెంబర్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ధర్మకర్తలు లక్ష్మీకుమారి, డాక్టర్ ఆలూరు శ్రీనివాసచరణ్ రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎం.వేములపాడులో ఫాగింగ్

సంతనూతలపాడు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎనికపాడులో శుక్రవారం డాక్టర్ సుమన్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా వైద్యశిబిరం నిర్వహించారు. రోగులకు వైద్యసేవలు అందించారు. రాత్రి సమయంలో దోమల నివారణకు ఫాగింగ్ చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ టి.వెంకట్రావు, సబ్‌యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు, సెక్రటరీ ధనలక్ష్మి పాల్గొన్నారు.

అయ్యప్పస్వాములకు అన్నసంతర్పణ

మద్దిపాడు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గుండ్లాపల్లిలోని శ్రీగంగా బాలత్రిపురసుందరీదేవి సమేత శ్రీసోమేశ్వర స్వామి దేవస్థానంలో అయ్యప్ప స్వాములు, శివస్వాములు, భవాని స్వాములకు, గోవింద, ఆంజనేయ మాలధారులకు 41 రోజుల పాటు అన్నసంతర్పణ నిర్వహిస్తున్నట్లు గురుస్వాములు అడ్డాల రవిబాబు, ఏమిరెడ్డి విజయభాస్కరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అయ్యప్ప భక్తబృందం, గ్రామ పెద్దల సహాయ సహకారాలతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.



అన్నసంతర్పణ చేస్తున్న స్వాములు

కలేకూరి ప్రసాద్‌కు నివాళి

ఒంగోలు(కల్చరల్), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కవి కలేకూరి ప్రసాద్ జయంతి సభ శుక్రవారం స్థానిక శ్రీనివాస ఆఫ్‌సెట్ ప్రాంగణంలో కలేకూరి ప్రసాద్ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా సాహిత్య వేదిక అధ్యక్షులు చప్పిడి కోటేశ్వరరావు, కవి కత్తి కళ్యాణ్, రచయిత ఎజ్రాశాస్త్రి, మేడికొండ మురళి, షాన్ కోటి, నాగార్జున నివాళులర్పించారు.

చీమకుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్‌హౌస్

చీమకుర్తి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల స్మారక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం చీమకుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్‌హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సుబ్బారావు పోలీస్ వ్యవస్థపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పోలీస్‌సిబ్బంది, టీచర్లు పాల్గొన్నారు.

ఎస్‌ఎన్‌పాడు హైస్కూల్లో పనిచేయని ఆర్వోప్లాంట్

- ఇబ్బందిపడుతున్న విద్యార్థులు

సంతనూతలపాడు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు జడ్పీహైస్కూల్ విద్యార్థుల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్వోప్లాంట్ మరమ్మతులకు గురైంది. సుమారు నెల రోజుల క్రితం చెడిపోయినా ఇంతవరకు దానిని బాగు చేయించలేదు. దీంతో విద్యార్థుల కోసం బయట నుంచి మంచినీటిని కొనుగోలు చేసి అందిస్తున్నారు. అయితే తాగునీరు పోసిన ట్యాంకు అపరిశుభ్రంగా తయారైంది. కనీసం దానిని సరిగా శుభ్రం చేస్తున్నారో లేదో తెలియని పరిస్థితి. ప్రస్తుతం వర్షాలు పడి సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. కలుషిత నీటితో టైఫాయిడ్, పచ్చకామెర్లు, ఇతర వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. ఈ విషయమై హెచ్‌ఎం ప్రమోదను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. ఆర్వోప్లాంట్లు నెల క్రితం మరమ్మతులకు గురైందని అప్పటి నుంచి బయటనుండి మంచినీటిని కొనుగోలు చేసి తెప్పిస్తున్నామని చెప్పారు. మంచినీరు పోసే ట్యాంకును ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తున్నామని, మరోసారి పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.





మరమ్మతులకు గురైన ఆర్వోప్లాంట్, ట్యాంకులోని నీటిని పట్టుకుంటున్న విద్యార్థినులు

నేడు మంత్రి స్వామి రాక

టంగుటూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి శనివారం టంగుటూరు రానున్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఉదయం 9 గంటలకు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభిస్తారని టీడీపీ మండల అధ్యక్షుడు కామని విజయ్‌కుమార్ తెలిపారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధికసంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

బాణసంచా గోడౌన్ పరిశీలన

కొండపి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): చినకండ్లగుంట గ్రామం వద్ద ఉన్న శ్రీరామ క్రాకర్స్ గోడౌన్‌ను తహసీల్దార్ పి.మురళి, అగ్నిమాపకశాఖ సిబ్బంది శుక్రవారం తనిఖీ చేశారు. గోడౌన్‌లో భద్రతా ప్రమాణాలను పరిశీలించారు.

నేడు టీటీడీ కల్యాణ మండపానికి శంకుస్థాపన

సింగరాయకొండ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శనివారం ఉదయం 8గంటలకు టీటీడీ కల్యాణ మండపానికి శంకుస్థాపన జరుగుతుందని ఈవో కృష్ణవేణి ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

బ్యారన్ రిజిస్ట్రేషన్ గడువు పెంపు

టంగుటూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : పొగాకు బ్యారన్ రెన్యువల్, రిజిస్ట్రేషన్ గడువును వచ్చేనెల 25 వరకూ పొడిగించినట్లు స్థానిక వేలం కేంద్రం సూపరింటెండెంట్ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. అప్పటి వరకూ ఎలాంటి అపరాధ రుసుం ఉండదన్నారు. వచ్చేనెల 25 నుంచి డిసెంబర్ 9వ తేదీ వరకు రూ.100 పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుందన్నారు. డిసెంబరు 9 తర్వాత రూ.400 అపరాధ రుసుంతో 19వరకూ బ్యారన్ రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేసుకోవచ్చని తెలిపారు.

క్వారీ కార్మికులకు నైపుణ్య పరీక్షలు

చీమకుర్తి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రానైట్ క్వారీల్లో నిర్వహించనున్న భద్రతా వారోత్సవాల్లో భాగంగా ముందస్తుగా నిర్వహించే ట్రేడ్ పరీక్షలు రామతీర్థం వద్ద ఉన్న వీటీసీలో జరుగుతున్నాయి. శుక్రవారం కార్మికులకు ప్రథమచికిత్సపై పరీక్షలు నిర్వహించారు. అనుకోని ప్రమాదాలు చోటుచేసుకున్నపుడు కార్మికుల స్పందన, ప్రథమచికిత్సలపై మాక్‌డ్రిల్‌ను పలు క్వారీలకు చెందిన సభ్యులు నిర్వహించారు. జడ్జిలుగా పెరల్ గ్రానైట్స్ జీఎం పి.వెంకటేశ్వరరావు, ఆనంద్‌గ్రానైట్స్ నుంచి సయ్యద్ దస్తగిరి వ్యవహరించారు. జనరల్ సెక్రటరీలు రవి, గుర్నాథరావు పర్యవేక్షించారు.



కార్మికులు నైపుణ్యాలను పరీక్షిస్తున్న జడ్జిలు

కుటుంబ సమస్యలను రాజకీయాలకు ముడిపెట్టడం దుర్మార్గం : జూపూడి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ సమస్యలను రాజకీయాలకు ముడిపెట్టడం దుర్మార్గంగా ఉందని మాజీ ఎమ్మెల్సీ, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జూపూడి ప్రభాకర్‌రావు అన్నారు. ఒంగోలులోని వైసీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్, షర్మిల మధ్య వచ్చిన సమస్యను వారి కుటుంబ సభ్యులు పరిష్కరించుకుంటారన్నారు. కానీ దీన్ని కొందరు రాజకీయం చేసేందుకు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన ఆస్తుల్లో ఆయన తమ్ముడు, చెల్లెలికి ఏమి ఇచ్చారో చెప్పాలన్నారు. వైఎస్ జగన్ ప్రాజెక్టుల విషయంలో రైతుల వద్ద నుంచి మార్కెట్ రేటుకు భూములు కొనుగోలు చేసిన విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. ఈవీఎంల ద్వారానే గెలిచిన వ్యక్తులు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈవీఎంల మేనేజ్‌మెంట్ వల్లనే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. కార్యక్రమంలో కఠారి శంకర్, దుంపా చెంచిరెడ్డి, బొట్లా సుబ్బారావు పాల్గొన్నారు.

రౌడీషీటర్లపై బైండోవర్ కేసులు



రౌడీషీటర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్ ఆదిలక్ష్మి

సంతనూతలపాడు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లోని 14మంది రౌడీషీటర్లపై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వి.అజయ్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఆదిలక్ష్మి ఎదుట వారిని హాజరుపరిచారు. ఒక సంవత్సరం సత్ప్రవర్తన కలిగి ఉండేలా రౌడీషీటర్ల వద్ద ఒక్కొక్కరి నుంచి రూ.5లక్షల పూచీకత్తు బాండ్ తీసుకున్నారు. అనంతరం రౌడీషీటర్లకు తహసీల్దార్, ఎస్ఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. కాగా పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మైనంపాడులో ఎస్ఐ అజయ్‌బాబు విద్యార్థులకు పోటీ పరీక్ష నిర్వహించారు.

హెచ్‌ఐవీ నిర్మూలనలో భాగస్వాములు కావాలి

నాగులుప్పలపాడు అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీ నిర్మూలనలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బీవీ.సాగర్ కోరారు. ఎయిడ్స్ నిర్మూలన నియంత్రణ సంస్థ, హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం అమ్మనబ్రోలు జడ్పీ హైస్కూలు, విజ్ఞానభారతి స్కూల్‌లోని విద్యార్థులకు మీకు తెలుసా అవగాహన సదస్సులు నిర్వహించారు. హెచ్‌ఐవీ బాధితులపై వివక్షత చూపకూడదన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సత్యవతి, టీఐ మల్లేశ్వరి, దివ్య, వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాగర్

ఒడా చైర్మన్ పదవిని కాపులకు కేటాయించాలి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ఒడా) చైర్మన్ పదవిని కాపులకు కేటాయించాలని జనసేన పార్టీ జిల్లా ప్రచారకమిటీ కో ఆర్డినేటర్ జడా బాలనాగేంద్రయాదవ్ కోరారు. శుక్రవారం ఒంగోలులోని డొక్కా సీతమ్మ క్యాంటీన్ ఆవరణలో విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. ఒడా చైర్మన్ పదవిని జనసేనకు ఇవ్వాలని టీడీపీ ముఖ్యనాయకులు నిర్ణయించడం అభినందనీయమన్నారు. అనంతరం క్యాంటీన్ ఏర్పాటు చేసి వంద రోజులు పూర్తయిన సందర్భంగా పేదలకు అన్నదానం చేశారు. గొర్రెపాటి శ్రీనివాసరావు, గోలి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

'సోషల్' స్టార్స్

స్వయంకృషితో ఎదుగుతున్న జిల్లావాసులు

- యూట్యూబ్, ఇన్‌స్టాలలో పేరు ప్రఖ్యాతులు
- తద్వారా సినిమాల్లోనూ అవకాశాలు
- యువతలో సోషల్ మీడియా క్రేజ్
- ప్రామోషనల్ వీడియోస్‌తోనూ ఆదాయం

కాదేదీ కవితకు అనర్హం అని మహాకవి శ్రీశ్రీ అంటే కాదేదీ కళకు అనర్హం అని జిల్లాకు చెందిన కొందరు నిరూపిస్తున్నారు. తమలో దాగున్న కళను ప్రదర్శిస్తూ పేరు ప్రఖ్యాతులు సంపాదిస్తున్నారు. ప్రతిభను చాటుకునేందుకు సామాజిక మాధ్యమాలను చక్కటి వేదికలుగా మలుచుకుంటున్నారు. వాటిని ఆదాయ వనరుగా కూడా మార్చుకుంటున్నారు. జిల్లాకు చెందిన అలాంటి యువతీ యువకులు, మహిళలు యూట్యూబ్, ఇన్‌స్టాగ్రాంలను ఉపయోగించుకుని స్టార్స్ అవుతున్నారు. ప్రతిభ ఆధారంగా టెలీఫిల్మ్‌లలో, తెలుగు చిత్రాలలో సైతం అవకాశాలను చేజిక్కించుకుంటున్న వారిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..

- ఒంగోలు (కల్చరల్), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి)



ఇన్‌స్టా నుంచి చిత్రాల వరకు

ఈమె ఒంగోలుకు చెందిన వంగల రజని. తన నటన, నృత్యం ద్వారా సామాజిక మాధ్యమాల్లో అనేక వేలమంది ఫాలోయర్స్‌ను సంపాదించారు. యూట్యూబ్‌లోనూ, ఇన్‌స్టాగ్రాంలలో ఆమె వీడియోలకూ, రీల్స్‌కూ ఆదరణ లభిస్తోంది. సామాజిక మాధ్యమాల ద్వారా గుర్తింపు పొందిన ఈమెకు తెలుగు చిత్రాల్లో నటించే అవకాశం సైతం లభించింది. ప్రస్తుతం మూడు తెలుగు చిత్రాల్లో అవకాశాలు దక్కించుకున్నారు. వచ్చే జనవరిలో అవి విడుదల కానున్నాయి.

ఇటు గానం అటు నృత్యం



ఈమె ఒక సామాన్య మధ్యతరగతి మహిళ. చిన్నతనం నుంచి పాటలు పాడటంపై ఈమె ఆసక్తి చూపేవారు. చక్కటి గాత్రం ఉన్నా తన ప్రతిభను చాటుకునే అవకాశాలు రాలేదు. ఇటీవల పెరిగిన సామాజిక మాధ్యమాలు, యాప్‌ల ద్వారా తన స్వర మాధుర్యాన్ని ప్రదర్శిస్తూ ఎంతోమంది అభిమానులను సంపాదించుకున్న ఈమె ఒంగోలుకు చెందిన పి.శ్రావ్య. స్టార్‌మేకర్, స్మూల్ వంటి యాప్‌లలో పాటలు పాడటం ద్వారా పేరు సంపాదించిన ఆమెకు వేదికలపైనా, సంగీత విభావరిలలోనూ పాడే అవకాశాలు వస్తున్నాయి. వాటి ద్వారా సంపాదన సైతం సమకూరుతోంది. ఈ క్రమంలో తనలో ఉన్న రెండో ప్రతిభనూ ప్రదర్శిస్తున్నారామె. హుందాౖరెన సినిమా పాటలకు లయబద్ధంగా చక్కటి హావభావాలతో డాన్స్‌ను ప్రదర్శిస్తూ సామాజిక మాధ్యమాల్లో అభిమానులను పొందుతున్నారు.

చదువుతూనే సంపాదన



ఒంగోలులోని కొండమిట్టకు చెందిన రహమతుల్లా ఉన్నత చదువు కొనసాగిస్తూనే సామాజిక మాధ్యమాల ద్వారా సంపాదన పొందుతూ కుటుంబానికి సైతం అండగా నిలుస్తున్నారు. ప్రస్తుతం అతను పేస్ కళాశాలలో చదువుతూ ఇన్‌స్టాగ్రాంలలో అనేక వ్యాపార సంస్థలకు ప్రొమోషన్ వీడియోలు చేస్తూ ఆదాయం పొందుతున్నారు. నగరంలో పేరుపొందిన అనేక జ్యువెలరీ షాపులు, కార్పొరేట్ వస్త్ర దుకాణాలకు అతను ప్రొమోషనల్ వీడియోలు చేస్తున్నారు. ఆ వీడియోలకు లక్షల్లో వ్యూయర్స్ ఉన్నారు. కేవలం వీడియోలు చేయటమే కాకుండా మోడలింగ్‌లోనూ ఆయన రాణిస్తున్నారు. ఇటీవల చెన్నయ్‌లో జరిగిన మిస్టర్ తమిళనాడు మోడలింగ్ పోటీల్లో రెండో బహుమతి సాధించారు.

రచయిత నుంచి రీల్‌స్టార్‌గా..



కవిగా, సాహితీ విశ్లేషకుడిగా పేరుపొందిన ఒంగోలు వాసి డాక్టర్ మొగిలి దేవ... కళాకారుడిగా కూడా తన ప్రతిభను చాటుతున్నారు. సోషల్ మీడియా వేదికగా అతను చేస్తున్న రీల్స్, షార్ట్స్‌కు ప్రస్తుతం వందల మంది అభిమానులు ఉన్నారు. యూట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, షేర్‌చాట్‌లలో ఇప్పటి వరకు 2500పైగా రీల్స్, షార్ట్స్ చేసి మెప్పించారాయన. అతని ప్రతిభకు లక్షమందికిపైగా ఫాలోయర్స్, 67 లక్షల వీక్షణలు వచ్చాయంటే సామాజిక మాధ్యమాలు ఎంతగా ఉపయోగపడుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. డాక్టర్ మొగిలి దేవ సామాజిక మాధ్యమాల ద్వారా పాటలు, వ్యక్తిత్వ వికాసం, వేమన పద్యాలు, మంచి సూక్తులను సైతం ప్రదర్శిస్తూ అనేకమంది ప్రశంసలు అందుకుంటున్నారు.

దూసుకుపోతున్న ప్రకాశం బుల్స్



ప్రారంభించిన ఆరు నెలల్లోనే తన ఇన్‌స్టా రీల్స్‌తో వేలాది మంది అభిమానులను పొందారు నగరానికి చెందిన పి.జావీద్. మార్చిలో ప్రకాశం బుల్స్ పేరుతో అతను ఇన్‌స్టా పేజ్‌ని ప్రారంభించి ఇప్పటివరకు అనేక హోటళ్లు, ఫుట్‌పాత్ తినుబండారాలు, చెన్నయ్ షాపింగ్ మాల్ వంటి కార్పొరేట్ సంస్థలకు ప్రమోషన్ వీడియోలు చేయటం, ప్రకాశం జిల్లాలోని అనేక ప్రదేశాలపై తన రీల్స్ ద్వారా క్లుప్తంగా వివరిస్తూ అభిమానులను సంపాదిస్తున్నారు.

సినిమాల్లో అవకాశం లభించింది



సామాజిక మాధ్యమాలు నా జీవితంలో గొప్ప మార్పు తీసుకొచ్చాయి. అనేకమంది ఇందులో రీల్స్ చేయటం చూసి నేను కూడా ఇలా ఎందుకు చేయకూడదు అని ప్రారంభించాను. ఇన్‌స్టాగ్రాంలో నేను చేసే రీల్స్‌కు క్రమేపీ వీక్షకులు, అభిమానులు పెరిగారు. దీంతో మరింత ఉత్సాహం వచ్చింది. ఇన్‌స్టాలో కేవలం డాన్స్ రీల్స్ మాత్రమే కాకుండా యూట్యూబ్ ద్వారా అనేక విషయాలపై వీడియోలు చేయటం ప్రారంభించా. వాటికి కూడా మంచి ఆదరణ లభించింది. ఇటీవలే సినిమాలలో నటించే అవకాశం సైతం లభించింది. సామాజిక మాధ్యమాల ద్వారా నాకు గుర్తింపు రావటం ఎంతో ఆనందంగా ఉంది. -వి.రజని

తప్పిపోయిన పిల్లలు తల్లిదండ్రుల చెంతకు..

ఒంగోలు క్రైం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): తప్పిపోయిన పిల్లలను కేవలం నాలుగు గంటల వ్యవధిలో తల్లిదండ్రుల చెంతకు పోలీసులు చేర్చారు. వివరాల్లోకి వెళితే.. సింగరాయకొండ మండలంలోని ఓ పాఠశాలలో చదువుతున్న ముగ్గురు బాలికలు, ఒక బాలుడు సోషల్ మీడియా ప్రభావంతో దారి తప్పారు. దీంతో ఈ పిల్లలను తల్లిదండ్రులు మందలించారు. ఈక్రమంలో వారు పాఠశాలకు వెళుతున్నామని చెప్పి ఈ నెల 23న సింగరాయికొండలో రైలు ఎక్కి నెల్లూరు వెళ్లారు. అక్కడ నుంచి తెనాలి వెళ్లి తిరిగి గుంటూరు చేరుకున్నారు. ఈమేరకు తల్లిదండ్రుల పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఈనెల 24న కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. సాంకేతిక పరిజ్ఞానంతో అదేరోజు సాయంత్రం 7 గంటలకు గుంటూరు రైల్వేస్టేషన్‌లో పిల్లలు ఉన్నట్లు తెలుసుకొని పోలీసులు పట్టుకుని వారి తల్లిదండ్రులకు అప్పగించారు. శుక్రవారం తమ పిల్లలతో తల్లిదండ్రులు ఒంగోలు వచ్చి ఎస్పీ దామోదర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సింగరాయకొండ సీఐ హజరత్తయ్య, ఎస్ మహేంద్ర, ఏఎస్ఐలు మహబూబ్‌బేగ్, మహబూబ్ బాషా, కానిస్టేబుల్ శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

- కలెక్టర్ అన్సారియా పిలుపు



డ్వాక్రా చెక్కులు పంపిణీ చేస్తున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పొదుపు, ఆర్థిక క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచిన స్వయం సహాయక సంఘాల మహిళలు మరో అడుగు ముందుకేసి పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. కెనరా శక్తి పేరుతో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో శుక్రవారం ఒంగోలులోని ఎ1 కన్వెన్షన్‌హాలులో కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహించిన రుణమేళాను ఆమె ప్రారంభించారు. ముందుగా రుణ విభాగ జనరల్ మేనేజర్ మమతా ఎ.జోషి, డీఆర్‌డీఏ పీడీ వసుంధరతో జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ ఒక్క అక్టోబరు నెలలోనే కెనరా బ్యాంకు రూ.100కోట్లు రుణాలు మంజూరుకు ముందుకు రావడం సంతోషకరమన్నారు. ఇతర బ్యాంకులు కూడా ఈమేరకు ముందుకు వచ్చి లక్ష్యం మేరక ఋణాలు మంజూరు చేయాలని కోరారు. ఇటీవల విజయవాడ వరద బాధితులకు జిల్లా నుంచి పంపిన ఆహారం తయారీలో డ్వాక్రా మహిళలు చురుకుగా వ్యవహరించిన విషయాన్ని గుర్తు చేశారు. బ్యాంకు రీజనల్ మేనేజర్ మమత మాట్లాడుతూ 40 ఏళ్ల క్రితం నెల్లూరు జిల్లాలోని ఓ గ్రామంలో ప్రారంభమైన పొదుపు సంఘాలు నేడు అన్ని ప్రాంతాలకు విస్తరించాయని చెప్పారు. మహిళలు పారిశ్రామికవేత్తలుగా మారేందుకు అవసరమైన ఆర్థిక సహకారాన్ని అందించేందుకు కెనరా బ్యాంకు అందిస్తుందని తెలిపారు. పీడీ వసుంధర మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని 32,657 గ్రూపులకు రూ.1,671.02 కోట్లు రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా గతనెలాఖరు వరకు రూ.815.45 కోట్లు మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం రమేష్, బ్యాంకు అధికారులు శశిధర్, డేవిడ్, సునీత తదితరులు పాల్గొన్నారు. తొలుత డ్వాక్రా మహిళలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను కలెక్టర్ సందర్శించారు.

ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా చూడాలి

- జేసీ గోపాలకృష్ణ ఆదేశం



ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వివిధ ప్రభుత్వశాఖలకు కేటాయించిన భూములు ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో శుక్రవారం వివిధ శాఖల అధికారులతో జరిగిన సమావేశంలో జేసీ మాట్లాడారు. పలు అవసరాలకోసం గతంలో వివిధ శాఖలకు కేటాయించిన భూముల స్థితిగతులపై ఆరా తీశారు. ఎలాంటి అక్రమణలు జరగలేదని అధికారులు జేసీ దృష్టికి తెచ్చారు. ప్రభుత్వం కేటాయించిన అవసరాలకే ఆ భూములను వినియోగిస్తున్నట్లు తెలిపారు. దీనిపై జేసీ మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఒకసారి ఈ సమీక్షా సమావేశం ఉంటుందని తెలిపారు. సమావేశంలో డీఆర్వో శ్రీలత, మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట్ త్రివినాగ్, ఆర్డీవోలు లక్ష్మీప్రసన్న, కేశవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొగాకు రైతులకు ఎరువులు సరఫరా

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పొగాకు సాగు సీజన్ ప్రారంభంకావడంతో పొగాకు రైతులకు అవసరమైన ఎరువులను ఆంధ్రప్రదేశ్ పొగాకు ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య ఆధ్వర్యంలో ప్రారంభించారు. ప్రకాశం జిల్లాలోని రెండు రీజియన్ల పరిధిలో ఉన్న ఏడు పొగాకు వేలం కేంద్రాల్లో 2284.425 మెట్రిక్ టన్నుల ఎరువులను సరఫరా చేశారు. పొగాకు వేలం కేంద్రాల్లో ముందుగా బుక్ చేసుకున్న ఎరువులను ఆయా వేలం కేంద్రాల పరిధిలోని రైతులు తీసుకోవాలని కోరారు. శుక్రవారం సమాఖ్య ఎరువుల డిపో నుంచి ఒంగోలు, మద్దిపాడు, నాగులుప్పలపాడు, దోడ్డవరం, త్రిపురాంతకం బ్రాంచీలలో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు విక్రయించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేలం కేంద్రం సూపరిటెండెంట్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రతి ఇంటినీ 'సూర్యఘర్'లో భాగస్వామ్యం చేస్తాం

- విద్యుత్‌శాఖ ఎస్ఈ వెంకటేశ్వర్లు



ఒంగోలు క్రైం, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రతి ఇంటిని సూర్యఘర్ పథకంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని విద్యుత్‌శాఖ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఇందుకోసం ప్రభుత్వం సోలార్ ఏర్పాటుకు అవసరమైన రుణాలు, సబ్సిడీని అందిస్తుందని చెప్పారు. శుక్రవారం ఒంగోలులోని విద్యుత్‌భవన్‌లో గల ఎస్ఈ కార్యాలయంలో ఆ శాఖ డీఈలు, సోలార్ వెండర్స్‌తో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎస్ఈ మాట్లాడుతూ సోలార్ విద్యుత్‌పై జిల్లాలోని వినియోగదారులకు అవగాహన కల్పించేందుకు 71 సెక్షన్లలో 71 మంది సెక్షన్ ఆఫీసర్లు, 150 మంది ఇతర సిబ్బందిని బృందాలుగా ఏర్పాటు చేసి ప్రతి ఇంటికి వెళ్లి చైతన్యపరుస్తామన్నారు. సోలార్‌పవర్ ఒక కిలోవాట్‌కు రూ.30వేలు, రెండు కిలోవాట్‌లకు రూ.60వేలు, మూడు కిలోవాట్‌లకు రూ.78వేలు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని తెలిపారు. అదే విధంగా రూ.లక్ష వ్యయం అయితే బ్యాంక్‌లు రూ.80 వేల రుణం ఇస్తాయని, వినియోగదారులు రూ.20వేలు చెల్లిస్తే వెంటనే తమ ఖాతాలలో రూ.80వేలు జమ అవుతుందన్నారు. ప్రస్తుతం ఉన్న మీటర్ స్థానంలో బైడైరెక్షన్ మీటరును ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో డీఈలు అబ్దుల్‌కరీమ్, హరిబాబు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే చిమ్మచీకట్లే

- నాసిరకం సామగ్రి వాడకంతో విద్యుత్ కష్టాలు
- సిబ్బంది కొరతతో చీకటిలోనే మగ్గిపోతున్న ప్రజలు
- విద్యుత్‌శాఖ నిర్లక్ష్య వైఖరితో అవస్థలు



స్తంభాలకు బిగించిన నాసిరకం పింగాణీ ఇన్సులేటర్లు

చీమకుర్తి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : చీమకుర్తి మండలంలోని ఆ మూడు గ్రామాల్లో చినుకుపడితే చిమ్మచీకట్లు అలుముకుంటున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో కాంట్రాక్టర్లు ఆదాయమే పరమావధిగా భావించి నాసిరకం మెటీరియల్ వినియోగించటంతో విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఇలాంటి వాటిని అడ్డుకొని ప్రజాధనాన్ని కాపాడటంతోపాటు, వినియోగదారులకు నాణ్యమైన సేవలందేలా చర్యలు తీసుకోవాల్సిన విద్యుత్‌శాఖాధికారులు మనకెందుకులే అన్నట్లు వ్యవహరించటంతో ప్రజలకు కరెంట్ కష్టాలు తప్పడం లేదు. ఒకవైపు సిబ్బంది కొరత, మరోవైపు ఉన్న సిబ్బందిపై అదనపు భారం పడుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత అయినా పరిస్థితుల్లో మార్పు వస్తుందేమో అని ఆశగా చూస్తున్న వినియోగదారులకు నిరాశే మిగులుతోంది.

ఏడాది నుంచి ఇబ్బందులు..

మండలంలోని బండ్లమూడి, నేకునంబాదు, చంద్రపాడు గ్రామాల్లో ఏడాది నుంచి ఇన్సులేటర్ల సమస్య తలెత్తుతోంది. చిన్నపాటి చినుకులు పడినా ఇన్సులేటర్లు టప్‌మనడంతో ఆ సమస్య ఏ ప్రాంతంలో జరిగిందో తెలుసుకోవటానికి అరకొర సిబ్బందికి తలకుమించిన భారంగా మారుతోంది. వాటిని గుర్తించి మరమ్మతులు నిర్వహించటానికి దాదాపు రోజంతా పడుతోంది. అదే సమస్య రాత్రివేళ జరిగితే గ్రామస్థులు జాగారం చేయాల్సిన దుస్థితి నెలకొంది. స్తంభాలకు వాడిన ఇన్సులేటర్లు పాలిమర్‌వి కాకుండా పింగాణివి ఉపయోగించటం, అవి నాసిరకంగా ఉండటంతో బిగించిన తర్వాత రోజు వర్షం కురిస్తే కాలిపోయి విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. అధికారులను ప్రశ్నిస్తే 200 పాలిమర్ ఇన్సులేటర్లకు ఆర్డర్ పెట్టామని, ఇంకా సామగ్రి స్టోర్‌రూంకు రాలేదని జవాబు వస్తోంది. కనీసం చంద్రపాడు, నేకునంబాదు ప్రాంతాలకు లైన్‌మెన్, సచివాలయంలో పనిచేసే జూనియర్ లైన్‌మెన్ కూడా లేరు. ఇన్‌చార్జులతో కాకుండా రెగ్యులర్ ఉద్యోగులను కేటాయించాలని కోరుతున్నారు.



రాత్రివేళ చీమకుర్తిలో మరమ్మతులు చేస్తున్న లైన్‌మెన్

పట్టణంలోనూ తప్పని కష్టాలు..

చీమకుర్తి పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లోనూ సైతం కరెంట్ కష్టాలు పట్టిపీడిస్తున్నాయి. స్థానిక గాంధీనగర్, విద్యానగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు తరచూ అంతరాయం కలుగుతోంది. లో ఓల్టేజీ సమస్య తలెత్తుతోంది. సిబ్బంది పూర్తిస్థాయిలో లేకపోవటంతో సరఫరాను పునరుద్ధరించటంలో జాప్యం జరుగుతోంది. ఈ క్రమంలో గత బుధవారం రాత్రి తహసీల్దార్ కార్యాలయం తదితర ప్రాంతాల్లో కరెంటు సరఫరా నిలిచిపోయింది. ఏళ్ల తరబడి మార్చని విద్యుత్‌తీగలు, నాణ్యత లేని సామగ్రి వినియోగించటంతో సమస్య తలెత్తుతోంది. ఈ సమస్యను పరిష్కరించటంలో అర్ధరాత్రి వేళ లైన్‌మెన్ స్తంభం ఎక్కాల్సి వచ్చింది. కరెంటు సరఫరా పునరుద్ధరణకు మూడు గంటలపాటు సదరు లైన్‌మెన్ శ్రమించాల్సి వచ్చింది. విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఉన్నతాధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరిస్తాం

అధికారులమంతా కొత్తగా బాధ్యతలు చేపట్టాం. ఇన్సులేటర్ల సమస్యతో పాటు, విద్యుత్ పరంగా తలెత్తుతున్న సమస్యలను గుర్తించి సత్వరమే పరిష్కరించటానికి చర్యలు చేపడతాం. సిబ్బంది కొరతను ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా అధిగమించే ప్రయత్నం చేస్తాం.

- పి.శ్రీనివాసరావు, విద్యుత్‌శాఖ ఈఈ, దర్శి డివిజన్

వినికిడి యంత్రాల కోసం వైద్యపరీక్షలు

- భారీగా తరలివచ్చిన బాధితులు



వినికిడి పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : దీన దయాళ్ శ్రవణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వినికిడి యంత్రాల పంపిణీ కార్యక్రమానికి భారీగా తరలివచ్చారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సురేష్‌కుమార్, నోడల్ అధికారి డాక్టర్ భగీరథి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చెవిటి, మూగ స్కూలు పిల్లలను సుమారు 223 మందిని పరీక్షించారు. అందులో 92 మంది విద్యార్థులు, 132 మంది పెద్దలను పరీక్షించి అర్హులైన వారందరికీ ఉచితంగా వినికిడి యంత్రాలను ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందిస్తామని నిర్వహకుడు రామాంజనేయులు తెలిపారు.

క్రైం సమాచారం

బెల్ట్‌షాపులపై దాడులు


స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు చూపుతున్న ఎస్సై

బేస్తవారపేట, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నఓబినేనిపల్లె గ్రామంలో అక్రమంగా బెల్ట్‌షాపు నడుపుతున్న దుకాణంపై ఎస్సై రవీంద్రారెడ్డి తన సిబ్బందితో దాడి చేయగా అక్కడ 35 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కంభం : కంభం, అర్ధవీడు మండలాల్లో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్టుషాపులపై దాడులు చేసి 38 క్వార్టర్ సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు అర్ధవీడు ఎస్సై సుదర్శన్, కంభం ఎక్సైజ్ సీఐ కొండారెడ్డిలు తెలిపారు. అర్ధవీడు మండలంలోని దొనకొండ గ్రామంలో ఓ గృహంలో బెల్టుషాపు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో దాడులు చేయగా 18 క్వార్టర్ సీసాలు దొరికాయన్నారు. నిర్వాహకుడిపై కేసు నమోదు చేశామన్నారు. కంభం మండలం చిన్నకంభం గ్రామంలో బెల్టుషాపుపై దాడులు చేయగా 20 క్వార్టర్ బాటిళ్ల దొరికాయని నిర్వాహకుడిపై కేసు నమోదు చేశామన్నారు.

దొంగను పట్టుకొని పోలీసులకు అప్పగింత

గిద్దలూరు టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో దొంగతనానికి పాల్పడుతున్న దొంగను స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. కొప్పరపు రమేష్‌బాబు అనే వ్యక్తి ఇంటికి తాళం వేసి వేరే ఊరికి వెళ్లాడు. ఆ ఇంటిలో దొంగతనానికి వైఎస్ఆర్‌జిల్లా కాశినాయన మండలం నరసాపురం గ్రామానికి చెందిన గోపవరపు ప్రసాద్ అనే దొంగ గురువారం అర్ధరాత్రి వచ్చాడు. ఇంటి తాళాలను పగులగొట్టే ప్రయత్నం చేస్తుండగా స్థానికులు గమనించి, దొంగప్రసాద్‌ను పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. పట్టుబడిన దొంగ కడప జిల్లాలోని పలు చోరీ కేసుల్లో నిందితుడని తెలిసింది.

కుటుంబ సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య

మార్కాపురం రూరల్ అక్టోబర్ 25 (ఆంధ్రజ్యోతి) :కుటుంబ సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని బొడిచెర్ల గ్రామంలో శుక్రవారం చోటుచేసుకొంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. మార్కాపురం రూరల్ ఎస్ఐ అంకమ్మరావు తెలిపిన వివరాల ప్రకారం, మండలంలోని బొడిచెర్ల గ్రామానికి చెందిన గాయం సాంబశివారెడ్డి(36) ఏడాది క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటికే పరిమితయ్యాడు. ఇంటివద్దే ఉంటూ మద్యానికి బానిసయ్యాడు. తరచూ భార్యను వేదిస్తూ అనుమానం పెంచుకున్నాడు. తరచూ ఇంట్లో గొడవపడేవాడు. ఈ క్రమంలోనే ఇంటిలోని ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. ఘటనపై భార్య వెంకటదీప్తి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నీటి కుంటలో పడి బాలుడి మృతి

గిద్దలూరు టౌన్,అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): నీటి కుంటలో పడి బాలుడు మృతిచెందిన ఘటన శుక్రవారం వెలుగు చూసింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. గిద్దలూరులోని నల్లబండ వీధికి చెందిన పఠాన్ మహబూబ్‌బాషా కుమారుడైన పఘాన్ హుస్సేన్(14) 9వతరగతి చదువుతున్నాడు. బుధవారం సాయంత్రం ఆడుకోవడానికి అని బయటకు వెళ్లాడు. బాలుడు ఇంటికి రాకపోవడంతో తప్పిపోయినాడని కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపట్టారు. అయితే శుక్రవారం ఉదయం సెయిట్ పాల్స్ బీఈడీ కళాశాల వెనుక వైపు కొడ సమీపంలోని నీటి కుంటలో బాలుడి శవం ఉందని తెలిసింది. ఆ మృతదేహం హుస్సేన్‌దేనని పోలీసులు, కుటుంబ సభ్యులు గుర్తించారు. ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

టూటౌన్, ట్రాఫిక్ ఎస్సైలుగా రాజమోహనరావు, అహరోన్‌లు



రాజమోహనరావు, అహరోన్

మార్కాపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం టూటౌన్, ట్రాఫిక్ ఎస్సైలుగా ఎం.రాజమోహనరావు, అహరోన్‌లను నియమిస్తూ జిల్లా ఎస్పీ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. టూటౌన్ ఎస్సైగా నియమితులైన రాజమోహనరావు రెండుమాసాలుగా శిక్షణ ఎస్సైగా మార్కాపురంలోనే పనిచేశారు. ట్రాఫిక్‌ను నియంత్రించడంతోపాటు పలుకేసుల్లో చురుగ్గా పనిచేశారు. ఈ నేపథ్యంలోనే జిల్లా ఉన్నతాధికారులు అయనకు మార్కాపురంలోనే మొదటి పోస్టింగ్ ఇచ్చారు. అదేవిధంగా ట్రాఫిక్ ఎస్సైగా నియమితులైన అహరోన్ ఇప్పటి వరకు జిల్లా కేంద్రంలో పనిచేస్తున్నారు. ఈయన మార్కాపురం సర్కిల్ పరిధిలోని పలు స్టేషన్‌లలో కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్‌గా 15 సంవత్సరాలకుపైగా పనిచేశారు.

అనుమతులు లేని పురుగు మందులు అమ్మితే చర్యలు

- దర్శి ఏడీఏ బాలాజీ నాయక్


దుకాణాలను పరిశీలిస్తున్న ఏడీఏ

పెద్ద దోర్నాల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతులులేని పురుగుమందులు అమ్మితే చట్టపరమైన చర్యలు తప్పవని దర్శి ఏడీఏ బాలాజీనాయక్ హెచ్చరించారు. స్థానిక ఎరువుల దుకాణాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. దుకాణాల రిజిస్టర్లు, బిల్‌పుస్తకాలు, ధరల పట్టికలు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని, ధరల పట్టికలు బోర్డులపై ప్రదర్శించాలని అన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి జవహర్‌లాల్ నాయక్ ఉన్నారు.

ఎరువులు, పురుగు మందు దుకాణాలపై ఎన్‌ఫోర్సుమెంట్ దాడులు

- రూ.9 లక్షల సరుకు అమ్మకాల నిలిపివేత

పుల్లలచెరువు, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి): పుల్లలచెరువు మండలంలో ఎరువులు, పురుగుమందుల దుకాణాలపై విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. శుక్రవారం మండల కేంద్రమైన పుల్లలచెరువులో దుకాణాలపై దాడులు చేసి అనుమతి లేని ఎరువుల అమ్ముతున్న స్టాక్‌ను నిలుపుదల చేశారు. నిలుపుదల చేసిన ఎరువులు, పురుగుమందుల విలువ రూ.9 లక్షలపైన ఉంటుందని, మండల వ్యవసాయశాఖ అధికారి నిర్మలదేవి తెలిపారు. నాలుగు దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్లు సక్రమంగా లేనందున అమ్మకాలు నిలుపుదల చేసినట్లు వారు తెలిపారు. దాడుల్లో విజిలెన్స్ సీఐ రవిమలమె, డీసీటీవో పి.రామరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నిర్మించారు..పాడుబెట్టారు

- నిరుపయోగంగా బహుళ ప్రయోజన గోదాములు
- ఒక్కోటి రూ.40 లక్షలతో నిర్మాణం


మాదాలవారిపాలెం సమీపంలో నిరుపయోగంగా ఉన్న గోడౌన్


రేగులగడ్డ సొసైటీ పరిధిలోని గోడౌన్

పొదిలి, అక్టోబరు 24 : పొదిలి సహకార బ్యాంక్ పరిధిలో రూ.1.60 నిర్మించిన బహుళ ప్రయోజన గోదాములు నిరుపయోగంగా మారాయి. బ్యాంక్ పరిధిలో ఉన్న మాదాలవారిపాలెం, చినారికట్ల, రేగడపల్లి, చిమట సొసైటీల ఆధ్వర్యంలో రైతులకు బహుళ ప్రయోజనాలు కల్పించేందుకు గోదాములు నిర్మించారు. ఒక్కొక్క గోదాము రూ.40 లక్షల వ్యయం చేశారు. రైతులకు సహకార సంఘాల ద్వారా ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ పరికరాలు పంపిణీ చేసేందుకు ఆయా గోదాములలో నిల్వ ఉంచేందుకు వాటిని నిర్మించారు. అవసరమైన రైతులు తమ పంట ఉత్పత్తులను సైతం ఆ గోదాముల్లో భద్రపరుచుకునేందుకు ఉపయోగపడుతాయి. నాబార్డు వీటి నిర్మాణానికి రుణాల కింద నిధులు సమకూర్చింది. ఆ రుణాలతో వీటిని నిర్మించినా, ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్నాయి. దీనికితోడు రేగడపల్లి సొసైటీ గోదాము అయితే సుమారుగా 2 కిలోమీటర్లు దూరంలో ఉంటోంది. మిగిలినవి కూడా ఆయా గ్రామాలకు దూరంగా నిర్మించడంతో అవి నిరుపయోగంగా మారాయి.

మందుబాబులకు సిట్టింగ్ రూంలుగా

నిన్న మొన్నటి వరకు మందుబాబులు తలుపుల తాళాలు పగులగొట్టి గోదాములను సిట్టింగ్ రూములుగా మార్చుకున్నారు. అంతేకాకుండా కొంత మంది జూదం లాంటి అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు సమాచారం. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారి పోయింది. ఆ సహకార సంఘాల పరిధిలో గోదాములను వినియోగించుకొని వాటిపై వచ్చే ఆదాయం ద్వారా నాబార్డు రుణాలు చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు సహకార సంఘాలు ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. దీంతో రూ.1.60 కోట్ల ప్రజాధనం నిరుపయోగమైందనే చెప్పాలి. ఇప్పటికైనా సంబంధిత సహకార శాఖ అధికారులు గోదాములను వినియోగంలోకి తీసుకొచ్చి రైతులకు మరిన్ని సేవలు అందించాలని అన్నదాతలు కోరుతున్నారు. అంతేకాకుండా అక్రమార్కుల కంబంధహస్తాల నుంచి గోదాములకు విముక్తి కలిగించాలని వారు కోరుతున్నారు.

సొసైటీలకు ఆదాయం వచ్చే విధంగా ప్రయత్నిస్తున్నాం

బహుళ ప్రయోజన గోదాములు 90 శాతం రుణం, 10శాతం మార్జిన్ మనీతో జిల్లాలో ప్రస్తుతం 11 గోడౌన్లు నిర్మించారు. ఆయా సొసైటీల పరిధిలో ప్రస్తుతం అవి నిరుపయోగంగా ఉన్నాయి. ఆదాయం లేకపోవడంతో ఈఎంఐలు కట్టేందుకు భారంగా మారింది. దీంతో ఆదాయం వచ్చే విధంగా ప్రత్యామ్నాయ మార్గాలు చూస్తున్నాం. ప్రభుత్వ ప్రైవేటు ఏజెన్సీలు కావాలన్నా అద్దె ప్రాతిపదికన ఉపయోగించుకోవచ్చు. గ్యాస్ ఏజెన్సీకిగాని, దాన్యం నిలువలు చేసుకునేందుకు రైతులకు గాని, సివిల్‌సప్లై గోడౌన్‌లను అద్దెకిచ్చే ఆలోచన చేస్తున్నాం. తద్వారా సొసైటీకి ఉపయోగపడి ఆదాయం వచ్చే విధంగా ఆలోచన చేస్తున్నాం. **డీసీవో శ్రీనివాసరెడ్డి**

తప్పుల తడకగా రీసర్వే



తర్లుపాడు మండలంలో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

తర్లుపాడు, అక్టోబరు 25 ఆంధ్రజ్యోతి: గత వైసీపీ ప్రభుత్వంలో నిర్వహించిన రీసర్వే తప్పుల తడకగా చేసినట్లు పలువురు రైతులు తహసీల్దార్ విజయభాస్కర్ దృష్టికి తీసుకొచ్చారు. రీసర్వే జరిగిన గ్రామాల్లో భూసమస్యలపై నాగెళ్లముడుపు పంచాయతీలోని ఫత్తేపురంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు గతంలో పాస్‌బుక్‌లలో ఉన్న భూముల కంటే తక్కువగా నమోదైందని పలు సమస్యలపై గ్రామసభలో రైతులు అర్జీలు ఇచ్చారు. తహసీల్దార్ మాట్లాడుతూ రీసర్వే జరిగిన గ్రామాల్లో సమస్యలను పరిష్కరించేందుకే గ్రామసభ నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో వీఆర్‌వో మల్లికార్జున్, మండల సర్వేయర్ శ్రీవాణి, సర్వేయర్లు మస్తాన్, రవీంద్ర పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్ : గ్రామంలో గతంలో ప్రభుత్వం చేసిన భూసర్వేలో జరిగిన ప్రతి పొరపాటును సరిచేయనున్నట్లు తహసీల్దార్ చిరంజీవి శుక్రవారం తెలిపారు. మండలంలోని శివరాంపురం గ్రామ సచివాలయం వద్ద భూ సర్వే సమస్యలు పరిష్కరించేందుకు గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ సదస్సుల ద్వారా రీసర్వే సమస్యలు పరిష్కరించనున్నట్లు తెలిపారు ఈ గ్రామసభలో గ్రామస్థుల నుంచి మొత్తం 31 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, గ్రామ సర్పంచ్ డి నాదగురుబ్రహ్మం, వీఆర్‌వో, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వివాదస్పద భూముల పరిశీలన

మార్కాపురం రూరల్ : మండలంలోని గోగులదిన్నె గ్రామ ఇలాకాలోని సుంకేసుల నిర్వాసిత కాలనీ సమీపంలో ఉన్న వివాదాస్పద భూములను తహసీల్దార్ చిరంజీవి శుక్రవారం తన సిబ్బందితో కలిసి పరిశీలించారు. గోగులదిన్నె గ్రామ ఇలాకాలోని సర్వే నెంబర్ 1475, 1476, 1477, 1478, 1479, 1480,1481, 1482, 1483లోని ఎకరాలు 41.58 సెంట్ల విస్తీర్ణంలోని భూమి హక్కుదారులతో మాట్లాడనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయన వెంట మండల సర్వేయర్ సంజీవయ్య, వీఆర్‌వో, రెవిన్యూ సిబ్బది పాల్గొన్నారు.

ఉనికి కోసమే వైసీపీ నాయకుల అసత్య ఆరోపణలు

వైపాలెం నియోజకవర్గ టీడీపీ నేతలు


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ఎర్రగొండపాలెం(పుల్లలచెరువు),అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి):అధికారంను అడ్డంపెట్టుకొని భూ అక్రమణలు, భూ కబ్జాలు ,ఇసుక దోపీడీ చేసిన వైసీపీ నాయకులు తమ ఉనికిని కాపాడుకోనేందుకే టీడీపీ నాయకులపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని వైపాలెం టీడీపీ నియోజకవర్గ నాయకులు తీవ్రంగా ఖండించారు.శుక్రవారం ఎర్రగొండపాలెం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో పత్రిక విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడతూ చిన్న అవినీతి మచ్చలేని వైపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జీ గూడూరి ఎరిక్షన్‌బాబుపై అసత్య ఆరోపణలు చేయడం తగదని అన్నారు.వైసీపీ కాలంలో అధికారంను అడ్డంపెట్టుకోని భూకబ్జాలు చేసి కోట్లు వెనుకేసుకున్నారని వీటీ అన్నింటిపై త్వరలోనే విచారణ ఖాయం అన్నారు. వైసీపీ హాయంలో నియోజకవర్గంలో భూ కబ్జాలతో హత్యలు కుడా జరిగాయని,శ్మశాలను సైతం అక్రమించి వైసీపీ పాలనలో దోచుకున్నారని అన్నారు.అసత్య ఆరోపణలు చేస్తే వైసీపీ నాయకులపై తీవ్రంగా చర్యలు వుంటాయని అన్నారు.కొత మిషన్ గురించి తప్పుడు మాటలు మాట్లాడవద్దని చట్టాల గురించి తెలుసుకోవాలని అన్నారు.ఈకార్యక్రమంలో టీడీపీ ముఖ్య నాయకుల్లు,కాకర్ల కోటయ్య,రెంటపల్లి సుబ్బారెడ్డి,శనగ నారాయణరెడ్డి,మంత్రునాయక్, సత్య నారాయణ గౌడ్,మ్యాక్స్ వలీ ,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల తోడ్పాటు


జిరాక్స్ మిషన్ అందజేస్తున్న నిర్వాహకులు

మార్కాపురం రూరల్ అక్టోబర్ 25 (ఆంధ్రజ్యోతి). మండలంలోని గజ్జలకొండ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు జిరాక్స్ మిషన్‌ను శుక్రవారం బహూకరించారు. ఈ పాఠశాలలో 2008-2009 సంవత్సరంలో పదవతరగతి చదివిన విద్యార్థులు నారు బాపన్‌రెడ్డి, సాదం వీరనారాయణ, నాగఅంజయ్య, ఐ.సాయిలోకేష్, చిన్ననాసరయ్య, వై.నాగేశ్వరరావులు కలిసి సుమారు రూ.20 వేల విలువైన జిరాక్స్ మిషన్ అందజేసినట్లు పాఠశాల హెచ్ఎం డి.రామాంజనేయరెడ్డి తెలిపారు. పాఠశాల అభివృద్ధికి తమ తోడ్పాటును అందిస్తున్న పూర్వ విద్యార్థులకు ఉపాధ్యాయులు, అభినందించారు.

విద్యార్థులకు దుప్పట్లు, ప్లేట్లు పంపిణీ

పెద్దదోర్నాల : మండలంలోని కొత్తూరు, తిమ్మాపురం గ్రామాల్లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థులకు ఎంఈవో మస్తాన్‌నాయక్ దుప్పట్లు, ప్లేట్లు శుక్రవారం పంపిణీ చేశారు. స్థానిక సేఫ్టీ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు షేక్షావలి ఆధ్వర్యంలో 100 మంది విద్యార్థులకు దుప్పట్లు, ప్లేట్లు, టూత్ బ్రష్‌లు, మంచినీటి సీసాలను ఎంఈవో పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడు తూ పేద విద్యార్థులకు సహాయాన్ని అందించ డం అభినందనీయమన్నారు. మరిన్ని సేవలు అందించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నతానియేల్, రెహనాబేగం, రాము నాయక్, యూనియన్ సభ్యులు బాష, దాను, సర్దార్, విజయ్, ఇబ్రహీం, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

శనగ విత్తనాల పంపిణీ


శనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న నాయకులు అధికారులు

గిద్దలూరు టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మార్కెట్ యార్డు ఆవరణలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రాయితీపై శనగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. 25శాతం రాయితీతో ఎకరాకు 40 కిలోల వంతున ఐదు ఎకరాల వరకు రైతులకు రాయితీపై పప్పుశనగ విత్తనాలను అందిస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. నియోజకవర్గంలో విత్తనాల కొరత లేకుండా 7800 క్వింటాళ్ళ శనగ విత్తనాలను అందుబాటులో ఉంచారన్నారు. ప్రభుత్వంతో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడి అవసరం మేరకు శనగలు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్, మున్సిపల్ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, టీడీపీ నాయకులు కృష్ణకిషోర్‌రెడ్డి ఏడీఏ బాలాజీనాయక్, ఆరు మండలాల వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

అన్ని పంటలను యాప్‌లో అప్లోడ్ చేయాలి

బేస్తవారపేట,అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): రైతుసేవా కేంద్రం సిబ్బంది వారి పరిధిలోని అన్ని పంటలను యాప్ నందు ఫోటోలను అప్లోడ్ చేయాలని ఏవో జక్కం మెర్సీ సూచించారు. శుక్రవారం బేస్తవారపేట మండలంలోని సలకలవీడు వద్ద సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. శిక్షణ కేంద్రానికి జిల్లా వనరుల కేంద్రం సమన్వయకర్త ఎస్.రామ్మోహన్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. యాప్ ద్వారా పంట ఫోటోలను చిత్రీకరించాలని వాటిని అప్లోడ్ చేసే పద్ధతి గురించి వివరించారు. పంటలకు తెగుళ్లు ఏదైన సమస్య ఉంటే రైతులకు అవగాహన కల్పించి నివారణ మార్గాలు సూచించాలన్నారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం నుంచి శాస్త్రవేత టి.వెంకటేశ్వరరెడ్డి మార్కాపురం, గిద్దలూరు సబ్ డివిజన్ పరిధిలోని సిబ్బంది పాల్గొన్నారు.

పురుగు మందుల విక్రయాలకు అనుమతి తప్పనిసరి

పెద్ద దోర్నాల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతులు లేని పురుగుమందులు అమ్మితే చట్టపరమైన చర్యలు తప్పవని, దర్శి ఏడీఏ కే.బాలాజీనాయక్ హెచ్చరించారు. స్థానిక ఎరువుల దుకాణాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. దుకాణాల రిజిస్టర్లు, బిల్‌పుస్తకాలు, ధరల పట్టికలు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులున్న కంపెనీ మందులనే విక్రయించాలని, రైతులకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని, ధరల పట్టికలు బోర్డులపై ప్రదర్శించాలని అన్నారు.

సైన్స్‌ఫేర్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ


ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

కంభం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : చీమకుర్తి బాలికల గురుకుల పాఠశాలలో గురువారం జరిగిన జిల్లా సైన్స్‌ఫేర్ పోటీల్లో కంభం బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు ఆరు బహుమతులు గెలుచుకున్నారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సి పాల్ చాముండేశ్వరి శుక్రవారం అభినందించారు. చీమకుర్తిలో జరిగిన జిల్లాస్థాయి ఫ్యూచర్ ఆఫ్ సైన్స్‌ఫేర్ పోటీల్లో మొత్తం 11 గురుకుల పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఐదు విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో కంభం గురుకుల పాఠశాల విద్యార్థులు రెండు ప్రథమ, రెండు ద్వితీయ, రెండు ప్రత్యేక బహుమతులు సాధించారన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో

తర్లుపాడు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలుజువ్వలపాడు పంచాయతీలోని లింగారెడ్డి కాలనీలోని ప్రాథమిక పాఠశాలను ఎంఈవో-2 అచ్యుత్ సుబ్బారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని రికార్డులను, విద్యార్థుల హాజరుపట్టి పరిశీలించారు. ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులకు సైన్స్ పట్ల అవగాహన కల్పిస్తున్న ప్రధానోపాధ్యాయులు మౌలాలిని అభినందించారు. పాఠశాలకు తరగతి గదులు లేకపోవడంతో చర్చిలో పాఠశాల నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొందని ప్రిన్సిపాల్ ఎంఈఓ-2 దృష్టికి తీసుకొచ్చాడు. పాఠశాల నిర్మాణ విషయంపై నివేదిక పంపిస్తామని ఎంఈఓ-2 హామీ ఇచ్చారు.

పారిశుధ్యంపై దృష్టిసారించండి

పొదిలి, అక్టోబరు 25 : గ్రామీణ ప్రాంతాల్లో పారి శుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో శోభన్‌బాబు అన్నారు. ఇటీవల కురిసిన వర్షాల కు అనేకరకాలైన వ్యాధు లు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. గ్రామాలను పరిశీలించి మురుగు కాలువలు, మురుగునీటి నిల్వలు లేకుండా సిబ్బంది చర్యలు చేపట్టాలన్నారు. కాలువల్లో ఉన్న పూడికతీతలను తీయించాలన్నారు. శుక్రవారం గోగినేనిపాలెం, ఉప్పలపాడు గ్రామాల్లో పర్యటించారు. సర్పంచ్ ఏసేబుతోపాటు, పంచాయతీ కార్యదర్శి శేషగిరి పాల్గొని సైడుకాలువల్లో ఉన్న మురుగు, చెట్లను తొలగించారు.

నిధుల దుర్వినియోగంపై విచారించాలి

గిద్దలూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దిగువమెట్ట తాండా గ్రామ పంచాయతీలో జరిగిన నిధుల దుర్వినియోగంపై పూర్తిస్థాయిలో విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పంచాయతీలోని పలువురు వార్డు సభ్యులు కోరారు. ఆ మేరకు మండల పరిషత్ అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. 2021 నుంచి ఇప్పటివరకు పంచాయతీకి రూ.19లక్షల నిధులు మంజూరు కాగా సర్పంచ్ బిలావత్ లోక్‌నాయక్ ఆ నిధులకు బిల్లులు పెట్టి డ్రా చేసుకొన్నాడని, పనులు చేయలేదని ఆరోపించారు. ఈ విషయంపై పూర్తిస్థాయిలో విచారించి నిధుల దుర్వినియోగం జరిగి ఉంటే సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు.

పోలీసుస్టేషన్‌లో రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న పోలీసులు

గిద్దలూరు టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా స్థానిక పోలీసు స్టేషన్ ఆవరణలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరాన్ని మున్సిపల్ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, టీడీపీ నాయకులు ముత్తుముల కృష్ణకిషోర్‌రెడ్డి ప్రారంభించారు. ఏఎస్సై షేక్ జిలాని, ఆయన కుమారుడు జావేద్, పలువురు పోలీసులు, వివిధ వర్గాల ప్రజలు సుమారు 100మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్, టీడీపీ మండల అధ్యక్షులు మార్తాల సుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు పాలుగుళ్ల చిన్నశ్రీనివారెడ్డి, చేరెడ్డి జయరామిరెడ్డి, బీజేపీ పట్టణశాఖ అధ్యక్షులు ఎ.ఉదయ్‌శంకర్, మున్సిపల్ కౌన్సిలర్ చంద్రశేఖర్, కాపు నాయకులు దుత్తా బాలీశ్వరయ్య, అర్జున్, రూరల్ సీఐలు సురేష్, రామకోటయ్య, రాచర్ల, కొమరోలు ఎస్సైలు కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు నాయక్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక వాసవి విద్యానికేతన్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాలలో ప్రిన్సిపాల్, డైరెక్టర్ రంగయ్య, ఏవో రంజిత్ కుమార్‌లు బ్యాడ్మింటన్‌కు ఎంపికైన హేమలతను సన్మానించారు. చీరాలలో ఇటీవల నిర్వహించిన ఎస్‌జీఎఫ్ఐ పోటీలలో హేమలత జిల్లాస్థాయిలో అండర్-14 బ్యాడ్మింటన్ విభాగంలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైందన్నారు. శిక్షణ ఇచ్చిన పీఈటీలు అంజనేయులు, లాజర్లను అభినందించారు.

దేవదాయశాఖ ఈవోగా లీలాకృష్ణ



పొదిలి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : దేవదాయశాఖ నూతన ఈవోగా బి.లీలాకృష్ణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న ఈవో శ్రీనివాసరావు బదిలీపై వెళ్లారు. పార్వతీసమేత నిర్మామహేశ్వర స్వామి, పొదిలి కొండ లక్ష్మీనరసింహస్వామి, వేణుగోపాల స్వామి, పొదిలమ్మ దేవాలయం, పోలేరమ్మ దేవాలయం, మహాలక్ష్మమ్మ దేవాలయాల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా రానున్న కార్తీకమాసాన్ని దృష్టిలో ఉంచుకొని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

అర్ధంతరంగా నిలిచిన ఆడిటోరియం పనులు


అర్ధంతరంగా నిలిచిన ఆడిటోరియం నిర్మాణం

పొదిలి, అక్టోబరు 25 : ఏపీ పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఓపెన్ ఆడిటోరియం అర్ధంతరంగా నిలిచిపోయింది. రూ.17.5 లక్షల ఎంపీ నిధులతో ప్రభుత్వ బాలర ఉన్నత పాఠశాల ఆవరణలో అప్పటి వైసీపీ ఎంపీ, ఎమ్మెల్యేగా ఉన్న మాగుంట శ్రీనివాసరెడ్డి, కుందురు నాగార్జున రెడ్డిలు వీటి నిర్మాణ పనులు ప్రారంభించారు. అనంతరం ఆడిటోరియం నిర్మిస్తున్న కాంట్రాక్టర్ కొంతమేర పనులు ప్రారంభించారు. ఆ తరువాత చేసిన పనులకు బిల్లులు చేసుకొని పనులు మధ్యలోనే నిలిపేసినట్లు సమాచారం. ప్రభుత్వం మారడంతో కాంట్రాక్టర్ పనులు పూర్తిగా వదిలేసినట్లు పలువురు చర్చించుకుంటున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా పూర్తి చేసి ఉపయోగంలోకి తీసుకురావాలని పలువురు ఉపాధ్యాయులు కోరుతున్నారు.

నాగజగన్నాథ్‌కు సన్మానం

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత బ్రాహ్మణ కరివేన సత్రాల సలహాదారులుగా నియమితులైన పట్టణానికి చెందిన టి నాగజగన్నాథ్‌ను శుక్రవారం బ్రాహ్మణ సంఘాల నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో గోపాలుని హరిహరరావు, పురాణం సుబ్రహ్మణ్యం, శ్రీనివాసశాస్త్రి, కేశవరావు, నాగరాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముఖాముఖి

రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

కె.నాగలక్ష్మి, తహసీల్దార్, తాళ్లూరు



ప్రశ్న : భూముల ఆన్‌లైన్ కోసం రైతులు కార్యాలయం చుట్టూ తిరుగుతూ ఉండడానికి గల కారణమేమిటి?

జవాబు : మండలంలోని పలు గ్రామాల్లో గ్రామ రెవెన్యూ రికార్డులు అస్తవ్యస్తంగా ఉన్నాయి. రికార్డులు క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలు లేని భూములను త్వరితగతిన ఆన్‌లైన్ చేసి రైతుల ఇబ్బందులు తొలగిస్తాం. హక్కుపత్రాలు, సంబంధిత డాక్యుమెంట్లు సమర్పించని వారిని పిలిపించి రికార్డులు తీసుకుని ప్రజలకు ఇబ్బందులు లేకుండా సమస్యలు పరిష్కరిస్తున్నాం.

ప్ర : మీకోసం దరఖాస్తులపై ఏం చర్యలు తీసుకున్నారు ?

జ : మీకోసం వచ్చిన దరఖాస్తులకు సంబంధించి ఆయా గ్రామాలకు వీఆర్‌వోలకు పంపి నివేదికలు తెప్పించి పరిష్కారం చూపుతున్నాం.

ప్ర : తురకపాలెం, మన్నేపల్లి గ్రామాల్లో భూసమస్యకు పరిష్కారమార్గం ఏమిటి?

జ : రైతులు తమ వద్ద ఉన్న ఆధారాలను అందజేస్తే పరిశీలించి చర్యలు చేపడతాం. అవి సమర్పించనందున కొంతమేర జాప్యం జరుగుతోంది.

ప్ర : వీఆర్‌వోల కొరతగా వల్ల రెవెన్యూ సమస్యలు పరిష్కారంలో జాప్యం ఉందా ?

జ : అన్ని గ్రామాలకు వీఆర్వోలు లేకున్నా ప్రజలకు రెవెన్యూ సంబంధ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాం. ఆయా గ్రామాలకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాం.

శిథిలం

దర్శి, ముండ్లమూరు మండలాల్లో దెబ్బతిన్న రోడ్లు, నేల చప్టాలు

గత వైసీపీ హయాంలో పూర్తిగా నిర్లక్ష్యం

ఇటీవల వర్షాలకు మరింత ఛిద్రం

ముండ్లమూరు మండలంలో గ్రామాలకు వెళ్లే పలు ప్రధాన రహదారులపై ఉన్న నేల చప్టాలు దెబ్బతినడం వల్ల ప్రజలు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడు, నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించినవి కొన్ని శిథిలావస్థకు చేరగా మరికొన్ని అధ్వానంగా తయారయ్యాయి. మారెళ్ల గ్రామ సమీపంలో జమ్మలమడక వెళ్లే రోడ్డులో ఈదర వాగుపై నిర్మించిన నేల చప్టా పూర్తిగా శిథిలావస్థకు చేరింది. రాళ్ళు, కంకర లేచి గోతులు పడ్డాయి. గంగన్నపాలెం నుంచి మారెళ్ల వచ్చే ప్రధాన రహదారిపై నేల చప్టా ప్రమాదకరంగా మారింది. చింతలపూడి సమీపంలోని నేల చప్టాదీ అదే పరిస్థితి. పెదఉల్లగల్లు-వేముల ప్రధాన రహదారిపై నేల చప్టా ప్రమాదకరంగా ఉంది. వర్షాకాలంలో చప్టాలపై నీరు ప్రవహిస్తున్నప్పుడు మరింత ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

-ముండ్లమూరు



మారెళ్ల రోడ్డులో ఇబ్బందికరంగా నేల చప్టా



మారెళ్ల సమీపంలో నేల చప్టా

ఛిద్రం

ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు మరింత ఛిద్రమయ్యాయి. అనేక రహదారులు గుంతలమయమయ్యాయి. కొన్నిచోట్ల కోసుకుపోయి ఇబ్బందికరంగా మారాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో రోడ్ల మరమ్మతులను పూర్తిగా పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం ఆ ప్రభావం తీవ్రంగా కనిపిస్తోంది. ఎక్కడికక్కడే రోడ్లు దెబ్బతిన్నాయి. దర్శి-ఆరవళ్లిపాడు రోడ్డులో తూర్పువెంకటాపురం వద్ద రోడ్డు కోసుకుపోయింది. లోలెవల్ బ్రిడ్జి దెబ్బతిని కూలే దశకు చేరింది. తూర్పువెంకటాపురంలో అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. దర్శి-తూర్పుగంగవరం రోడ్డులో బొట్లపాలెం వద్ద భారీగా గుంటలు పడ్డాయి. అటువైపు వెళ్లే వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దర్శి-సామంతపూడి రోడ్డు గుంతలమయమైంది. -దర్శి



ఛిద్రమైన దర్శి-తూర్పు గంగవరం రోడ్డు



దర్శి-ఆరవళ్లిపాడు రోడ్డులో వర్షాలకు దెబ్బతిన్న రోడ్డు



తూర్పువెంకటాపురంలో వర్షాలకు గుంతలమయమైన అంతర్గత రోడ్డు

నేడు ప్రజావేదిక

పామూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 25 గ్రామ పంచాయతీలలో ఉపాధి హామీ పథక పనులపై శనివారం స్థానిక మండలపరిషత్ కార్యాలయం వద్ద ప్రజావేదిక జరగనున్నట్లు ఎంపీడీవో సురేష్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

సిమెంటు బల్లల ఏర్పాటుకు ఆర్థిక సహాయం

పామూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సట్టుమడుగు ఎస్సీపాలెంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో భాగంగా రెండు సిమెంటు బల్లల ఏర్పాటుకు గ్రామ టీడీపీ నాయకులు కొంపల్లి వెంకట రాజేంద్ర శుక్రవారం మిక్కడ ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో దాదిరెడ్డిపల్లి, మోపాడు టీడీపీ గ్రామ అధ్యక్షులు కల్లూరి తిరుపతయ్య, గిడ్డయ్య యాదవ్, కుందూరు సుబ్బారావు, తలపనేని మాల కొండయ్య చౌదరి పాల్గొన్నారు.

రెండుచోట్ల రెవెన్యూ గ్రామసభలు

పామూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : గత రీసర్వే వల్ల తలెత్తిన తప్పిదాలను సరిచేసేందుకే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రమణరావు చెప్పారు. మండలంలోని చిలకపాడు రెవెన్యూకు సంబంధించి నుచ్చుపొద గ్రామ సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో వీఆర్వో చెన్నకేశవులు పాల్గొన్నారు.

ముండ్లమూరులో...

ముండ్లమూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భట్లపల్లిలో జరిగిన రెవెన్యూ గ్రామసభలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఆర్ శ్రీకాంత్ రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ స్రవంతి, మండల సర్వేయర్ కోటంరాజు, ఆర్ఐ మూర్తి, వీఆర్‌వో సుజాత పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలి

తాళ్లూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేరీతిలో విద్యాబోధన చేయాలని ఎంఈవో జి.సుబ్బయ్య చెప్పారు. మండలంలోని బొద్దికూరపాడు ఎంపీపీ(ఎస్సీవీఆర్) పాఠశాలను వార్షిక తనిఖీలో భాగంగా శుక్రవారం సందర్శించారు. ఉపాధ్యాయులచే మాదిరి పాఠ్యాంశాలను బోధింప చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 ఎల్.సుధాకర్ రావు, ప్రధానోపాధ్యాయుడు శ్రీమన్నారాయణ, సీఆర్పీ మారుతి, పరిశీలకులు పోలంరెడ్డి సుబ్బారెడ్డి, శ్రీదేవి పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ

దర్శి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) : టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని దర్శి టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ కోరారు. దర్శిలోని ఆమె నివాసం వద్ద శుక్రవారం సాయంత్రం నియోజకవర్గ స్థాయినాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ సభ్యత్వం ఉంటే ప్రతి కార్యకర్తకూ ధైర్యం, భరోసా ఉంటుందన్నారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే ధ్యేయంగా ఆవిర్భవించిన టీడీపీ.. అన్న ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తోందని చెప్పారు. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో ఒక పక్క పార్టీ బలోపేతం కావటంతో పాటు మరో పక్క రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందన్నారు. టీడీపీ సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్తకు ఇక నుంచి రూ.5 లక్షల ఇన్సూరెన్స్ లభిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు పంపిణీ

బాధిత కుటుంబాలకు డాక్టర్ లక్ష్మీ సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. సీహెచ్ సీతారామయ్యకు రూ. 2లక్షలు, పోకూరి నాగపావనికి రూ. 35,508, బేతంశెట్టి శివకు రూ.30,786 చెక్కులను ఆమె అందజేశారు.

సమాజ పరిరక్షణలో పోలీస్ సేవలు ఎనలేనివి

కనిగిరి జూనియర్ సివిల్ జడ్జి భరత్‌చంద్ర

పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో రక్తదానం



ప్రశంసా పత్రం అందజేస్తున్న జడ్జి భరత్‌చంద్ర

కనిగిరి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజారక్షణ, సమాజ పరిరక్షణలో పోలీస్ అందించే సేవలు ఎనలేనివని కనిగిరి జూనియర్ సివిల్ జడ్జి కే భరత్ చంద్ర అన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ప్రజలను రక్షించే క్రమంలో కొన్ని సార్లు పోలీస్‌లు తమ ప్రాణాలను కూడా పణంగా పెట్టి రక్షిస్తారన్నారు. ప్రతి ఒక్కరూ పోలీసులు గౌరవించాల్సిన బాధ్యత ఉందన్నారు. అంతేకాకుండా అసాంఘిక శక్తుల నుంచి సమాజాన్ని కూడా పరిరక్షించటంలో పోలీసులు పాత్ర ఎంతో కీలకంగా ఉంటుందన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసులను స్మరించుకుంటూ పోలీసులు చేస్తున్న సేవా కార్యక్రమాలు ఎంతో గొప్పవన్నారు. ఈ శిబిరంలో ఎస్ఐ టీ శ్రీరాంతో పాటు, యువకులు, విద్యార్థులు 104 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ ఖాజావలి, ఎస్ఐలు, మున్సిపల్ చైర్మన్ గఫార్, తదితరులు పాల్గొన్నారు. జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ చిట్టేల వెంకటేశ్వరరెడ్డి, ఏపీపీ రఘు, ఎస్‌లు మాధవరావు, కోటయ్య, కిషోర్‌కుమార్, సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటసుబ్బయ్య, అబ్దుల్ కలాం, రెడ్‌క్రాస్ జిల్లా ట్రెజరర్ మన్నం ప్రసన్నరాజు, డాక్టర్ జీవీ సుబ్బారావు, కృష్ణ, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ఓపెన్ హౌస్‌ను నిర్వహించిన పోలీసులు

ముండ్లమూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పోలీసు ఓపెన్ హౌస్‌ను ఎస్ఐ నాగరాజు నిర్వహించారు. విద్యార్థులకు పోలీసు స్టేషన్‌లో లాకప్ గది, రైటర్ రూమ్, ఎస్ఐ గది, వైర్లెస్ సెట్ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైటర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తాళ్లూరులో...

తాళ్లూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ అమర వీరుల వారోత్సవాల సందర్భంగా ఏబీసీ హైస్కూల్ విద్యార్థులు స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఎస్సై ఎస్. మల్లికార్జునరావు వారికి పోలీసింగ్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కె.వెంకటేశ్వరరావు, సోషల్ ఉపాధ్యాయుడు కొండల రావు, సిబ్బంది పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎస్ఐ మధు

విభిన్న ప్రతిభావంతులకు దుప్పట్లు పంపిణీ

వెలిగండ్ల, అక్టోబర్ 25(ఆంధ్రజ్యోతి) : పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో 30 మంది ప్రత్యేక విభిన్న ప్రతిభావంతులకు దుప్పట్లు, విద్యాసామగ్రిని ఎస్ఐ మధుసుదన్‌రావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలు వదిలిన పోలీసుల జ్ఞాపకార్థం ఏటా పాఠశాల విద్యార్థుల చదువుకు అవసరమైన విద్యాసామగ్రిని అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో దాసుప్రసాదు, రామిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు రాఘవాచారి, రవణమ్మ, ఖాసింబి, తిరుపతిరెడ్డి, ఏడుకొండలు, రవికుమార్ పాల్గొన్నారు

శ్మశాన వాటికలో చిల్లచెట్లు తొలగింపు

పామూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : పామూరు పట్టణంలోని హిందూ శ్మశానవాటికలో దట్టంగా పెరిగిన చిల్లచెట్లను ఎమ్మెల్యే ఉగ్ర ఆదేశాలతో పంచాయతీ కార్యదర్శి అరవింద సూచన మేరకు శుక్రవారం ఎక్స్‌కవేటర్ ద్వారా తొలగించారు. లోపలి భాగంలో గ్రావెల్‌ను తోలి అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్ సాంబయ్య, గుత్తి మహేష్, వార్డు మెంబర్ షేక్ మస్తాన్, మెంటా నరసింహారావు, కటకం శివప్రసాద్, బండ్ల నారాయణ పాల్గొన్నారు.



చిల్లచెట్లు తొలగింపును పర్యవేక్షిస్తున్న టీడీపీ శ్రేణులు

ఈ క్రాప్ చేస్తే బీమా చెల్లించాలి

జేడీఏ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న జేడీఏ శ్రీనివాసరావు

ముండ్లమూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : పంటలను ఈ క్రాపు చేసుకున్న ప్రతి రైతూ బీమా చెల్లిస్తే ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోయినప్పుడు పరిహారం అందుతుందని జేడీఏ శ్రీనివాసరావు చెప్పారు. ఆయన శుక్రవారం మండలంలోని వేంపాడులో ఈ క్రాప్ నమోదు చేసుకున్న రైతులతో సమావేశం నిర్వహించారు. ఇటీవల వర్షాలు కురిసి పంటలు దెబ్బతిన్నాయన్నారు. ఖరీఫ్ 2024కు సంబంధించి రైతుల జాబితా, పంట నమోదు రసీదులు అందజేశారు. వరి పంటకు ఇన్సూరెన్స్ ప్రీమియం డిసెంబరు 31 లోపు, మిగతా పంటలకు డిసెంబరు 15 లోపు ప్రీమియం చెల్లించాలని జేడీఏ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏవో ఫరూక్, శ్రీనివాసనాయక్, వీఏఏ శోభారాణి, బాల వెంకటయ్య, ఎంపీఈవో దయాసాగర్ తదితరులు ఉన్నారు.

అవీఇవీ

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి



మాట్లాడుతున్న సూపర్వైజర్ పార్వతి

కనిగిరి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : పరిశుభ్రతతోనే ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి చెప్పారు. మండలపరిధిలోని గురవాజిపేట గ్రామంలో శుక్రవారం సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సెక్టార్ లీడర్లు రాజ్యలక్ష్మీ, భాగ్యలక్ష్మీ, అంగన్వాడీ వర్కర్‌లు, హెల్పర్‌లు పాల్గొన్నారు.

రేషన్‌డీలర్ల సమస్యలను పరిష్కరించండి

మంత్రి నాదెండ్ల మనోహర్‌కు విజ్ఞప్తి చేసిన డీలర్లు



మంత్రి నాదెండ్ల మనోహర్‌కు వినతిపత్రం అందిస్తున్న డీలర్లు

దొనకొండ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): దొనకొండ, కురిచేడు మండలాల్లోని రేషన్ డీలర్లు పడుతున్న ఇబ్బందులను పరిష్కరించాలంటూ మండలంలోని రామాపురం రేషన్‌డీలర్ కామేపల్లి చెంచయ్య నేతృత్వంలో డీలర్లు రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను శుక్రవారం కలిసి విజ్ఞప్తి చేశారు. ఎనిమిది నెలలుగా రెండు మండలాలకు చెందిన డీలర్లు నిత్యావసర సరుకులు తెచ్చుకునేందుకు దూర ప్రాంతమైన ఎర్రగొండపాలెం, మార్కాపురం గోడౌన్ వద్దకి రెండుసార్లు వెళ్లాల్సివస్తుందన్నారు. సరుకులు తెచ్చుకునేందుకు ప్రతి నెల దాదాపు 40 కిలోమీటర్లు ప్రయాణం చేస్తూ తీవ్ర ఇబ్బందులు గురవుతున్నామని చెప్పాపరు. ఈ కార్యక్రమంలో రేషన్‌డీలర్ కామేపల్లి చెంచయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడలకు కంభాలదిన్నె విద్యార్థులు



రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న పీఈటీ

పామూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కంభాలదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో నిర్వహించే పలు క్రీడలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు నరసింహారావు చెప్పారు. ఒంగోలులో జరిగిన అండర్ 14, -17, జిల్లా స్థాయి ఆటల పోటీల్లో జగన్, ఎం మనీషా, రాష్ట్ర స్థాయిలో కబడ్డీ పోటీలకు, అండర్ 14 సైక్లింగ్‌లో వై ప్రవీణ్‌కుమార్, ఎం భవ్య జశ్విత ఎంపికయ్యారు. వీరిని హెచ్‌ఎం మహబూబ్ ఖాన్, ఉపాధ్యాయులు లక్ష్మీరెడ్డి అభినందించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు



రికార్డులను పరిశీలిస్తున్న సీఐ రామారావు


ముండ్లమూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని దర్శి సీఐ వై రామారావు హెచ్చరించారు. ఆయన శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. వివిధ కేసులకు రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్ఐ నాగరాజును ఆదేశించారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన ముగ్గురు వ్యక్తులు ఇటీవల సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్నారు. ఎస్సై వాటిని రికవరీ చేసి బాధితులకు అప్పగించారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
7
శనివారం 26 అక్టోబరు 2024





నేరస్తులపై.. నిఘా నేత్రాలు



- రౌడీషీటర్లు, దొంగల కదలికలపై మూడో కన్ను
- ప్రధాన కూడళ్లలో ఫేస్ రికగ్నేషన్ కెమేరాల ఏర్పాటు
- పోలీసు రికార్డుల్లోని ఫొటోల డిజిటలైజేషన్.. మ్యాట్రిక్స్ సంస్థకు అప్లోడ్

బాపట్ల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): దందాలకు పాల్పడే రౌడీషీటర్లు.. లూటీలు చేసే దొంగల కదలికల కట్టడికి పోలీస్‌శాఖ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకునేందుకు సిద్ధమైంది. ఫేస్ రికగ్నేషన్(ఎఫ్ఆర్‌సీ) పరిజ్ఞానంతో ముఖాల్ని గుర్తించే అధునాతన సీసీ కెమేరాలతో వారిపై నిఘా వేయబోతుంది. నేరస్తులను గుర్తించడమే కాకుండా పోలీసులను అప్రమత్తం చేసే బహుళ ప్రయోజనాలు ఉన్న కెమేరాలు ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేయనున్నారు. ఎక్కడికక్కడ నేరస్తులు, దొంగలు, రౌడీషీటర్ల కదలికలను కట్టడి చేసేలా మ్యాట్రిక్స్ సంస్థతో గతంలో టీడీపీ ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. అయితే కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా అధునాతన సీసీ కెమేరాలను పర్యవేక్షించే విధానం అమల్లోకి వచ్చే సమయానికి (మిగతా 8వ పేజీలో..)

మాతృ మరణాలను అరికట్టాలి

- వైద్యఆరోగ్యశాఖాధికారులతో జేసీ ప్రఖర్‌జైన్



సమావేశానికి హాజరైన వైద్యఆరోగ్యశాఖాధికారులు

బాపట్ల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాతృ మరణాలను అరికట్టడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ తెలిపారు. మాతృ మరణాలపై వైద్యఆరోగ్యశాఖాధికారులతో శుక్రవారం కలెక్టరేట్‌లో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మాతృమరణాలు అరికట్టేందుకు అధికారులంతా సమన్వయంతో పనిచేయాలన్నారు. మూడునెలలుగా ఏడు మాతృ మరణాలు నమోదుపై ఆరాతీశారు. మరణాలకు కారణాలపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. రక్తహీనత నివారణతోనే మాతృమరణాలు పూర్తి స్థాయిలో అరికట్టవచ్చని చెప్పారు. మహిళలు గర్భం ధరించగానే రికార్డులో నమోదు చేసి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గర్భిణులకు రక్తహీనత ఉంటే ముందుగానే గుర్తించి మెరుగైన వైద్యం, పౌష్టికాహారం అందించాలన్నారు. వైద్యం అందించడంలో లోపాలు సవరించాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ, డీసీహెచ్ఎస్ కోఆర్డినేటర్ శేషుబాబు, వైద్యులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో పశువుల సంత మూత

సీఎం కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాలపై పోలీసుల చర్య

చిలకలూరిపేట, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేటలో టీడీపీ నాయకుడు మల్లెల రాజేష్ నాయుడికు చెందిన పశువుల సంతను శుక్రవారం పోలీసులు మూసివేయించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వాహనాల్లో పశువులను ఇక్కడికు తరలిస్తుంటారు. ప్రతి శనివారం సంత జరుగుతుంది. ఈ సంతలో ఆయా పశువుల క్రయవిక్రయాలు జరుగుతుంటాయి. తమిళనాడు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా ఏపీ సీఎం పేషీ అధికారుల ఆదేశాలతో పోలీసులు సంతను తాత్కాలికంగా మూసివేయించారు. శుక్రవారం పెద్ద సంఖ్యలో పోలీసులు సంత వద్ద మోహరించారు. సంతలోకి ఎటువంటి పశువుల వాహనాలు పోకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. నిబంధనలు పాటించకుండా పశువుల తరలిస్తున్న కొన్ని వాహనాలపై కేసులు కూడా నమోదు చేశారు. నెల్లూరు దాటాక తమిళనాడుకు సమీపంలో ఓ సంతను తమిళనాడుకు చెందిన వ్యక్తులు నిర్వహిస్తున్నారని సమాచారం. శ్రీకాకుళం నుంచి తమిళనాడు సరిహద్దుల వరకు మధ్యలో ఎటువంటి సంత ఉండటానికి వీలు లేదని అక్కడివారు అంటున్నట్లు తెలిసింది. ఇటీవల రాజేష్‌నాయుడు ఆ సంత వద్దకు వెళ్లి హడావుడి చేసినట్లు సమాచారం. ఈ క్రమంలో అక్కడి సంత నిర్వాహకులు తమిళనాడు ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదు చేశారని తెలియవచ్చింది. ఉన్నతస్థాయిలో జరిగిన ఈ వ్యవహారంతో చిలకలూరిపేటలోని సంత మూతబడింది.

మామూళ్ల దౌర్జన్యం!



- రుణం పొందాలంటే డబ్బులు ఇచ్చుకోవాల్సిందే
- ఆర్పీ, యానిమేటర్ల దోపిడీ
- ఒక్కో గ్రూపు నుంచి రూ.10 వేల నుంచి రూ.15 వేలు వసూలు
- పొదుపు రుణాల్లోనూ వాటాకు డిమాండ్
- సమావేశ తీర్మానాలు రాసినందుకూ పైకం చెల్లించాల్సిందే

గుంటూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా గ్రూపుల మహిళలను మామూళ్ల గద్దలు వేధించుకు తింటున్నాయి. డ్వాక్రా సంఘాల్లో ఏ చిన్న పని జరగాలన్నా చేయి తడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. స్వావలంబన కోసం ఇచ్చే రుణాలు మొదలు అత్యవసర పరిస్థితుల్లో తాము దాచుకున్న పొదుపు డబ్బులపై తీసుకునే రుణాలకు కూడా గ్రూపు సభ్యులైన మహిళలు భారీ మొత్తంలో నగదు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితిపై మహిళలు గగ్గోలు పెడుతున్నా ఏమాత్రం వెరవకుండా పట్టణాల్లోని రిసోర్స్‌పర్సన్లు, గ్రామాల్లోని సెర్ప్ యానిమేటర్లు (మిగతా 8వ పేజీలో..)



గిట్టుబాటు గగనం

తెల్ల బంగారం.. తెల్లబోతోంది. సిరులు కురిపించాల్సిన పత్తికి గిట్టుబాటు ధర గగనంగా మారింది. సీసీఐ కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై మీనమేషాలు.. రోజురోజుకు ధర పడిపోవడం.. అప్పులకు వడ్డీల భారం పెరిగిపోతుండటంతో రైతులు అందినకాడికి అమ్మేసుకుంటున్నారు. ఇదే అవకాశంగా దళారులు రైతులను దోచుకుంటున్నారు. పంట చేతికి రాకముందు ఆకాశాన్నంటిన ధరలు, ఇప్పుడు నేలను చూస్తున్నాయి. బహిరంగ మార్కెట్‌లో పత్తి క్వింటాల్ ధర రూ.5 వేల కంటే తక్కువకు పడిపోయింది. తేమ శాతం ఎక్కువగా ఉందన్న సాకుతో దళారులు రైతు నోట్లో మట్టికొడుతున్నారు. పత్తి క్వింటాల్‌కు మద్దతు ధర రూ.7521గా కేంద్రం ప్రకటించింది. రైతులను ఆదుకోవాల్సిన సీసీఐ, మార్కెటింగ్ శాఖలు చోద్యం చూస్తున్నాయి. పత్తి కోతలు ముమ్మరంగా జరుగుతున్నా ఒక్క కొనుగోలు కేంద్రాన్ని కూడా సీసీఐ ప్రారంభించలేదు.

- దళారుల చెరలో పత్తి రైతులు
- పెట్టుబడీ రాక రైతులు లబోదిబో
- కొనుగోలు కేంద్రాలపై సీసీఐ మీనమేషాలు
- క్వింటాల్‌కు రూ.5 వేల కంటే తక్కువకే కొనుగోలు

చీరాల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాలు.. తెగుళ్లను అధిగమించి పండించిన పత్తికి మార్కెట్‌లో ధర తగ్గింది. విపత్తులు దిగుబడిపై దెబ్బకొడితే వ్యాపారులు ధరలు తగ్గించి సాగుదారులను ఆర్థికంగా నష్టపరుస్తున్నారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 2.12 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. గిట్టుబాటు ధర లేకపోవడంతో పెట్టుబడి కూడా రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో ముదురు పత్తి చేతికి వస్తుంది. ప్రభుత్వం క్వింటాకు రూ.7,521 మద్దతు ధర ప్రకటించింది. పత్తి కోతలు ముమ్మరంగా సాగుతున్నా కేంద్రాల ఏర్పాటు ఆలస్యం అవుతుంది. అప్పులు తీర్చేందుకు రైతులు పంటను తెగనమ్ముకునే పరిస్థితి నెలకొంది. దీన్ని ఆసరా చేసుకున్న వ్యాపారులు పత్తి ధరను తగ్గించి వేశారు. గ్రామ స్థాయిలోనే వ్యాపారులు కొనుగోళ్లు ఆరంభించారు. గత నెలలో క్వింటా పత్తి రూ 8 వేలు ఉండగా ఇప్పుడు రూ.6,500కు మించడంలేదు. ఇళ్లలో నిల్వ చేసే అవకాశం లేని వారు, అప్పులకు వడ్డీల భారం పెరుగుతుందని కొందరు, ఇంకా ఆగితే ధర మరింత తగ్గుతుందని భయంతో మరికొందరు రైతులు తెగనమ్ముకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో పల్నాడు జిల్లాలో గత వారం పత్తి క్వింటాల్ ధర రూ.5,200 నుంచి రూ.6 వేల వరకు పలికింది. ప్రస్తుతం రూ.5 వేలకు పడిపోయింది. గుంటూరు జిల్లాలో పత్తి క్వింటాల్ ధర రూ.5400 నుంచి రూ.6 వేలుగా ఉంది. రోజురోజుకూ ఎక్కువ పంట చేతికి వస్తుండటంతో వ్యాపారులు ధరలు బాగా తగ్గించేస్తున్నారు. గుంటూరు, తాడికొండ, ప్రత్తిపాడు, ఫిరంగిపురం, చిలకలూరిపేట, నరసరావుపేట, గురజాల, క్రోసూరు, మాచర్ల, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, మార్టూరు, పర్చూరు ప్రాంతాల్లో కేంద్రాల ఏర్పాటుకు మార్కెటింగ్ శాఖ సీసీఐకి ప్రతిపాదనలు పంపింది, ఇందుకు సంబంధించి కేంద్రాల ఇన్‌చార్జిలను కూడా నియమించింది. అయినా కేంద్రాల ఏర్పాటులో సీసీఐ జాప్యం చేస్తుండటం రైతులను తీవ్రంగా నష్టపరుస్తోంది.



దిగుబడులు.. ధరలూ తగ్గాయి..

అధిక వర్షాలు పత్తి దిగుబడులను దెబ్బతీశాయి. ఎకరాకు 15 క్వింటాళ్ల వరకు రావాల్సిన దిగుబడి 7 నుంచి 8 క్వింటాళ్లకు పడిపోతున్నదని రైతులు వాపోతున్నారు. పత్తి కోత సమయంలో వర్షాలు కురవడంతో కాయ రాలిపోతోంది. పల్నాడులో ప్రస్తుతం పత్తి తీత ఎక్కువగా జరుగుతుంది. వర్షాల ప్రభావంతో ముందు కాపునకు వచ్చిన చేలల్లోని పంట పూర్తిగా పాడైందని రైతులు చెప్తున్నారు. ఇప్పుడు తీస్తున్న పత్తిలో తేమ 20 శాతం ఎక్కువగా ఉందన్న సాకుతో వ్యాపారులు ధరను పూర్తిగా తగ్గిస్తున్నారు. ఎండకు ఆరబెట్టినా అదే ధరకు కొనుగోలు చేస్తున్నారు. ఈ ఏడాది గుంటూరు జిల్లాలో 20,145 హెక్టార్లు, పల్నాడు జిల్లాలో సుమారు 1.5 లక్షల హెక్టార్లలో పత్తి సాగైనట్లు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అంచనా. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో మార్కెట్‌లో ధర తగ్గిపోతున్నా విక్రయించాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెట్టుబడికి.. రాబడికి పొంతనే లేదు

ప్రస్తుతం ఉన్న ధరల ప్రకారం పత్తి విక్రయాలు చేపడితే రైతులు అప్పుల్లో కూరుకుపోకతప్పదు. పెట్టిన పెట్టుబడికి, వచ్చే రాబడికి పొంతనే లేదు. పత్తి ఎకరా సాగుకు కౌలు రూ.20 వేలు, సాగు ఖర్చులు రూ.10 వేలు, కలుపు, విత్తనాలకు రూ.7400 వరకు పెట్టుబడి అవుతుంది. క్వింటాల్ పత్తి తీసినందుకు రూ.1300 వరకు కూలి కింద పోతుంది. ఎకరానికి సగటున 6 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తే ప్రస్తుతం ఉన్న ధర ప్రకారం రూ.30 వేలు మాత్రమే చేతికి వస్తుంది. అంటే, రైతుకు ఎకరాకు రూ.7,400 వరకు నష్టం వాటిల్లుతుంది. దీనికి తోడు రైతు కష్టం, అప్పునకు వడ్డీలు కలిపితే నష్టం తడిసి మోపెడవుతుంది. సీసీఐ కేంద్రాలు తెరిస్తే రైతుకు కొంతలో కొంత గిట్టుబాటు అవుతుంది. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఈ ఏడాది పత్తికి అనుకూలమైన మద్దతు ధర ప్రకటించినా దానిని అందుకోలేని పరిస్థితుల్లో రైతులు ఉన్నారు. సీసీఐ కేంద్రాలు తెరిస్తే తమకు కొంత న్యాయం జరుగుతుందని రైతులు అంటున్నారు.

రేషన్ పండుగ





- దీపావళికి కందిపప్పు, జొన్నలు
- సబ్సిడీపై కందిపప్పు, 3 కేజీల జొన్నలు ఉచితం
- కార్డు లబ్ధిదారులందరికీ అందించేలా ప్రణాళికలు
- రేషన్ అంటే బియ్యంతో సరిపెట్టిన గత వైసీపీ పాలకులు

రేపల్లె, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగకు రేషన్‌కార్డుదారులకు ప్రభుత్వం శుభవార్త ప్రకటించింది. ఇప్పటికే ఉచిత గ్యాస్ సిలిండర్‌తో పేదలపై భారాన్ని తగ్గించిన ప్రభుత్వం కందిపప్పు, జొన్నలు సబ్సిడీపై అందించనుంది. గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో రేషన్ దుకాణాల్లో కనిపించని కందిపప్పు కూటమి ప్రభుత్వం రాకతో మళ్లీ రేషన్‌లో దర్శనమివ్వబోతోంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 14 లక్షల 56 వేల తెల్ల రేషన్‌కార్డులు ఉండగా బాపట్ల జిల్లాలో భాగమైన చీరాల డివిజన్లో మరో రెండున్నర లక్షల తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయి. మొత్తంగా మూడు జిల్లాల పరిధిలోని 17లక్షల తెల్ల రేషన్ కార్డుదారులకు నవంబరు నుంచి రాష్ట్ర ప్రభుత్వం బియ్యం, పంచదారతోపాటు కందిపప్పు, జొన్నలను రేషన్ ద్వారా అందించనుంది. ఒక్కో రేషన్ కార్డుపై కిలో కందిపప్పు, గరిష్టంగా 3 కిలోల వరకు జొన్నలు అందించాలని నిర్ణయించింది. ప్రతి కార్డుదారుడు జొన్నలు ఉచితంగా పొందవచ్చు. కార్డుపై వచ్చే బియ్యంలో ఎన్ని కిలోల బియ్యం వదులు కుంటే అన్ని కిలోలు(3 కిలోల లోపు) బియ్యానికి బదులుగా జొన్నలు అందిస్తారు. కాగా ఇప్పటికే అక్టోబరులో కొన్ని ప్రాంతాల్లో పౌర సరఫరాల శాఖ ద్వారా ప్రజలకు రాగులు అందజేసింది.

మూడేళ్ల తర్వాత కందిపప్పు.. ఐదేళ్ల తర్వాత జొన్నలు

2014- 19 మధ్య టీడీపీ ప్రభుత్వ పాలనలో రేషన్ షాపుల ద్వారా సబ్సిడీ బియ్యంతోపాటు, పంచదార, కందిపప్పు, పామాయిల్, గోధుమలు, రాగులు, జొన్నలు, గోధుమ పిండి, శనగలు లభించేవి. 2019లో వైసీపీ అధికారం చేపట్టిననాటి నుంచి ఒక్కొక్కటిగా రేషన్ సరుకులన్నీ మాయమైపోయాయి. ఒకానొక దశలో పంచదార కూడా పేదలకు దక్కలేదు. గత ప్రభుత్వం రేషన్ కార్డులను బియ్యం కార్డులుగా మార్చింది. పైపెచ్చు ప్రతి ఏటా క్రిస్మస్, సంక్రాంతి, రంజాన్ పండుగలకు ఇచ్చే కానుకలు కూడా పేదలకు ఇవ్వకుండా ఎగవేసింది. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచే పేదలకు సబ్సిడీ కందిపప్పు, సరుకులు అందించాలని కృషి చేస్తోంది. ఆ ప్రయత్నం ఇప్పటికిగానీ సాకారం కాలేదు.

29 నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉచిత గ్యాసు సిలిండర్ పథకం ఈ నెల 29 నుంచి లాంఛనంగా ప్రారంభం కాబోతోంది. దీనికి సంబంధించి విధివిధానాల రూపకల్పన కూడా పూర్తయింది. ఒకేసారి మూడు సిలిండర్లు ఇవ్వడం కంటే నాలుగు నెలలకు ఒకసారి సిలిండర్ ఇచ్చేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నెల 29న పథకం ప్రారంభమైన రోజు నుంచి ఉచిత సిలిండర్లు అందుబాటులోకి రానున్నాయి. తొలి సిలిండర్‌ను ఈ నెల 29 నుంచి వచ్చే ఏడాది మార్చి 31 లోపు ఎప్పుడైనా బుక్ చేసుకోవచ్చు. రెండో గ్యాసు సిలిండర్ ఏప్రిల్ 1 నుంచి జూలై 31లోపు, మూడో సిలిండర్‌ను ఆగస్టు 1 నుంచి అక్టోబరు 31లోపు ఎప్పుడైనా బుక్ చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది.



నేటి నుంచి టీడీపీ సభ్యత్వ నమోదు

- నియోజకవర్గాల వారీగా నేతలకు దిశానిర్దేశం
- గత రికార్డులు అధిగమించేలా ప్రత్యేక కార్యాచరణ
- వాట్సాప్ ద్వారా కూడా సభ్యత్వ నమోదుకు అవకాశం

బాపట్ల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో అనేక కుదుపులకు లోనై నిలబడి.. కూటమి పార్టీ శ్రేణుల సహకారంతో రికార్డు మెజారిటీతో తెలుగుదేశం పార్టీ గద్దెనెక్కింది. ఈ నేపథ్యంలో శనివారం నుంచి జిల్లా వ్యాప్తంగా టీడీపీ సభ్యత్వ నమోదుకు శ్రీకారం చుట్టింది. పార్టీ అధికారంలోకి వచ్చాక జరుగుతున్న కార్యక్రమం కనుక శ్రేణుల నుంచి పెద్ద ఎత్తున స్పందన ఉంటుందని నేతలు అంచనా వేస్తున్నారు. సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు బీమా సౌకర్యం కల్పించడంతో అన్ని విధాల అండగా ఉండేలా పార్టీ కార్యాచరణ రూపొందించింది. భవిష్యత్తులో శ్రేణుల సంక్షేమం కోసం తీసుకునే చర్యల్లో ఈ సభ్యత్వమే ప్రామాణికంగా అడుగులు వేయనుంది. తొలిసారి వాట్సాప్ ద్వారా సభ్యత్వం తీసుకునే వెసులుబాటును పార్టీ కల్పించింది. సభ్యత్వ నమోదులో గతంలో ఉన్న రికార్డులను అధిగమించేలా శ్రేణులు ముందుకు వచ్చి సభ్యత్వం తీసుకునేలా నేతలు కార్యాచరణ రూపొందించారు. ఇందుకు గాను ఇప్పటికే ఆయా నియోజకవర్గాల నేతలకు పార్టీ అగ్రనాయకత్వం దిశానిర్దేశం చేసింది. ఏళ్ల నుంచి టీడీపీని అంటిపెట్టుకుని ఉన్న సంప్రదాయ వర్గాలతో పాటు కొత్తవారిని, టీడీపీ మద్దతుగా ఉండే తటస్తులను కూడా ఈ దఫా సభ్యత్వం తీసుకునేలా చేయాలని, తద్వారా పార్టీ క్రియాశీల సభ్యత్వాన్ని గణనీయంగా పెంచేలా నేతలు కృషి చేసే విధంగా మార్గనిర్దేశనం చేసింది.

పాల్గొననున్న నేతలు..

శనివారం నుంచి ప్రారంభమయ్యే టీడీపీ సభ్యత్వ నమోదులో భాగంగా శ్రేణులతో చీరాలలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే కొండయ్య శుక్రవారం సమావేశమయ్యారు. సభ్యత్వం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను శ్రేణులకు ఆయన వివరించారు. అద్దంకి నియోజకవర్గ పరిధిలోని పుట్టావారిపాలెంలోని అతిథి గృహంలో శనివారం జరిగే టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ పాల్గొననున్నారు. వేమూరులోని పార్టీ కార్యాలయంలో జరిగే సభ్యత్వ నమోదులో మాజీ మంత్రి, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు హాజరుకానుండగా, బాపట్ల మండల పరిధిలోని జమ్ములపాలెంలో జరిగే సభ్యత్వ నమోదులో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పాల్గొననున్నారు.



సభ్యత్వ నమోదుపై చీరాలలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

మామూళ్ల దౌర్జన్యం!

(7వ పేజీ తరువాయి)

● మంగళగిరి నగరంలోని ఒక డ్వాక్రా గ్రూపు రుణం తీరిపోవడంతో తాజాగా మరోమారు బ్యాంకు నుంచి రుణం తీసుకుంటున్నారు. రుణ చెల్లింపులు బాగుండడంతో రుణం ఇచ్చేందుకు బ్యాంకు కూడా ఓకే చెప్పింది. కానీ ఆర్పీ మాత్రం తనకు డబ్బులు ఇస్తేనే వ్యవహారం ముందుకు కదులుతుందని అడ్డం తిరిగింది. దీంతో వారు ఒక్కొకరూ రూ. 1,500 చెల్లించి పని పూర్తి చేయించుకున్నారు.

● తుళ్లూరు మండలంలోని ఒక గ్రామంలో ఇదే పరిస్థితి. డ్వాక్రా మహిళలు తాము పొదుపు కింద దాచుకున్న నగదు నుంచి రుణం తీసుకోవాలనుకున్నారు. భారీ మొత్తంలో కాకపోయినా వారికి ఒక్కొకరికి రూ. 20 వేలు రుణం వచ్చింది. అందరూ కలిసి రూ. 2వేలు ఇస్తేనే తాను పని చేసిపెడతానని యానిమేటర్ అడ్డం తిరిగింది. దీంతో వారంతా కలిసి ఆమెకు డబ్బులు ఇచ్చి పని చేయించుకోవాల్సి వచ్చింది. ఇది ఎక్కడో ఒక చోట జరుగుతున్న వ్యవహారం కాదు. జిల్లాలో ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి. డ్వాక్రా సంఘాల మహిళలు ఆర్పీ, యానిమేటర్ల చేయి తడపకుండా ఒక్క పని కూడా జరగని పరిస్థితి.

అయినకాడికి మహిళలను దోచేస్తున్నారు

● లక్షలాది మందిపై ఒత్తిళ్లు

ఉమ్మడి జిల్లాలో గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో 74,640 స్వయం సహాయక బృందాలు (డ్వాక్రా గ్రూపులు) ఉన్నాయి. వాటిలో ఏడున్నర లక్షల మందికి పైగా మహిళలు సభ్యులుగా ఉంటూ, స్వావలంబన కోసం కృషి చేస్తున్నారు. గ్రూపు నిర్వహణ, సభ్యుల సమావేశం, కార్యకలాపాల్లో సహాయ సహకారాలు అందించేందుకు పట్టణ ప్రాంతాల్లో రిసోర్స్ పర్సన్లను మెప్మా నియమించగా, గ్రామీణ ప్రాంతాల్లో యానిమేటర్లను గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలోని సెర్ప్ నియమించింది. ఇలా గ్రూపు మహిళలకు సహాయ, సహకారాలు అందించడం కోసం ఏర్పాటు చేసిన వ్యవస్థ ఇప్పుడు రాబందుల వ్యవస్థగా మారింది. డ్వాక్రా మహిళలను పీడించుకుతింటున్నారు. డ్వాక్రా మహిళలు తమకు నగదు చెల్లించడం అనేది తమ హక్కుగా భావించి వారిపై తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు తెస్తున్నారు. ఒక్కో పనికి రేటు కట్టి మామూళ్లు వసూళ్లు చేస్తున్నారు.

రుణం పొందాలంటే రూ. 10 వేలు ఇవ్వాల్సిందే

డ్వాక్రా మహిళలు స్వయం సహాయక బృందాలుగా ఏర్పడి ఆర్థిక స్వావలంబన చేసుకునేందుకు ప్రభుత్వం బ్యాంకుల నుంచి రుణ సహాయం చేయిస్తుంది. ఏదో ఒక స్వయం ఉపాధి పొందుతూ మహిళలు తమ కాళ్లపై తాము నిలబడేందుకు ఆ రుణాలు తోడ్పడుతాయి. అవి తీరిన వెంటనే మరోమారు ప్రభుత్వం రుణాలు అందిస్తుంది. నిరంతరం జరిగే ఈ ప్రక్రియను యానిమేటర్లు, ఆర్పీలు ఆదాయ వనరుగా మార్చుకున్నారు. ప్రతిసారి ఇలా రుణం పొందే సమయంలో ఒక్కో మహిళ నుంచి రూ. వెయ్యి నుంచి రూ.1500 వరకూ, లేదంటే గ్రూపు మొత్తంగా రూ.10 వేల నుంచి రూ. 15 వేల వరకూ ఆర్పీలు, యానిమేటర్లు వసూలు చేస్తున్నారు. రుణ దరఖాస్తులు పూర్తి చేయడానికి, తీర్మానాలు రాయడానికి ఈ మొత్తం వసూలు చేస్తున్నారు. మహిళలు ఇవ్వడానికి ఇష్టపడకపోతే మోకాలడ్డి ఆపుతున్నారు. అధికారులకు ఫిర్యాదులు చేసినా వెరవని స్థితికి చేరారు. ఫిర్యాదులు పెట్టకుండా బెదిరింపులకు దిగుతున్నారు. వీటితోపాటు అత్యవసర సమయంలో పొదుపు డబ్బులపై తీసుకునే రుణాలకు కూడా వీరి మామూళ్ల బాదుడు తప్పడం లేదు. గ్రూపునకు రూ. 2వేల నుంచి రూ. 4వేలు ఇవ్వకుండా పని జరగడం లేదు. వీటితోపాటు ప్రతి నెలా నిర్వహించే గ్రూపు సమావేశంలో సమావేశంలోని అంశాలు, తీర్మానాలు రాసినందుకు రూ. 500 నుంచి రూ. 1000 వరకు వసూలు చేస్తున్నారు. దీంతో డ్వాక్రా మహిళలు లబోదిబోమంటున్నారు.

మామూళ్లు తీసుకుంటే కఠిన చర్యలే

డ్వాక్రా మహిళల నుంచి మామూళ్లు వసూలు చేస్తే ఉపేక్షించే ప్రసక్తే లేదు. ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశాం. అయినప్పటికీ ఇలాంటి చర్యలు జరుగుతున్నట్లు మా దృష్టికి వస్తోంది. సెర్ప్, మెప్మా పరిధిలో ఇలాంటి చర్యలకు ఎవరు పాల్పడినా అక్కడికక్కడే చర్యలు తీసుకుంటాం. బాధితులు నేరుగా నాకు ఫిర్యాదు చేయవచ్చు.

- విజయలక్ష్మి, పీడీ డీఆర్‌డీఏ, మెప్మా(ఎఫ్ఏసీ)

నేరస్థులపై.. నిఘా నేత్రాలు

● రౌడీషీటర్లు, దొంగల కదలికలపై మూడో కన్ను

● ప్రధాన కూడళ్లలో ఫేస్ రికగ్నేషన్ కెమేరాల ఏర్పాటు

● పోలీసు రికార్డుల్లోని ఫొటోల డిజిటలైజేషన్

(7వ పేజీ తరువాయి)

రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మ్యాట్రిక్స్ సంస్థతో జరిగిన ఒప్పందంలో స్కాం జరిగిందని ప్రాజెక్టును ప్రభుత్వం బ్లాక్ లిస్టులో పెట్టి మూలన పడేసింది. ఫలితంగా నేరాలు, రోడ్డు ప్రమాదాలు, దొంగలు, చైన్ స్నాచింగ్ నేరస్తులు చెలరేగిపోయారు. అసాంఘిక శక్తులు పెట్రేగాయి. సీసీ కెమేరాలు అందుబాటులో లేకపోవడంతో ఎంతటి పెద్ద నేరాలు జరిగినా నేరస్తులను పోలీసులు గుర్తించలేకపోయారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పోలీస్ శాఖలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించే మార్గాలపై సీఎం చంద్రబాబు దృష్టి సారించారు. ఈ క్రమంలో గతంలో మ్యాట్రిక్స్ సంస్థ ప్రాజెక్టును తిరిగి పట్టాలెక్కించి పూర్తిస్థాయిలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు ప్రారంభించారు. ఇందులో భాగంగా గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని రైల్వేస్టేషన్లు, బస్టాండ్లతో పాటు కొన్ని రహస్య ప్రాంతాల్లో ఫేస్ రికగ్నేషన్ కెమేరాలను ఏర్పాటు చేయనున్నారు. జన సమర్థంగా ఉండే కూడళ్లు, ఇతర ముఖ్య ప్రదేశాల్లో కూడా మ్యాట్రిక్స్ కెమేరాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించిన పోలీసు అధికారులు ఎస్‌హెచ్‌వోల వారీగా ఆదేశాలు జారీ చేశారు. ఈ కెమేరాల ఏర్పాటుతో నేరస్తుల కదలికలను పసిగట్టి నేరాలను కట్టడి చేయడంతో పాటు నేరం జరిగిన తర్వాత వారిని పట్టుకునే సౌలభ్యం కూడా ఉంటుందని పోలీసు శాఖ భావిస్తోంది. అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో రౌడీషీటర్ల ఫొటోలను తీయించి డిజిటలైజేషన్ చేసి మ్యాట్రిక్స్ సంస్థకు అప్‌లోడ్ చేసేందుకు అవసరమైన ఏర్పాట్లలో పోలీసు శాఖ నిమగ్నమైంది. భవిష్యత్‌లో ఫేస్ రికగ్నేషన్ కెమేరాలను ప్రైవేటు సంస్థలు ఏర్పాటు చేసుకుంటే వాటిని కూడా మ్యాట్రిక్స్ సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేసే అవకాశం ఉంది. తద్వారా నేరస్తులు ఏ ప్రాంతానికి వెళ్లినా ఇట్టే పసిగట్టే అవకాశం ఉంటుంది.

గుర్తింపు.. వెంటనే అప్రమత్తం

రోడ్లు, ఇళ్లు, కార్యాలయాల వద్ద జన సంచారాన్ని రికార్డు చేసేందుకు సాధారణంగా సీసీ కెమేరాలను ఏర్పాటు చేస్తుంటాం. ఇలాంటి వాటినే గతంలో పోలీస్ శాఖ కూడా వినియోగించింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మ్యాట్రిక్స్ సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగా మనిషి ముఖాన్ని(ఫేస్ రికగ్నేషన్) గుర్తించడమే కాకుండా అప్పటికే తమ వద్ద అప్లోడ్ అయిన వ్యక్తుల కదలికలను పసిగట్టి వెంటనే కంట్రోల్ రూమ్ ద్వారా అప్రమత్తం చేయడం మ్యాట్రిక్స్ సంస్థ ఏర్పాటు చేసే సీసీ కెమేరాల ప్రత్యేకత. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తూ సిగ్నల్స్ జంప్ చేసే వాహనాల నెంబర్లను గుర్తించడమే కాకుండా ఆ డేటా ప్రకారం సంబంధిత యజమానికి ఆన్‌లైన్లోనే చలానా పంపే పరిజ్ఞానం ఉంది. నైట్‌విజన్ కెమేరాలను, 360 డిగ్రీల రేడియస్ కలిగిన కెమేరాలను కూడా అందుబాటులోకి తీసుకొచ్చింది.

ఎస్పీలతో ఐజీ సమీక్ష

మూడు రోజుల క్రితం గుంటూరులో రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి తన కార్యాలయంలో రేంజి పరిధిలోని ఎస్పీలతో నిర్వహించిన సమీక్షలో సీసీ కెమేరాలపై ప్రధానంగా చర్చించారు. దీంతో అన్ని ప్రధాన కూడళ్లలో సీసీ కెమేరాలు ఏర్పాటుతో పాటు రౌడీషీటర్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయా ఎస్పీలు అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌వోలకు ఆదేశించారు. స్టేషన్ల పరిధిలో రౌడీషీట్లు తెరిచిన సమయంలో తీసిన రౌడీషీటర్ల ఫొటోల ఆధారంగా డిజిటలైజేషన్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. వాటిని పీడీఎఫ్ ఫార్మాట్లో రౌడీషీటర్ సమగ్ర సమాచారంతో మ్యాట్రిక్స్ సంస్థకు అప్లోడ్ చేయాలని ఆదేశించారు. తదుపరి దొంగలు, కేడీలు, సస్పెక్టెడ్ షీటర్స్ ఫొటోలను కూడా అదేవిధంగా అప్లోడ్ చేయాలని నిర్ణయించారు. అందరి ఫొటోలను మ్యాట్రిక్స్ సంస్థతో అనుసంధానం చేసిన తర్వాత ఆయా వ్యక్తులు రాష్ట్రంలో ఏ ప్రాంతానికి వెళ్లినా వారి కదలికలను ఫేస్ రికగ్నేషన్ కెమేరాలు పసిగట్టి కంట్రోల్ రూమ్‌లో ఉండే సిబ్బందిని అప్రమత్తం చేస్తాయి. దీంతో పోలీసులు వారి కదలికలను పసిగట్టి ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవడం ద్వారా నేరాలను అరికట్టడానికి సాధ్యమవుతుంది. కోర్టు కేసుల్లోనూ ఈ ఆధారాలు ఉపయోగపడనున్నాయి.



అండర్‌పాస్ ఏర్పాటుచేయనున్న రాజుపాలెం క్రాస్ రోడ్డు



మినీ అండర్‌పాస్ ఏర్పాటు చేయనున్న జొన్నతాళి క్రాస్ రోడ్డు

అండర్‌పాస్‌ల ఏర్పాటుకు రూ. 66.58 కోట్లు

● రాజుపాలెం, జొన్నతాళి క్రాస్ రోడ్ల వద్ద ఏర్పాటు

● టెండర్లు పూర్తికాగానే పనుల ప్రారంభం

మార్టూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా మార్టూరు మండలం 16 వ నంబరు జాతీయరహదారిపై రాజుపాలెం క్రాస్ రోడ్డు, జొన్నతాళి క్రాస్ రోడ్డుల వద్ద అండర్ పాస్‌లను ఏర్పాటుచేయడానికి నేషనల్‌హైవే అథారిటీస్ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) నిధులు మంజూరుచేసింది. ఈ రెండు క్రాస్ రోడ్డుల వద్ద అండరుపాస్‌ల నిర్మాణానికి రూ.66,58,69,249లు నిధులు మంజూరు చేశారు. విజయవాడ నుంచి ఒంగోలు మధ్య జాతీయరహదారిపై మార్టూరు మండల పరిధిలో ఈ అండర్‌పాస్‌ల నిర్మాణం జరగనుంది. అయితే రాజుపాలెం క్రాస్ రోడ్డు వద్ద పెద్ద అండర్‌పాస్ (వీ యూపీ), జొన్నతాళి క్రాస్ రోడ్డు వద్ద మినీ అండరుపాస్ (ఎల్‌వీయూపీ) ఏర్పాటుచేయనున్నారు. వాటికి సంబంధించి టెండర్ల ప్రక్రియ పూర్తి కాగానే సంబంధిత పనులను ప్రారంభించనున్నట్లు తెలిసింది. ఈ విషయమై హైవే ప్రాజెక్ట్ డైరెక్టర్ విద్యాసాగర్‌ను ఆంధ్రజ్యోతి సంప్రదించగా రెండు అండర్ పాస్‌ల నిర్మాణం కోసం టెండర్లు ప్రకటించిన మాట వాస్తవమే నన్నారు. పనులు పూర్తికాగానే వీలయినంత త్వరితంగా నిర్మాణం చేపడతామన్నారు.

టీడీపీ సభ్యత్వంతో భరోసా



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

● ఎమ్మెల్యే కొండయ్య

● నేటి నుంచి నమోదు ప్రారంభం

చీరాల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) : టీడీపీ కుటుంబ సభ్యులుగా పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికీ భరోసా కలుగుతుందని, మరోవైపు పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం టీడీపీ సభ్యత్వ నమోదుకు సంబంధించి అవగాహన, సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడుతూ సీఎం చంద్రబాబు అమలు పరుస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను మననం చేశారు. టీడీపీ బలోపేతానికి పార్టీ శ్రేణులు సభ్యత్వం ద్వారా గణనీయంగా కొత్తవారిని పార్టీలోకి ఆహ్వానించాలన్నారు. టీడీపీ సభ్యత్వం తీసుకున్న వారికి ఒనగూరే ప్రయోజనాలను వివరించారు. అందులో ప్రాథమికంగా రూ.5 లక్షల ప్రమాద బీమా, విద్య వైద్యం రంగాలతో పాటు ఇతరత్రా ప్రయోజనాలతో పాటు సంఘంలో గౌరవ, మర్యాదలుగా పెంపొందుతాయన్నారు. అందుకు అనుగుణంగా కొత్తవారిని చైతన్యపరస్తూ శ్రేణులు చేపట్టాల్సిన కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో నాయకులు నాసిక వీరభద్రయ్య, కొమ్మనబోయిన రజని, డాక్టర్ సజ్జా హేమలత, గంజి పురుషోత్తమ్, కౌతవరపు జనార్దనరావు, టీడీపీ క్లస్టర్, బూత్, యూనిట్ ఇన్‌చార్జులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు ప్రారంభించనున్న మంత్రి

అద్దంకి, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు శనివారం నుంచి ప్రారంభం కానుంది. సంతమాగులూరు మండలం పుట్టావారిపాలెం అడ్డరోడ్డు వద్ద గొట్టిపాటి గెస్ట్ హౌస్‌లో శనివారం ఉదయం 11 గంటలకు సభ్యత్వ నమోదు ప్రారంభం కార్యక్రమాన్ని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలు, అద్దంకి పట్టణ టీడీపీ అధ్యక్షులు, అనుబంధ విభాగాల నేతలు హాజరుకావాలని కోరారు. అనంతరం మధ్యాహ్నం 1 గంటకు వెల్లలచెరువులో జరిగే కార్యక్రమంలో మంత్రి రవికుమార్ హాజరుకానున్నారు.

ఓవర్‌హెడ్ ట్యాంకులను శుభ్రం చేయాలి

చినగంజాం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) :గ్రామాల్లోని తాగునీటి ఓవర్‌హెడ్ ట్యాంకులను ప్రతి 15 రోజులకు ఒకసారి శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలని చినగంజాం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.విజయభాస్కరరావు అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని రాజుబంగారుపాలెం, కొత్తపాలెం గ్రామాల్లో డయేరియా వ్యాధి నిర్మూలనపై శుక్రవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శుభ్రం చేసిన తేదీలను ఓవర్‌హెడ్ ట్యాంకుల వద్ద బోర్డుపై రాసి ఉంచాలని వైద్యాధికారి సూచించారు.

ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ చిరంజీవి, హెచ్‌వీ ఉల్దారాణి, హెల్త్ అసిస్టెంట్ నర్రా మురళి, ఏఎన్‌ఎం సువర్ణలత, సుమలత, సీహెచ్‌వోఎస్‌లు షకీన, వసుధ, ఆశా కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



రాజుబంగారుపాలెంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యాధికారి

సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలి

అద్దంకిటౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): సీజనల్‌గా వచ్చే వ్యాధులపై ప్రజలు అవగాహన కలిగి ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని మోదేపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎన్. శ్రీహర్ష అన్నారు. శుక్రవారం ఆయన మోదేపల్లి సచివాలయం లో సీజనల్‌గా వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ అధిక వర్షాల వలన డయేరియా ప్రబలే అవకాశం ఉందని, ప్రజలందరూ కాచి చల్లార్చిన నీరు తాగాలని, వేడి వేడి ఆహార పదార్థాలను తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ కె. అనిల్, ఎంపీహెచ్‌ఈవో నాగేశ్వరరావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ స్రవంతి, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



మోదేపల్లిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శ్రీ హర్ష

దోమల ద్వారా వచ్చే వ్యాధులపై..

దోమల ద్వారా వచ్చే వ్యాధులపై అవగాహన కలిగి ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని కాకానిపాలెం అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ హేమ మాధురి అన్నారు. శుక్రవారం కాకానిపాలెం యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో సచివాలయం పరిధిలోని పలు కాలనీలలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా మురుగు కాలువలను పరిశీలించడంతో పాటు, నీటి నిల్వ ఉన్న పాత్రలు, తొట్టిలను పరిశీలించి వాటిలో నీటిని నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు.

కళ్ల సమస్యలపై జాగ్రత్తలు తీసుకోవాలి

అద్దంకిటౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కంటి సమస్యలపై తగిన జాగ్రత్తలు తీసుకుని సమయానికి వైద్యం చేయించుకోవాలని రిటైర్డ్ ఆర్‌జేడీ డాక్టర్ యు. దేవపాలన అన్నారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ భవనంలో రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ, ఉమ్మడి ప్రకాశం జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర నేత్రాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత నేత్రవైద్య శిబిరాన్ని నిర్వహించారు. కంటి సమస్యలతో వచ్చిన 40 మందికి పరీక్షలు నిర్వహించారు. వారిలో 20 మందికి ఆపరేషన్ అవసరం అని గుర్తించి వారిని పెదకాకాని శంకర నేత్రాలయానికి తరలించారు. గత నెలలో శుక్లము ఆపరేషన్ చేయించుకున్న వారికి కొత్త కళ్లజోళ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, సహాయ కార్యదర్శి ఆళహరి హరిప్రసాద్, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, సహాయ గవర్నర్ షేక్ మహమ్మద్ రఫీ, సందిరెడ్డి శ్రీనివాసరావు, జ్యోతి చంద్రమౌళి, కాకర్ల వెంకటేశ్వర్లు, చామర్తి గురుశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



కంటి శస్త్ర చికిత్స చేయించుకున్న వారికి కళ్లజోళ్లను అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మేదరమెట్ల అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మేదరమెట్లలో శనివారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు ప్రధాన రహదారి కూడలి ప్రాంతంలో మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. ఇక రావినూతల రోడ్డులో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ అసౌకర్యానికి వినియోగదారులు గమనించాలన్నారు.

జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

పంగులూరు, అక్టోబరు, 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బూదవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని వజ్రాల రూపలక్ష్మి జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయింది. ఈ నెల 21 నుంచి 23 వరకు శ్రీ సత్యసాయి జిల్లా హిందూపూర్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ 68వ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలలో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన రూపలక్ష్మి క్రీడలో ప్రతిభ చాటి రాష్ట్ర జట్టుకు ఎంపికయినట్లు పాఠశాల పీడీ వెంకటరావు తెలిపారు. నవంబరు మొదటి వారంలో ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలో జరుగనున్న జాతీయస్థాయి పోటీలలో రూపలక్ష్మి పాల్గొననుంది. ఈ సందర్భంగా రూపలక్ష్మిని హెచ్‌ఎం నాగరాణి, పీడీ వెంకటరావు, ఉపాధ్యాయు లు శ్రీనివాసరావు, సోమశేఖర్, లక్ష్మీనారాయణలు శుక్రవారం జరిగిన కార్యక్రమంలో అభినందించారు.

పెట్రోల్ బంకులో నగదు మళ్లింపుపై ఫిర్యాదు

అద్దంకి, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): పెట్రోల్ బంక్‌లో సూపర్‌వైజర్‌లుగా ఉన్న భార్యాభర్తలు నగదును వారి బ్యాంక్‌ఖాతాలకు జమ చేసుకోవడం, ప్రశ్నించేందుకు వెళ్లిన యజమానులపై దాడికి యత్నించిన ఘటనపై శుక్రవారం కేసు నమోదు అయ్యింది. అద్దంకి పట్టణంలోని గరటయ్య కాలనీ సమీపంలో గుంటూరు టౌన్‌కు చెందిన జె.అనిల్‌కుమార్, గార్లపాటి రంజిత్‌కుమార్‌లు కలిసి 3 సంవత్సరాల క్రితం పెట్రోల్ బంక్ ఏర్పాటు చేశారు. అనిల్‌కుమార్, రంజిత్ కుమార్‌లు సౌత్ ఆఫ్రికాలో ఉంటూ పెట్రోల్ బంక్ నిర్వహణ కోసం చీమకుర్తికి చెందిన వెంకటేశ్వర్లు, మల్లేశ్వరి లను సూపర్‌వైజర్‌లుగా నియమించారు. సంవత్సరానికి ఒక సారి వచ్చి వ్యాపార లావాదేవీలను తనిఖీ చేసుకుంటున్నారు. రెండు సంవత్సరాల పాటు ఎలాంటి తేడా లేకుండానే సాగింది. అయితే ఇటీవల వచ్చి పరిశీలించగా నాలుగు నెలలుగా వచ్చే నగదు మొత్తాన్ని వెంకటేశ్వర్లు, మల్లేశ్వరిలు వారి బ్యాంక్ ఖాతాలకు జమ అయ్యేలా చేశారు. ఇలా 30 లక్షల రూపాయలు మళ్లించారు. అదే సమయంలో సొంత ఖర్చుల కోసం అని 4 లక్షల రూపాయలు తీసుకున్నారు. కొద్దిరోజులుగా విధులకు రాకపోవటంతో చీమకుర్తి వెళ్లి ప్రశ్నించగా పొంతన లేని సమాధానాలు చెప్పటం తో పాటు దాడి చేసేందుకు ప్రయత్నించారు. దీంతో శుక్రవారం అద్దంకి పోలీస్ స్టేషన్‌లో జె.అనిల్‌కుమార్ ఫిర్యాదు చేయగా పోలీస్‌లు కేసు నమోదు చేశారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి

చీరాలటౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : చీరాల విజ్ఞాన భారతిలో సోషల్ టీచర్‌గా పని చేస్తున్న కారంచేటి ఉమా శంకర్(54) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. విధులు ముగించుకుని గొల్లపాలెంలోని ఇంటికి వెళుతుండగా మార్గం మధ్యలో అసౌకర్యంగా ఉండటంతో ఉపాధ్యాయుడు ద్విచక్ర వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపారు. కొద్దిసేపటికి అక్కడే కుప్పకూలారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు బోరున విలపించారు. ఉమా శంకర్ మృతిపై పలువురు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుని భార్య కూడా హిందీ ఉపాధ్యాయినిగా పని చేస్తున్నట్లు సమాచారం.

రాష్ట్ర స్థాయి పోటీలకు అడవీధిపాలెం విద్యార్థిని

చినగంజాం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మోటుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని అడవీధిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని రమణి వెంకట దీపిక రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్.ఎం ఎ.మాధవీలత తెలిపారు. ఒంగోలు పీవీఆర్ బాలుర మున్సిపల్ హైస్కూల్‌లో స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో గురువారం జరిగిన అండర్-17 బాలికల కబడ్డీ విభాగంలో సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు దీపిక ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయిని బి.లలిత శుక్రవారం తెలిపారు. ఈ నెల 27వ తేదీ నుంచి 29వ తేదీ వరకు అన్నమయ్య జిల్లా రాయచోటిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో వెంకటదీపిక పాల్గొననున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన దీపికకు పాఠశాల హెచ్‌ఎం, వ్యాయాయ ఉపాధ్యాయరాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.



వెంకటదీపికను అభినందిస్తున్న హెచ్.ఎం, పీడీ

రెవెన్యూ గ్రామసభలో 50 అర్జీలు

అద్దంకి, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరంలో రీ సర్వేలో వచ్చిన భూసమస్యల పరిష్కారం కోసం శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. మొత్తం 50 అర్జీలు రాగా వాటిలో 35 మ్యూటేషన్ కోసం, ఒక అర్జీ విస్తీర్ణంలో వ్యత్యాసం, ఇతర సమస్యలకు సంబంధించి మరో 14 అర్జీలు అందినట్లు తహసీల్దార్ శ్రీచరణ్ తెలిపారు. గ్రామసభలో తహసీల్దార్ శ్రీచరణ్, డిప్యూటీ తహసీల్దార్ సురేష్, ఆర్ఐ శంకర్, మండల సర్వేయర్ శ్రీలక్ష్మి, చాగంటి రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చినగంజాంలో 35 అర్జీలు

చినగంజాం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) : మండలంలోని చింతగుంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన రెవెన్యూ గ్రామసభలో పలు సమస్యలకు సంబంధించి రైతులు 36 అర్జీలను అందజేశారు. భూ రీ సర్వే జరిగిన గ్రామాల్లో జరిగిన తప్పులను పరిష్కరించేందుకు రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు రీ సర్వే డీటీ సుజాత తెలిపారు. భూ విస్తీర్ణంలో తేడాలకు సంబంధించి 25, ఉమ్మడి భూ విభజనకు సంబంధించి 6, పట్టాదారు పాసు పుస్తకాల కోసం 5 అర్జీలను రైతుల నుంచి స్వీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఆర్.ఐ. నాగేశ్వరరావు, గ్రామ రెవెన్యూ అధికారులు నాగరాజు, సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.



గంగపాలెం వేమవరం జంక్షన్ మధ్య నేల చప్టాపై నిలిచిన నీరు

నేల చప్టాలో నిలిచిన నీరు

● గంగపాలెం - వేమవరం గ్రామాల మధ్య రాకపోకలు బంద్

● వాహన చోదకుల అవస్థలు

బల్లికురవ. అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గంగపాలెం గ్రామం నుంచి వేమవరం నాలుగు రోడ్ల కూడలి మధ్యలో ఉన్న నేల చప్టా అధ్వాన స్థితికి చేరటంతో రాక పోకలు నిలిచిపోయాయి. వర్షపు నీరు పెద్ద ఎత్తున నిలిచి ఉండటంతో పాటు గోతులు పడటంతో ఈ మార్గంలో నాలుగు చక్రాల కార్లు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కొణిదెన గ్రామం నుంచి ఉప్పుమాగులూరు వరకు రోడ్డు దెబ్బ తిని ఉంది. ఈ రోడ్డులో ఉన్న గంగపాలెం సమీపంలో ఉన్న నేల చప్టా తూములు పూడి పోవటంతో నీరు చప్టా మీదుగా పారుతోంది. దీంతో నీటిలో నుంచి ప్రయాణం చేయాలంటే ప్రమాదకరంగా మారిందని ప్రయాణికులు వాపోతున్నారు. అధికారులు వెంటనే నేల చప్టా వద్ద నీరు లేకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



ఎంపికైన వారికి నియామకపత్రాలు అందజేస్తున్న డైరెక్టర్ శ్రీధరరావు

73 మంది ఉద్యోగాలకు ఎంపిక

ఇంకొల్లు,అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డీసీఆర్‌ఎం డిగ్రీ కళాశాల లో పలు కంపెనీలు శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించాయి.ఈ జాబ్‌మేళాకు 107 మంది నిరుద్యోగ యువతీ యువకులు హాజరు కాగా 43 మంది వివిధ రంగాలలో ఉద్యోగాలకు ఎంపికైనట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రణయ్ తెలిపారు. ఐసీఐసీఐ బ్యాంక్,కర్ణాటక బ్యాంకు,సెలెక్ట్ గాడ్జెటాస్ లిమిటెడ్,అపెక్స్ సొల్యూషన్స్ కంపెనీ ప్రతినిధులు హాజరై అర్హులైన వారిని ఎంపిక చేసుకున్నారు. ఈ సందర్భంగా డీసీఆర్‌ఎం కళాశాల డైరెక్టర్ చిలుకూరి శ్రీధరరావు మాట్లాడుతూ నైపుణ్యాభివృద్ధి సంస్థ నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు, జాబ్‌మేళాలను యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఉద్యోగాలకు ఎంపికైన వారికి శ్రీధరరావు నియామకపత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్లేస్‌మెంట్ ఆఫీసర్ బి.శ్రీనివాస్,పర్చూరు నియోజకవర్గ ఏరియా స్కిల్ హబ్ కోఆర్డినేటర్ వినోద్‌కుమార్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

బాలల హక్కుల సంరక్షణ అందరి బాధ్యత

బల్లికురవ. అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో జరిగే బాల్య వివాహాలను నిరోధించటంతో పాటు వారి హక్కుల సంరక్షణ బాధ్యత అందరిపై ఉందని ఎంపీపీ శ్రీలక్ష్మి తెలిపారు. శుక్రవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ సంతమాగులూరు ప్రాజెక్టు ఆధ్వర్యంలో బాలల హక్కుల పరిరక్షణ, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు జరిగింది. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఎక్కడైనా బాల్య వివాహాలు చేస్తుంటే వెంటనే సమాచారం అందించాలన్నారు. సీడీపీవో సుధ, పీహెచ్‌సీ వైద్యాధికారి మమత , ఎంఈవో రమేష్, అన్ని గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులు పాల్గొన్నారు

ఆక్రమణలపై చట్టపరంగా చర్యలు

పంగులూరు, అక్టోబరు, 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ, పట్టా భూముల ఆక్రమణలపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని మండల తహసీల్దార్ పోహూరి శింగారావు అన్నారు. మండలంలోని బైటమంజులూరు గ్రామంలో వివాదాస్పద భూమిని, డొంకను ఆక్రమించి షెడ్డు నిర్మించిన ప్రదేశాన్ని శుక్రవారం ఆయన సిబ్బందితో కలసి పరిశీలించారు. గ్రామ రైతుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు ఆ ప్రాంతాన్ని పరిశీలించి గ్రామస్థులతో మాట్లాడారు. ఆక్రమణలపై చట్టపరమైన చర్యలు చేపడతామని గ్రామ రైతులకు హామీ ఇచ్చారు. మండల సర్వేయర్ సురేష్, వీఆర్వో బాపయ్య ఉన్నారు.

రేపటి వరకు పంట నష్టం అంచనాల తయారీ


ముప్పవరం గ్రామంలో మినుము పంటను స్థానికులతో కలసి పరిశీలిస్తున్న ఏవో సుబ్బారెడ్డి

పంగులూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలో అధిక వర్షాలకు దెబ్బతిన్న మినుము పంట నష్టం అంచనాలు ఈ నెల 27 వరకు తయారు చేయడం జరుగుతుందని వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి తెలిపారు. మండలంలోని ముప్పవరం గ్రా మంలో అధిక వర్షాలకు దెబ్బతిన్న మినుము పంట గణన కార్యక్రమాన్ని శుక్రవారం ఏవో సుబ్బారెడ్డి స్థానిక రైతులతో కలిసి పరిశీలించారు. నష్టం అంచనా జాబితాను 28వ తేదీ నుంచి నవంబరు 2వ తేదీ వరకు సామాజిక తనిఖీ నిమిత్తం అందుబాటులో ఉంచుతామని ఏవో తెలిపారు.

అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి

ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే ఏలూరి

మార్టూరు, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ,పారిశ్రామిక రంగాలలో పర్చూరు నియోజకవర్గం అభివృద్ధి చెందుతోందని, అధికారులు చిత్తశుద్ధి, అంకితభావంతో పనిచేయాలని పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు అన్నారు.శుక్రవారం మండలంలోని ఇసుకదర్శి ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ స్థాయిలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఎన్‌టీఆర్ విగ్రహానికి ఏలూరి సాంబ శివరావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నియోజకవర్గంలోని ప్రజలు తమ సమస్యలను సంబంధిత అధికారులకు అందజేసేందుకు ప్రత్యేకంగా కౌంటర్లను ఏర్పా టు చేశారు. కొంత మంది బాధితులను ఏలూరి స్వయంగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంతేగాకుండా స్వయం గా వారు ఇచ్చిన అర్జీలను పరిశీలించారు. వాటిపై సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ సందర్భంగా ఏలూరి మాట్లాడుతూ నియోజకవర్గంలోని అధికారులు, నాయకులు ప్రజల సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని, పర్చూరు అభివృద్ధికి అందరూ సమన్వయంతో కలిసి పనిచేయాలని అన్నారు. ఈ ప్రజాదర్బార్‌కు నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన రెవెన్యూ, వ్యవసాయ, పంచాయతీ రాజ్ తదితర అన్నిశాఖలకు చెందిన తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇతర అధికారులతో పాటు ఆర్‌డీవో గ్లోరియా, అన్ని మండలాలకు చెందిన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

నియోజకవర్గ స్థాయిలో వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న 28 మందికి ప్రజాదర్బార్‌లో సీఎం సహాయనిధి నుంచి మంజూరయిన రూ. 21,51,309ల చెక్కులను పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబ శివరావు అందచేశారు

బాధితుడికి చేయూత

రైలు ప్రమాదంలో రెండు కాళ్ల కోల్పోయిన కొమెర మురళి అనే యువకుడిని ఎమ్మెల్యే ఏలూరి పరామర్శించారు.బాధితుడికి మూడు చక్రాల సైకిల్, జైపూర్ కృత్రిమ పాదాలను అందజేస్తామని హామీ ఇచ్చారు. మార్టూరులోని విజయనగర్ కాలనీకి చెందిన మురళి బేల్దారి పనులు నిమిత్తం తిరుపతి వెళ్లి వస్తుండగా ప్రమాదవశాత్తూ రైలు కింద పడటంతో రెండు కాళ్ల కోల్పోయాడు.


సీఎం సహాయనిధి చెక్కులను బాధితులకు అందజేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న సాంబశివరావు

కల్వర్టు నిర్మించారు.. రోడ్డు మరిచారు

పెద్దపెద్ద గుంతలతో అవస్థలు

తరచూ ప్రమాదాలు

ఇటీవల ద్విచక్రవాహనం

అదుపుతప్పి ఇద్దరు మృత్యువాత

పట్టించుకోని అధికారులు


కల్వర్టు వద్ద పెద్దపెద్ద గుంతలతో రోడ్డు

పర్చూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి), : పర్చూరు నుంచి గుంటూరు వెళ్లే అర్‌అండ్‌బీ రహదారిలోని అడుసుమల్లి ఉన్నత పాఠశాల సమీపంలో కల్వర్ట్‌ను ఏర్పాటు చేసిన కాంట్రాక్టర్ రోడ్డును అభివృద్ధి చేయకపోవటంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. లక్షలు ఖర్చుచేసి కల్వర్టును ఏర్పాటు చేసినా అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేయకపోవటంతో సమస్య జటిలంగా మారింది. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగించే ప్రధాన రహదారిలో పరిస్థితి దయనీయంగా మారింది. తరచూ అనేక మంది వాహనదారులు ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నా పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. కనీసం గుంతలుగా మారిన కల్వర్టు ప్రాంగణంలో గంపెడు మట్టిని కూడా ఏర్పాటు చేయకపోవటంపై వాహనదారులు ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం కావటంతో కల్వర్టు పైభాగంలో ఉన్న రోడ్డు పెద్ద పెద్ద గుంతలుగా మారింది. వర్షపు నీటిలో ఉన్న అగాధాల లాంటి గుంతలను గుర్తించుకోలేని వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు గడిచిన వారం రోజుల వ్యవధిలో ఇదే కల్వర్టుపై ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఇరువురు వ్యక్తులు మృతి చెందిన ఘటన కూడా చోటుచేసుకుంది. ఇంతటి ప్రమాదకంగా రోడ్డు పరిస్థితి ఉన్నా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో వాహనదారులు పెదవి విరుస్తున్నారు. కల్వర్టుపై రోడ్డు నిర్మాణం చేపట్టి వాహనదారుల అవస్థలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

గుండ్లకమ్మ నదిలో ఆక్రమణలపై సర్వే


గుండ్లకమ్మ నదిలో సర్వే చేస్తున్న సర్వేయర్, సిబ్బంది

అద్దంకి, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి): గుండ్లకమ్మ నది అద్దంకి ప్రాంతంలో ఆక్రమణలకు గురయ్యింది. ఆక్రమణలతో పాటు కలషితం అవుతుండటం, చిల్లచెట్ల తో నిండిపోయింది. ఈ నేపథ్యం ప్రజా సంఘాల ఆద్వర్యంలో గత మార్చి నెలలో కోర్టును ఆశ్రయించారు. దీంతో శుక్రవారం నుండి గుండ్లకమ్మ నదిలో మండల సర్వేయర్ శ్రీలక్ష్మి ఆద్వర్యంలో సర్వే ప్రారంభించారు. డీపాపులేటెడ్ విలేజ్‌గా ఉన్న నరశింహపురం రెవెన్యూ సరిహద్దు నుంచి సర్వే ప్రారంభించారు. గుండ్లకమ్మ నదికి రెండు వైపులా హద్దురాళ్ల ఏర్పాటు చేస్తామని సర్వేయర్ శ్రీలక్ష్మి తెలిపారు. ప్రజా సంఘాల నేతలు మన్నం త్రిమూర్తులు, తాళ్లూరు బాబురావు, డాక్టర్ కాపూరి రఘుచంద్, చెన్నుపల్లి నాగేశ్వరరావు, తంగిరాల వెంకటేశ్వర్లు, సచివాలయాల సర్వేయర్‌లు సంధ్య పవన్‌కల్యాణ్, అంకమ్మనాయుడు, యోగి, నాగేశ్వరరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాలలో అప్‌డేట్ ప్రక్రియ


ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో కుసుమకుమారి

బల్లికురవ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం గ్రామాలలో ప్రజలందరికీ ఉపయోగపడేలా ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసి అప్‌డేట్ ప్రక్రియ చేపడుతున్నదని ఎంపీడీవో కె. కుసుమకుమారి పేర్కొన్నారు. మండలంలోని ఎస్‌ఎల్ గుడిపాడు, మల్లాయపాలెం, కొమ్మినేనివారిపాలెం గ్రామాలలో జరుగుతున్న ఆధార్ ప్రత్యేక క్యాంప్‌లను శుక్రవారం ఎంపీడీవో పరిశీలించారు. ఇప్పటి వరకు మండలంలోని పలు గ్రామాలకు చెందిన 212 మంది ఆధార్ కార్డులను అప్‌డేట్ చేయించుకున్నారని వివరించారు.

నిర్లక్ష్యంపై అధికారుల చర్యలు

● ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

చీరాలటౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : బడి పిల్లల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఏపీ మోడల్, కేజీబీవీ, పేరాల ఏఆర్‌ఎం ఉన్నత పాఠశాలలపై అధికారులు చర్యలు చేపట్టారు. గత బుధవారం బాలలపరిరక్షణ కమిషన్ రాష్ట్ర సభ్యురాలు పద్మావతి చీరాల పరిధిలోని పలు పాఠశాలలు తనిఖీ చేశారు. అలాగే గురువారం ఆంధ్రజ్యోతిలో విద్యార్థుల జీవితాలతో ఆటలా కథనం ప్రచురితమైంది. దీంతో జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు ఎంఈవో పరిశీలన చేసి వాస్తవాలు గుర్తించారు. ఆ నివేదికను జిల్లా అధికారులకు అందించడంతో అధికారులు ఆయ పాఠశాలలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అందుకు సంబంధించిన ఉత్తర్వులు అధికారికంగా వెల్లడించారు. విద్యార్థుల పట్ల జాగ్రత్తలు లేకుంటే కఠినంగా వ్యవహరిస్తామని వెల్లడించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అద్దంకి, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలోని రాజీవ్ కాలనీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని టౌన్ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. దక్షిణ అద్దంకితో పాటు నాగులపాడు, వేలమూరిపాడు, జార్లపాలెంలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

పాఠశాలలో డిప్యూటీ డీఈవో తనిఖీలు

బల్లికురవ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొణిదెన ఉన్నత పాఠశాలను శుక్రవారం చీరాల డిప్యూటీ డీఈవో అబ్బురాజు శ్రీనివాసరావు తనిఖీ చేశారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు ప్ర త్యేక క్లాసులు నిర్వహించాలని, మధ్యాహ్న భోజనం రుచిగా తయారు చేయించాలని సూచించారు.

సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి

పంగులూరు :సీజనల్ వ్యాదుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెల్త్ సూపర్‌వైజర్ హరిబాబు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం డ్రై డే కార్యక్రమంలో భాగంగా మండలంలో గ్రామ గ్రామాన వ్యాధులపై వైద్య సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు సతీష్, జానకి, లలిత, అనంతలక్ష్మి, మణిమ్మ, సీహెచ్‌వోలు, ఆశాలు పాల్గొన్నారు

వ్యాసరచన పోటీలు

అద్దంకి, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల వారోత్సవాలలో భాగంగా స్థానికంగా బెల్ అండ్ బెనెట్ స్కూల్‌లో విద్యార్థులకు ప్రివెన్షన్ ఆఫ్ సైబర్ క్రైమ్ అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీలను ఎస్సై ఖాదర్‌బాషా, కరస్పాండెంట్ విజయకుమార్ పర్యవేక్షించారు.

క్రైం కార్నర్

లారీని ఢీకొన్న స్కూటీ

● ఇద్దరికి తీవ్ర, ఒకరికి స్వల్ప గాయాలు

చీరాలటౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : స్కూటీతో నిర్లక్ష్యపు డ్రైవింగ్ చేస్తూ ముగ్గురు యువకులు ఆగివున్న లారీని ఢీకొట్టారు. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. అందిన వివరాల ప్రకారం చీరాల - వాడరేవు రోడ్డులోని వాకావారిపాలెం వద్ద లారీని ఓవ్యక్తి రోడ్డు పక్కన నిలిపి బహిర్భూమికి వెళ్లాడు. అయితే రాత్రి సమయం పైగా నిర్లక్ష్యపు డ్రైవింగ్ చేస్తూ స్కూటీతో వేగంగా వెనుక నుంచి లారీని ఢీకొన్నారు. ప్రమాదంలో కఠారిపాలెంకు చెందిన రాము, అడవిపల్లెపాలెంకు చెందిన వ్యక్తి తీవ్రంగా గాయపడగా మరోవ్యక్తి స్వల్పంగా గాయపడ్డాడు. దీంతో స్థానికులు 108 సహాయంతో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం ఒంగోలుకు తరలించారు. ఈపూరుపాలెం ఎస్సై వివరాలు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

చీరాలటౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : స్థానికుల తీరుతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి శరీరంపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈఘటన చీరాల పరిధిలోని రామనగర్‌లో చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం ఉదయ్ అనే వ్యక్తికి చెందిన రెండు గ్యాస్ సిలెండర్‌లు ఇటీవల అపహరణ జరిగాయి. అయితే దీనిపై తనను అనుమానిస్తున్నట్లు భావించిన గాలి కోటి అనే వ్యక్తి శుక్రవారం సాయంత్రం శరీరంపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. దీంతో స్థానికులు చీరాల ఏరియా వైద్యశాలకు తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం ఒంగోలుకు తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మార్టూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో గాయపడి గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పాలపర్తి బాలకృష్ణ(46) అనే వ్యక్తి శుక్రవారం వేకువజామున మృతిచెందినట్లు ఏఎస్‌ఐ బాషా తెలిపారు. యద్దనపూడి మండలం చింతపల్లిపాడు గ్రామానికి చెందిన బాలకృష్ణ మండలంలోని బొల్లాపల్లి టోల్ ప్లాజా ఫుడ్‌కోర్టు వద్ద సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఈ నెల 24 వతేదీ రాత్రి టీవీఎస్ మోపెడ్‌పై హోటల్ నుంచి ఇంటికి వస్తుండగా కోలలపూడి క్రాస్ రోడ్డు వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతనిని తొలుత ప్రభుత్వ ఆస్పత్రికి, తర్వాత గుంటూరులోని ప్రయివేటు ఆస్పత్రికి,అనంతరం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుని కుమారుడు రాజేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.మృతదేహానికి శుక్రవారం పోస్టుమార్టమ్ నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించామని ఏఎస్‌ఐ బాషా తెలిపారు.

ఎలుకల మందు తిన్న మహిళ మృతి

అద్దంకి, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఎలుకల మందు తిన్న మహిళ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. స్థానికుల కథనం మేరకు అద్దంకిపట్టణంలోని 13 వ వార్డులో గుంజివారిపాలెంకు చెందిన ఆలకుంట హనుమాయమ్మ(47) అనారోగ్యంతో బాధపడుతూ గురువారం ఎలుకల మందు తినింది. చికిత్స నిమిత్తం ఒంగోలులోని ప్రయివేట్ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

'సోమశిల'లో 62.650 టీఎంసీల నీరు



అనంతసాగరం (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి శుక్రవారం 20,300 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగింది. డ్యాంలో 62.650 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 50, కండలేరుకు 10 వేలు, ఉత్తర కాలువ 350 క్యూసెక్కుల చొప్పున నీరు సరఫరా చేస్తున్నారు.



సబ్సిడీ శనగ విత్తనాల పేరుతో ఏపీ సీడ్స్ అధికారులు చేతివాటం చూపించారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రబీ సీజన్‌లో వ్యవసాయ శాఖ ద్వారా సబ్సిడీతో రైతులకు శనగ విత్తనాలు పంపిణీకి ఏపీ సీడ్స్ సర్వం సిద్ధం చేసింది. 25 శాతం సబ్సిడీ ఇచ్చాక కూడా వారు నిర్ణయించిన ధర బహిరంగ మార్కెట్ ధరకన్నా ఎక్కువే ఉందంటూ రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఏపీ సీడ్స్ సంస్థ నిర్ణయించిన శనగల ధర గత పదినెలల కాలంలో ఎన్నడూ లేదని, కనీసం ఆ దరిదాపులకు కూడా శనగల ధర చేరలేదని వాపోతున్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరిపి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.


ఇదేం ధర!

- సబ్సిడీ శనగ విత్తనాలపై రైతుల పెదవి విరుపు
- మార్కెట్ ధరతో పోల్చితే చాలా వ్యత్యాసం
- ఏపీ సీడ్స్ నిర్వాకంపై విమర్శల వెల్లువ
- వ్యవసాయ శాఖ అధికారులూ అసహనం

కందుకూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు జిల్లాతోపాటు పొరుగునే ఉన్న ప్రకాశం జిల్లాలోనూ లక్షల ఎకరాలలో పప్పుశనగ సాగవుతుంది. రైతులకు సబ్సిడీపై శనగ విత్తనం పంపిణీ దశాబ్దాలుగా జరుగుతోంది. అయితే, కొన్నేళ్లుగా విత్తన కొనుగోలులో అధికారుల చేతివాటం ప్రదర్శిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వ్యవసాయ శాఖ ద్వారా 25 శాతం సబ్సిడీపై సరఫరా చేసేందుకు సిద్ధం చేసిన కాగ్ 2 రకం శనగ విత్తనం బహిరంగ మార్కెట్లో 9వేల రూపాయలు పలుకుతోంది. అయితే ఈ రకం అసలు ధర రూ.12,100గా నిర్ణయించిన ఏపీ సీడ్స్‌సంస్థ 25 శాతం సబ్సిడీ పోను రైతులు రూ.9,075 చెల్లించాలని నిర్ణయించారు. అలాగే జేజే 11 రకం అసలు ధర రూ.9400గా నిర్ణయించిన అధికారులు సబ్సిడీపోను క్వింటాల్‌కు రూ.7050 చెల్లించాలని నిర్ణయించారు. ఈ రెండురకాలు కూడా సబ్సిడీ పోను బహిరంగ మార్కెట్ ధరకన్నా ఎక్కువ ఉండటం విశేషం. ధర అధికంగా ఉన్నప్పుడు ఏపీ సీడ్స్ అధికారులు కొనుగోలు చేసి ఉంటారని అనుకున్నా గత పదినెలలుగా ఎన్నడూ శనగల ధర వారు నిర్ణయించిన ధర బహిరంగ మార్కెట్లో పలకలేదు. ఈ ఏడాది జనవరి తర్వాత గత సీజన్ పంట రైతుల చేతికి రాగా అప్పటినుంచి గిట్టుబాటు ధర రాక రైతులు పంట ఉత్పత్తులను కోల్డ్ స్టోరేజీలలో నిల్వ చేసుకుని ఉన్నారు. గత సీజన్‌లో శనగ పంట రైతు చేతికి వచ్చే సమయానికి కాగ్ 2 రకం క్వింటాల్ రూ.8వేలకు, జేజీ 11 రకం క్వింటాల్ ధర రూ.6వేలకు పడిపోయింది. ఈ ఏడాది ఆగస్టు వరకు అదే ధర స్థిరంగా కొనసాగగా వినాయకచవితి పర్వదినం సమయంలో పదిరోజులపాటు శనగల ధరల్లో కదలిక వచ్చింది. అప్పట్లో కేవలం పదిహేను రోజుల పాటు కాగ్ 2 రకం ధర అత్యధికంగా రూ.10,500, జేజే 11 రకం 7వేలు ధర పలికింది. అయితే ఎప్పుడూ బహిరంగ మార్కెట్లో లేని ధరకు, కనీసం దరిదాపుల్లో లేని ధరకు కొనుగోలు చేసినట్లు ధర నిర్ణయించటం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే ధరకైతే సబ్సిడీ విత్తనాలు రైతులెవరూ తీసుకోరన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ విత్తన కొనుగోలు వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరపాలని, ఈ విత్తనం ఏ నెలలో ఎక్కడ కొనుగోలు చేశారో నిగ్గుతేల్చటం ద్వారా బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకుని రైతుకు సబ్సిడీ ఫలం అందేలా ప్రభుత్వం, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అయితే, ఈ వ్యవహారంపై వ్యవసాయ శాఖ అధికారులు మాట్లాడుతూ సబ్సిడీ శనగ విత్తనాల ధర బహిరంగ మార్కెట్ ధరకన్నా అధికంగా ఉన్నందున రైతులు ముందుకు రావడం లేదని చెప్పడం గమనార్హం. ఈ కొనుగోలు వ్యవహారం ఏపీ సీడ్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిందని, ఇంత ధర పెట్టి ఎందుకు కొనుగోలు చేశారో తమకూ అర్థం కాలేదని వ్యాఖ్యానించారు.



ఏపీ సీడ్స్ సబ్సిడీ ధరకు పంపిణీ చేసే శనగ విత్తన బస్తాలు (ఫైల్)





రచ్చకెక్కిన ఎస్సీ కార్పొరేషన్

- అనర్హుల చేతికి స్వయం ఉపాధి రుణాలు
- రికవరీకి ఆదేశాలు.. విచారణ
- ఇద్దరు అధికారులు, ఉద్యోగులపై వేటు

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : నిధులలేమితో అల్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ రచ్చకెక్కింది. పలు పథకాల కింద లబ్ధిదారులకు రుణాలు అందచేసిన అధికారులు రుణాల వసూళ్లకు పూనుకోవటంతో వార్తల్లోకి ఎక్కింది. 2015-2019 మధ్య కాలంలో ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ, ఎన్ఎస్ఎఫ్‌డీసీ పథకాల ద్వారా ఎస్సీ నిరుద్యోగ యువత స్వయం ఉపాధి కోసం బ్యాంకులతో సంబంధం లేకుండా రూ.2,300కోట్ల రుణాలను నేరుగా అందచేసింది. ఈ రుణాలను కొందరు అనర్హులు తీసుకోగా, రుణాల ద్వారా జేసీబీ లు, ఇన్నోవా కార్లు తదితరాలను కొనుగోలు చేసినట్లు తెలిసింది. అలాంటి వారి నుంచి రికవరీ కోరుతూ ఎస్సీ కార్పొరేషన్ అధికారులు నోటీసులు జారీ చేయటంతో సమస్య మొదలైంది. నోటీసులు అందచేసిన వారిపై కొందరు తిరగబడినట్లు తెలిసింది. ఈ రుణాలకు పూచీకత్తు ఇచ్చిన సుమారు 980 మంది ఉద్యోగులు, 470 మంది లబ్ధిదారులకు ఎస్సీ కార్పొరేషన్ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఎన్ఎస్ఎఫ్‌డీసీకి ప్రతినెలా లబ్ధిదారుల నుంచి సుమారు రూ.24 లక్షలు వసూలు చేయాల్సి ఉన్నా మందకొడిగా సాగుతోంది.

ఇద్దరు అధికారుల సస్పెన్షన్

ఎస్సీ కార్పొరేషన్‌లో అక్రమాలు జరిగాయంటూ ఓ న్యాయవాది లోకాయుక్తలో పిటిషన్ వేశారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపించాలని లోకాయుక్త ఎస్సీ

- మిగతా 8లో..

ప్రతిభకు 'ఆట'ంకం



- క్రీడాకారుల కోసం రూ.40 లక్షలు విడుదల
- అధికారుల మధ్య సమన్వయ లోపం
- ఉమ్మడి ఖాతాలు లేక జమకాని నిధులు

నెల్లూరు (విద్య), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల విద్యార్థులు క్రీడల్లో ఉత్తమంగా రాణించాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఎస్‌జీఎఫ్ (పాఠశాలల క్రీడా సమాఖ్య) నిధులు విడుదల చేసినా యంత్రాంగంలో సమన్వయం కొరవడింది. దీంతో ఆ నిధులు ప్రభుత్వ ఖాతాల్లోనే ఉండిపోయాయి. అధికారులు, కార్యదర్శులకు ఉమ్మడి ఖాతాలు ఉండాలన్న నిబంధనలు ఉన్నా ఇప్పటివరకు ఖాతాలు తెరవకుండానే ఎస్‌జీఎఫ్ పోటీలను నిర్వహిస్తుండటం విశేషం. కూటమి ప్రభుత్వం మాత్రం దీనిపై ప్రత్యేక దృష్టి సారించి ఖచ్చితంగా ఉమ్మడి ఖాతాలు ఉండాల్సిందేనని, ప్రతి రూపాయికి లెక్క చెప్పాల్సిందేనని స్పష్టం చేసింది. దీంతో సంబంధిత కార్యదర్శులు, అధికారులు ఇప్పటికిప్పుడు హడావుడి పడుతూ ఖాతాలు తెరిచే ప్రయత్నాలు ప్రారంభించారు.

2014 నుంచి 19 వరకు సాఫీగా...

2014-19 అప్పటి టీడీపీ హయాంలో ఎస్‌జీఎఫ్ క్రీడలు కొంతవరకు సాఫీగానే జరిగాయి. మండలస్థాయి పోటీలకు రూ.30వేల నుంచి 50వేలు, నియోజకవర్గానికి రూ.20వేల నుంచి 50వేలు, జిల్లాస్థాయికి లక్ష రూపాయల నుంచి రూ.1.20లక్షలు, రాష్ట్రస్థాయి పోటీలకు రూ.3లక్షల వరకు ఖర్చు పెట్టేవారు. తొలుత ఈ నిధులను ఎస్‌జీఎఫ్ నిర్వాహ కులే దాతలు సహకారం, తమ సొంత నగదు వెచ్చించి అనంతరం బిల్లులను పెట్టుకుంటే ఆరునెలల్లోపు ప్రభుత్వం విడుదల చేసేది. అయితే, గత వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఎస్‌జీఎఫ్ పూర్తిగా నిర్వీర్యమై పోయిందని నిర్వాహకులు చెపుతున్నారు. క్రీడాదుస్తులు లేకపోవడం, సర్టిఫికెట్లు కూడా ఇవ్వకపోవడం, సరైన భోజన, వసతులు కల్పించకపోవడం వంటి సంఘటనలు అనేకం ఉన్నాయి.

రూ.40లక్షలు విడుదల

ఈ ఏడాది కూటమి ప్రభుత్వం వేగవంతంగా నిధులు విడుదల చేసినా ఎస్‌జీఎఫ్ కార్యదర్శులకు, విద్యాశాఖ అధికారులకు ఉమ్మడి ఖాతాలు లేకపోవడంతో ఈ నిధులు తాత్కాలికంగా నిలిచిపోనున్నాయి. విద్యార్థుల క్రీడా ప్రగతికి ఉపయోగపడాలన్న లక్ష్యంతో పలు నిబంధనలతో అండర్-14, 17కు రూ.28,95,80, అండర్-19కు రూ.9.47,280లను కలిపి జిల్లాకు రూ.40లక్షల వరకు కేటాయించారు. గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా ఏయే అంశాలకు ఎంత వెచ్చించాలో కూడా తెలియచేస్తూ రాష్ట్ర ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

ఉపయోగం ఇలా..

జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య పేరుతో పాఠశాల, కళాశాలస్థాయిల్లోనే క్రీడాకారులను సిద్ధం చేసి రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు పంపిస్తుంటారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు సర్టిఫికెట్ల గుర్తింపుతోపాటు జాతీయస్థాయిలో రాణించిన వారికి వివిధ కోర్సుల్లో ఉచిత ప్రవేశాలు, ఉద్యోగ నియామకాల్లో 2శాతం రిజర్వేషన్లు కల్పిస్తారు. దీంతో గ్రామీణ ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు స్కూల్ గేమ్స్‌లో పాల్గొనడానికి ఆసక్తి కనపరుస్తారు.

దీపావళికి ఉచిత సిలిండర్లు

- రేపటి నుంచి బుకింగ్
- జిల్లా అధికారులకు అందని సమాచారం

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని మహిళలకు ప్రభుత్వం దీపావళి కానుక ప్రకటించింది. సూపర్ సిక్స్ హామీల్లో ఒకటైన ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని దీపావళి పండుగ రోజున అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. దీపం పథకం కింద మహిళల కు ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా పంపిణీ చేయనుంది. అంటే నాలుగు నెలలకు ఒక సిలిండర్ ఉచితం అన్నమాట. ఉచిత సిలిండర్ల బుకింగ్‌కు ఈనెల 24 నుంచి అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. అయితే, జిల్లా సివిల్ సప్లయిస్ అధికారులకు ఈ ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీకి సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం అందలేదని అంటున్నారు. ఎంత మందికి పథకం వర్తిసుందో, ఏ విధంగా అమలు చేస్తారనే సమాచారం వచ్చిన తరువాత వెంటనే చెబుతామని అధికారులు తెలిపారు.

జిల్లాలో 7.87 లక్షల సిలిండర్‌లు :

జిల్లాలో 7,87,483 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో సాధారణ గ్యాస్ కనెక్షన్లు 4,64,871కాగా దీపం పథకం కనెక్షన్లు 2,67,421, ఉజ్వల్ పథకానికి 18,986, సీఎస్ఆర్ కనెక్షన్లు 33,589, కమర్షియల్ కనెక్షన్లు 2616 ఉన్నాయి. వీటిలో ఉజ్వల్ పథకం కింద ఇచ్చే సిలిండర్లకు కేంద్ర ప్రభుత్వం రూ.300 సబ్సిడీ ఇస్తోంది. ప్రస్తుతం సాధారణ సిలిండర్ ధర రూ.840గా ఉంది. దీని లో కేంద్ర ప్రభుత్వం రూ.18.74 సబ్సిడీ ఇస్తోంది.

నిబంధనలు ఇవే..

- దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాల మహిళలకు ఉచిత సిలిండర్లు అందచేస్తారు.
- తెలుపు రంగు రేషన్ కార్డు కలిగి ఉండాలి. దీనిని ప్రామాణికంగా తీసుకుని ఈ పథకాన్ని వర్తింప చేస్తున్నారు.
- గ్రామాల్లో అయితే ఏడాదికి రూ.2లక్షలు, పట్టణాల్లో అయితే రూ. 3 లక్షల వార్షిక ఆదాయం మించకుండా ఉండే కుటుంబాల మహిళలకు ఈ ఉచిత సిలిండర్లు అందచేస్తారు.
- ఈ పథకం కింద లబ్ధిపొందే మహిళలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో స్థిర నివాసం ఏర్పరచుకుని ఉండాలి.

పాఠశాల విద్య బలోపేతం చేస్తా!

- ఉపాధ్యాయ సంఘాలూ సహకరించాలి
- టెన్త్ ఫలితాల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలుపుతా
- నూతన డీఈవో బాలాజీరావు వెల్లడి

- వివరాలు 8లో..



కలెక్టర్‌ను కలిసిన డీఈవో బాలాజీరావు

తప్పులు తేల్చారు.. మరి దిద్దుబాటు ఏదీ?

- పొదలకూరులో భారీగా భూ అక్రమాలు
- గత ఐదేళ్లలో వందల సంఖ్యలో మ్యుటేషన్లు
- ప్రభుత్వ భూముల స్థానంలో మరొకరి పేర్లు
- నాడు 8 మంది తహసీల్దార్ల విచారణలో బట్టబయలు
- తాజాగా వెలుగులోకి వచ్చిన మరికొన్ని అక్రమాలు
- ఆ తప్పులను ఇంకా సరి చేయని రెవెన్యూ శాఖ

ప్రభుగిరిపట్నం గ్రామంలోని ఓ సర్వే నంబర్‌లో ఉన్న రెండు సబ్ డివిజన్లలో 4.25 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అది రికార్డుల్లో చుక్కల భూమిగా నమోదై ఉంది. ఆ రెండు సర్వే నంబర్లలోని 3 ఎకరాలను ఓ వ్యక్తి పేరుపైకి పూర్వపు తహసీల్దార్ స్వాతి మ్యుటేషన్ చేశారు. ఈ వ్యవహారంపై ఫిర్యాదులు రావడం, అధికారుల విచారణలో బట్టబయలు కావడంతో నాటి తహసీల్దార్ స్వాతిని సస్పెండ్ చేసిన వ్యవహారంలో ఈ సర్వే నెంబరును కూడా కలెక్టర్ ఫైల్‌లో పొందుపరిచారు. ఇది జరిగి రెండేళ్లయినా నేటికీ వెబ్‌ల్యాండ్ రికార్డుల్లో ప్రైవేటు వ్యక్తి పేరు మాత్రం తొలగించలేదు.

మరుపూరు గ్రామంలో ఓ భూస్వామికి పేదల మాటున కొంత భూమిని అసైన్‌మెంట్ పేరుతో పంపిణీ చేశారు. అందుకుగానూ గత తహసీల్దార్ వీరవసంతరావు పట్టా కూడా మంజూరు చేశారు. ఆ ప్రభుత్వ భూమిని సదరు భూస్వామికి అప్పగించారు. అయితే ఇటీవల జరిగిన విచారణలో నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ భూమిని ధారాదత్తం చేశారని నిర్ధారించారు. ఇందుకు బాధ్యులుగా వీరవసంతరావును సస్పెండ్ కూడా చేశారు. కానీ నేటికీ సదరు భూస్వామికి ఇచ్చిన పట్టాను రద్దు చేయలేదు. ప్రభుత్వ భూమిని తిరిగి రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకోలేదు.

నెల్లూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వంలో పొదలకూరు మండలం భూఅక్రమాలకు కేరాఫ్‌గా మారిపోయింది. అధికారమే అండగా వైసీపీ నేతలు చెలరేగిపోయారు. ప్రభుత్వ భూములను ఇష్టానుసారంగా తమ పేర్లపైకి ఎక్కించుకున్నారు. ఇందుకు తహసీల్దార్లు కూడా సహకరించడం తో అక్రమాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. 2020-22 మధ్య రెండేళ్లపాటు పనిచేసిన అప్పటి తహసీల్దార్ స్వాతిపై వచ్చిన ఆరోపణలకు లెక్కలేదు. టీడీపీ నేతలు కలెక్టరేట్‌ను ముట్టడిస్తే గానీ నాటి ఉన్నతాధికారులు స్పందించ లేదు. విచారణకు ఆదేశించగా అనేక అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. వీటిని చూసిన ఉన్నతాధికారులే విస్తుపోయారు. ముందు తహ సీల్దార్‌ను సస్పెండ్ చేశాక పూర్తిస్థాయి విచారణకు ఎనిమిది మంది తహసీల్దార్లను విచారణాధి కారులు నియమించడం గమనార్హం. ఒక్కో తహసీల్దార్ రెండేసి గ్రామాల చొప్పున జరిపిన విచారణలో వందల మ్యుటేషన్లు అక్రమంగా జరిగినట్లు నిర్ధారించారు. ఆ నివేదికలను నాటి ఉన్నతాధికారులకు అందజేశారు. కానీ వైసీపీ ప్రభుత్వం ఉన్నన్ని రోజులూ ఈ నివేదికలు బయటకు రాలేదు. అయితే అక్రమాలు నిర్ధారించాక కూడా వెబ్‌ల్యాండ్‌లో మారిన రికార్డులు ఇంకా అలానే ఉన్నాయి. ప్రభుత్వ భూముల స్థానంలో ప్రైవేటు వ్యక్తుల పేర్లు చేర్చగా ఇప్పటికీ వాటిని తొలగించలేదు. కేవలం రెడ్ మార్క్‌లో పెట్టి వదిలేశారు. తాజాగా అదే మండలంలో మరో తహసీల్దార్ వీరవసంతరావు సస్పెండ్ అయ్యారు. వైసీపీ ప్రభుత్వం చివరి ఏడాది కాలంలో అనేక అక్రమాలు జరిగినట్లు నిర్ధారించిన ఉన్నతాధికారులు అప్పటి తహసీల్దార్‌పై చర్యలు తీసుకున్నారు. అయితే ఇప్పుడు విచారణలో నిబంధనలకు విరుద్ధంగా పట్టాలు ఇచ్చారని తేల్చినా ఆ పట్టాలు రద్దు చేయడం గానీ, ఆ ప్రభుత్వ భూమిని సదరు అనర్హుల నుంచి స్వాధీనం చేసుకోవడం గానీ జరగలేదు. దీంతో అక్రమాలు నిగ్గు తేల్చి ప్రయోజనమేమిటన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

సూత్రధారులపై చర్యలేవి..?

పొదలకూరు మండలంలో అనేక భూ అక్రమాలు వెలుగులోకి వచ్చినా కేవలం తహసీల్దార్లపై చర్యలు తీసుకొని సరిపెడుతున్నారు. సూత్రధారులపై మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. ఒక వ్యక్తి అసైన్‌మెంట్ పట్టా పొంది ప్రభుత్వ భూమిని తీసుకున్నారంటే ఆ వ్యక్తి తాను పేదవాడిగా ప్రభుత్వానికి తెలియజేసి ఉండాలి. అలానే కొందరు ఫేక్ పట్టాలు పొంది ప్రభుత్వ భూమిని కొట్టేశారు. వీరంతా ప్రభుత్వాన్ని మోసం చేసినవారవుతారని న్యాయ నిపుణులు చెబుతున్నారు. అలానే ప్రభుత్వ భూమిని తమ పేర్లపైకి దొడ్డిదారిన ఎక్కించుకున్నవారు కూడా అనేక మంది ఉన్నారు. ఇటువంటి వారిపై చట్ట పరంగా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకునేందుకు అవకాశమున్నట్లు చెబుతున్నారు. కానీ జిల్లా అధికారులు మాత్రం వీరిని వదిలేస్తున్నారు. ప్రభుత్వాన్ని మోసం చేసి రికార్డులు మార్పించుకున్న వ్యక్తులు, ప్రభుత్వ భూములు అక్రమంగా పొందిన వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తే మరో చోట ఇటువంటి అక్రమాలు చేయాలంటే ఇతరులు భయపడతారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పారిశుధ్యం మెరుగు.. ఎస్ఎంసీలదే బాధ్యత

- బడుల్లో మెరుగైన పరిశుభ్రతకు ప్రణాళిక
- ప్రత్యేకంగా యాప్, ప్రతి కమిటీకి గుర్తింపు సంఖ్య
- ప్రతి బుధ, శుక్రవారాల్లో పనుల పరిశీలన

పరిసరాల్లో చెత్తాచెదారం, మరుగుదొడ్లలో దుర్వాసన, అపరిశుభ్రత.. ఇదీ ప్రభుత్వ పాఠశాలల్లో పరిస్థితి. ఈ పరిస్థితుల నుంచి విద్యార్థులకు ఉపశమనం కలిగించేందుకు కూటమి ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. బడుల్లో పారిశుధ్యం మెరుగునకు కార్యాచరణ సిద్ధం చేసింది. పారిశుధ్య మెరుగు బాధ్యత ఇక స్కూల్ యాజమాన్య కమిటీలకు (ఎస్ఎంసీ) అప్పగించింది. ఇందుకోసంగా ఓ ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. అదేవిధంగా ప్రతి పాఠశాలకు ఒక గుర్తింపు సంఖ్యనూ కేటాయించనున్నారు.

8





డ్రోన్ ద్వారా దోమల మందు పిచికారీ చేయిస్తున్న సిబ్బంది

డ్రోన్ ఎగిరొచ్చె..
మందు పిచికారీ చేసె!

ఇళ్లను మురుగు, వర్షపునీరు చుట్టేశాయి. రోజులతరబడి నిల్వ ఉండటంతో పాచి పట్టి దోమలకు ఆవాసాలుగా నిలిచిపోయాయి. వీటి నియంత్రణకు మందు పిచికారీ చేయాలంటూ మురుగులో నడవాలి. అందులో ఏముంటోందో ఏమోననే భయం. ఇంకేముంది.. ఠక్కున డ్రోన్ గుర్తుకు వచ్చింది. వెంటనే దానిని తెచ్చి మందు నీటిగుంటలో మందు పిచికారీ చేయించారు. నెల్లూరు రూరల్ మండలం బుజబుజనెల్లూరులో కార్పొరేటర్ నరసింహగిరి శుక్రవారం కార్పొరేషన్ సిబ్బంది సహకారంతో డ్రోన్ ద్వారా దోమల మందు పిచికారీ చేయించారు.

- నెల్లూరు (విద్య, ఆంధ్రజ్యోతి)

నివ్వెపోదురుగాక..
ఇది బస్‌స్టేషనా..?

మండల కేంద్రంలోని పాత బస్టాండు సెంటరులో ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన బస్‌స్టేషన్ నిరుపయోగంగా ఉన్నది. ఇక్కడ కనీస వసతులు లేకపోవడంతో ప్రజలు బస్సుల కోసం స్టేషన్‌కు వెళ్లక రోడ్డుపైనే నిరీక్షిస్తున్నారు. రూ.10లక్షల వ్యయంతో కొన్నేళ్ల కిందట నిర్మించిన దీనిలో అధికారులు వసతులు ఏర్పాటు చేయక పోవడంతోనే ఈ దుస్థితి నెలకొందని స్థానికులు, గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా వారు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- వలేటివారిపాలెం, (ఆంధ్రజ్యోతి)



వలేటివారిపాలెంలోని బస్‌స్టేషన్ దుస్థితి



పండక్కీ, పబ్బానికీ, సిరులు చిందించే ఉత్సవాలకూ చేనేత చీరకట్టడం తెలుగు మహిళల సంప్రదాయం. పెళ్లి అనగానే మగువలకు మొదట గుర్తుకు వచ్చేది చీరలే. విభిన్న రంగులు.. చూడముచ్చటైన చీరలను అందిస్తూ నారీమణుల మనసు దోచుకుంటోంది పాటూరు గ్రామం. నాలుగేళ్ల కిందట పోచంపల్లి చీర పేటెంటు హక్కు పొంది తనదైన విశిష్టశైలిని నిరూపించుకొన్న రీతిలోనే.. పాటూరు చీరలు తళుకులీనుతూ సుందరమైన మన్నిక కలిగినవిగా గుర్తింపు పొందాయి. సుమారు అర్ధశతాబ్దం నుంచి పాటూరు చీరల వైభవం సాగుతోంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో చేనేత ఈ చీరలు గుర్తింపు పొందాయి. తెలుగువారున్న ప్రపంచదేశాలన్నింటిలో పాటూరు చీర తన వైభవాన్ని చాటుకుంది. పాటూరు చీర మహిళల మేనుపై కాంతులీనుతోంది. నూలువడికి చేనేత చీరలు తయారుచేసిన చేతులు నేడు పట్టు, జరీ చీరల తయారీలోనూ ప్రత్యేకతను సంతరించుకుంటున్నాయి.

- కోవూరు (ఆంధ్రజ్యోతి)

పనికి తగ్గ ధర లేదు



రంగులు,మెటీరియల్ ధరలు బాగా పెరిగాయి. పెద్ద కంపెనీల చీరల ముందు చేనేతల చీరలు వెలవెల పోతున్నాయి. ఫ్యాక్టరీల్లో తయారైన చీరలు నాజూగ్గా ఉండటంతో మహిళలు వాటి వైపు మొగ్గు చూపుతున్నారు. చేనేత కార్మికుల పనికి తగ్గ ధర పలకడం లేదు.

- పృథ్వీ యానాదయ్య

పాటూరు పట్టు..
మగువలు మురిసేట్టు!

దుస్థితిలో చేనేత కార్మికుల బతుకులు

నేతల వాగ్దానాలు నెరవేర్చాలని వేడుకోలు

- దేశ, విదేశాల్లో ప్రత్యేక స్థానం
- నేటి కాలంలోనూ పోటీకి తట్టుకుని నిలిచిన వైనం

పాటూరులోని చేనేత కార్మికులు నాలుగు చీరలను ఒకే రకంగా, ఒకే పర్యాయం నేస్తారు. నాలుగు చీరలు తయారుచేసేందుకు నూరవ నెంబరు నూలు కడ్డీలు ఆరు, చీరంచుల కోసం 80వ నెంబరు నూలు కడ్డీలు రెండింటిని ఉపయోగిస్తారు. ఆ కడ్డీలకు రంగుల అద్దకం చేస్తారు. ఆ తర్వాత కడ్డీలను ఆరబెట్టి రాట్నంపై తోడి నూలుగా తయారుచేసి పడుగుపోస్తారు. పడుగుకు గంజి, కొన్ని రకాల నూనెలు కలిపి పాగడా తయారుచేస్తారు. అచ్చుకు పాగడాను అమర్చి అల్లుపడుతారు. మగ్గం మీదకు చేర్చి అల్లుకు అంచు, బార్డరు తీర్చిదిద్దుతారు. బార్డరు తయారీకి లాగడం, డాబీ, జాకాడు అనే పరికరాల్ని ఉపయోగిస్తారు. అంచులకు పలు డిజైన్లను రూపొందిస్తారు. నెమలి, పుష్పాలు, చిలుకలు, మామిడిపిందెలు, నర్తకి వంటి అంచుల్లో ప్రాముఖ్యత సంతరించుకొన్నాయి. చీర ధరను దృష్టిలో ఉంచుకుని జరీ కల్పుతారు. జరీల్లో ఉన్న మార్కుల తేడా వల్ల చీర ధరను నిపుణులు అంచనా వేస్తారు. నాలుగు చీరలు తయారుచేసేందుకు పోగులపట్టును ఒకటిన్నర కిలో వాడతారు. పోగుల పట్టును బెంగళూరు, కంచి, చెన్నైలో కొనుగోలు చేస్తామని వస్త్ర వ్యాపారులు తెలిపారు. పోగుల పట్టుకు తాము అనుకున్న రంగుల్ని అద్దించి తీసుకువచ్చి ఆరబెడ్తారు. పట్టును రాట్నంపై తోడి కండెకు చుట్టుతారు. ఒక చీరకోసం ఐదు గజాల పొడవు నూలు, పేకన పట్టును విభజించి నేతకు ఉపక్రమిస్తారు. మధ్యలో వివిధ రకాల డిజైన్లు పుటలు వేస్తూ నేస్తారు. ఆరో గజానికి అంచు రంగు ఉండే రంగును మధ్యలోని పడుగుకు అద్దకం చేస్తారు. ఆరుగజాల పొడుగును క్రమంగా నీటిలో నానబెట్టి మురికిని, గంజిని పోగొడ్తారు. అనంతరం రంగులు కలిపిన పాత్రలో పొడుగును ఉంచుతారు. పొడుగుకు ఎలాంటి పొడలు, అరమరకలు లేకుండా జాగ్రత్తలు తీసుకొంటారు. రెండు సార్లు బాగా శుభ్రం చేసిన తరువాత తిరిగి అద్దకం చేస్తారు. గంజి పోసి నూలు ఆరకుండా దువ్వడం ప్రారంభిస్తారు. రంగు అద్దకంలోనే పాటూరు చేనేత కార్మికుడు తనదైన విశిష్టశైలిని కనపరస్తుండంతో చీరకు అందం ఏర్పడుతోంది. చీరకొంగును కూడా రంగులతో అద్దకం చేయడం పాటూరులోనే ప్రారంభమైంది. సిద్ధం చేసిన చీర కొంగుకు పేకన కవ్వను అమర్చుతారు. కవ్వకు వడి కట్టి 1800 కవ్వాలకు 1800 కడుగుల్ని ఏర్పాటుచేస్తారు. వాటితో టంగోసుపోగుతో డిజైను ఆధారంగా అల్లకాన్ని తీర్చిదిద్దడం పాటూరు నేత కార్మికుని ప్రత్యేకతగా చెబుతారు. 48పుల్లల 'డాబీ'లతో పవిట చెంగును జాకాడవల్లు అనే పరికరంతో నయనానందకరంగా తీర్చిదిద్దుతున్నారు. ఇక్కడి వ్యాపారులు వస్త్ర ప్రపంచంలో వచ్చే మార్పులకు అనుగుణంగా ఆధునిక పద్ధతుల్లో చీరల్ని తయారుచేస్తున్నారు.



అబ్బో ఎన్ని రంగుల చీరలో

ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం..



ప్రభుత్వం చేనేత కార్మికులకు ఎలాంటి ఆర్థిక సహాయం అందించకపోవడంతో ఇబ్బందుల్ని ఎదుర్కొంటున్నాం. రాజకీయ నాయకులు మమ్మల్ని ఆదుకుంటామని పదే పదే వాగ్దానాలు చేస్తారు. మొదట నుంచి నేత మీదనే ఆధారపడ్డాం. ఇప్పుడు ఏ పనీ చేయలేని పరిస్థితిలో ఉన్నాం. చేనేతనే నమ్ముకున్నాం. కనీసం కూలీ గిట్టుబాటు కానప్పటికీ చీరల్ని నేయాలనే తపనతో రంగుల చీరల్ని నేస్తున్నాం.

-పోలిశెట్టి లత, పాటూరు

ఆశగా ఎదురుచూస్తున్నాం..

చేనేత మీదున్న మమకారంతో కడ్డీ అంచురకం చీరలు నేస్తున్నాం. కూలీ కూడా గిట్టుబాటు కావడం లేదు. వారానికి ఐదు చీరలు నేస్తున్నాం. వస్త్ర వ్యాపారులు చెల్లించే కూలీచాలడం లేదు. అచ్చు, అల్లు, అతుకుడు పని కలిపి లెక్కిస్తే కూలీ కూడా గిట్టుబాటు లేదు. ప్రభుత్వం ఎలాంటి ఆర్థిక సహాయం అందించడంలేదు. సీఎం చంద్రబాబు గత ఎన్నికల సమయంలో చేసిన వాగ్దానాన్ని నెరవేరుస్తారని ఎదురుచూస్తున్నాం.



- బైనా జనార్దన్, గుమ్మళ్ళదిబ్బ, కోవూరు



మగ్గం నేస్తున్న చేనేత కార్మికురాలు

నేతన్నలో ఆవేదన

దినమంతా కష్టపడి నేత నేసినా కూలీ కూడా గిట్టుబాటు కావడం లేదని చేనేత కార్మికులు వాపోతున్నారు. పాటూరు, కోవూరు, గుమళ్ళదిబ్బ, గంగవరం, ఇనమడుగు గ్రామాల్లో చేనేత కార్మికుల కుటుంబాలు పెద్దసంఖ్యలో ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా పాటూరు చేనేత చీరలకు మంచి గిరాకీ ఉంది. ఇక్కడ ఇంటింటా చీరల వ్యాపారం జోరుగా సాగుతోంది. ఇక్కడ తయారవుతున్న గోల్డ్, సిల్వర్ కడ్డీ, టిష్యూ, రేబో, కలర్ జరీ, మల్టీ కలర్స్, జరీబూటా రకపు చీరలకు గిరాకీ పెరిగింది. కోవూరు పరిసర ప్రాంతాల్లోనే కాకుండా ఆత్మకూరు, వింజ మూరు, కలిగిరి, ఏఎస్‌పేట మండలా ల్లోని చేనేత కార్మికుల ఇళ్లకు వస్త్ర వ్యాపారులు మెటీరియల్ సరఫరా చేసి చీరలు నేయిస్తున్నారు. ఒక్క చీర నేసేందుకు రెండు రోజులు పడుతోంది. ఐదు చీరల్ని నేసేందుకు వారం పడుతుంది. కూలీకి వెళ్తే రోజుకు రూ.500 సంపాదించే కాలంలో రేయింబవళ్లు కష్టపడి నేత నేస్తే రోజుకు రూ. 300 కూడా గిట్టుబాటు కావడంలేదని చేనేత కార్మికులు వాపోతున్నారు.



అమ్మపాలెంలో ఇంటింటికి వెళ్లి వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

జ్వరాలను నిర్లక్ష్యం చేయొద్దు

- జిల్లా మలేరియా వైద్యాధికారి హుస్సేనమ్మ

వలేటివారిపాలెం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వైరల్ జ్వరాలు పట్ల ప్రజలు నిర్లక్ష్యం చేయవద్దని జిల్లా మలేరియా వైద్యాధికారి హుస్సేనమ్మ, జిల్లా పంచాయతీ అధికారి నాగ రాజు తెలిపారు. అమ్మపాలెం, కాకర్ల వారిపాలెం, చుండి గ్రామాల్లో విజృంభిస్తున్న జ్వరాలపై శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. కలెక్టర్, డీఎంహెచ్ఓ ఆదేశాల మేరకు జిల్లా సబ్ యూనిట్ ఆఫీసర్ విజయ్‌చంద్, కందుకూరు డిప్యూటీ డీఎంహెచ్ఓ ప్రియ వదలతో కలిసి అమ్మపాలెంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని వారు పరిశీలించారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి ఫీవర్ కేసులు, పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యాధులతో కలిగే నష్టాలను వివరిం చారు. వారి వెంట స్థానిక వైద్యా ధికారి మణిదీపిక, సిబ్బంది ఉన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రాష్ట్రంలో తీరిన స్టాంపు పేపర్ల కొరత

అమరావతి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్టాంపు పేపర్ల కొరత తీరింది. శుక్రవారం రాష్ట్రానికి కొత్త స్టాంపు పేపర్లు వచ్చాయి. నాన్ జ్యుడీషియల్ స్టాంపు పేపర్లు 20 లక్షలు, 100 రూపాయల స్టాంపు పేపర్లు 10 లక్షలు, 50 రూపాయల స్టాంపు పేపర్లు 10 లక్షలు వచ్చాయి.

పాఠశాల విద్య బలోపేతం చేస్తా!

- నూతన డీఈవో బాలాజీరావు

నెల్లూరు (విద్య), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పాఠశాల విద్యను బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ రాజా బాలాజీరావు తెలిపారు. నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో శుక్రవారం ఆయన డీఈవోగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా బాలాజీరావు మాట్లాడుతూ జిల్లాలో విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, ఉపాధ్యాయ సంఘాలు కూడా తనకు పూర్తి సహాయ, సహకారాలు అందచేయాలని కోరారు. విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేసేలా ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేయడంతో పాటు ఈ ఏడాది టెన్త్ ఫలితాల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణా జిల్లాకు బదిలీపై వెళుతున్న రామారావు, నూతన డీఈవోలు ఒకరినొకరు అభినందనలు తెలియచేసుకున్నారు. డీఈఓలకు ఎస్ఎస్ఏ ఏపీసీ ఉషారాణి, విద్యా శాఖ ఏడీలు, సూపరింటెండెంట్లు, కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయ సంఘం నేతలు అభినందనలు తెలిపారు. అలాగే నూతన డీఈఓ బాలాజీరావు కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆనంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

సౌభాగ్య సరస్వతి ఆలయంలో
వైభవంగా ప్రతిష్ఠాపన ఉత్సవాలు



అధివాసాంగ హోమం చేస్తున్న రుత్వికులు

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని పప్పులవీధిలో గల సౌభాగ్య సరస్వతీ ఆలయం విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మూడో రోజు శుక్రవారం కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి, శక్తి పీఠం అధిపతి రమ్యానంద భారతీ నేతృత్వంలో ఉదయం యాగశాల ప్రవేశం, కలిశ స్థాపన, మండపా రాధనలు, హోమాలు జరిగాయి. అనంతరం భక్తులు నువ్వుల నూనెతో బారులుతీరి నూతన విగ్రహాలకు తైలాభిషేకం చేశారు. ఆ తర్వాత అన్న ప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం యాగశాలలో పూజలు, హోమాలు జరిగాయి. ధాన్యా ధివాసం కార్యక్రమంలో భక్తులు బియ్యం, వడ్లు సమర్పించారు. పీఠాధిపతి అనుగ్రహ భాషణం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సాంస్కృతిక కార్యక్ర మాలు కనువిందు చేశాయి. ఆలయ ప్రధాన అర్చకుడు మాచవోలు రమేష్ శర్మ, మేనేజర్ అనూరాధ, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.



ఆకట్టుకున్న బాలికల నృత్య రూపక ప్రదర్శన

మూలస్థానేశ్వరాలయంలో
రేపటి నుంచి పవిత్రోత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని భువనేశ్వరీ సమేత మూలస్థానేశ్వరాలయంలో ఆదివారం నుంచి ఈ నెల 29వరకు పవిత్రోత్సవాలు జరుగుతాయని ఆలయ సహాయ కమిషనర్, ఈవో జే శ్రీనివాసరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం అంకురార్పణ, 28వతేదీ విశేష సంధి పూజ, విశేష ద్రవ్యాలతో హోమం, పవిత్ర సమర్పణ జరుగుతాయని తెలిపారు. 29వతేదీ యాగశాల పూజ, మండలేశ్వర పూజలు, మహాపూర్ణాహుతి, మహాదీపారాధన, అలంకార దర్శనం, రాత్రి ప్రదోషకాల పూజలు, చిన్న వెండి నందిపై ప్రాకారోత్సవం జరుగుతాయన్నారు. భక్తులు అందరూ తరలిరావాలని కోరారు.

మల్టీపర్పస్ పీఏసీఎస్‌ల
ఏర్పాటుకు జిల్లా కమిటీలు

అమరావతి (ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామ పంచాయతీలో మల్టీపర్పస్ ప్రైమరీ అగ్రికల్చర్ కో ఆపరేటివ్ సొసైటీలు, డెయిరీ, ఫిషరీస్ సొసైటీల ఏర్పాటు కోసం జిల్లా స్థాయిలో జా యింట్ వర్కింగ్ కమిటీలను ఏర్పాటు చేయా లని ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర పథకం 'సహకార్ సే సమృద్ధి'లో భాగంగా జిల్లా సహ కార అభివృద్ధి కమిటీలకు సబ్ కమిటీలుగా జిల్లాస్థాయి కమిటీలు పని చేయనున్నాయి. దీనికి జాయింట్ కలెక్టర్ స్థాయి కంటే తక్కువ కాని అధికారులను ఛైర్మన్లుగా నియమించాలని ప్రభుత్వం సూచించింది. సహకార సేవలు విస్తరించని గ్రామాలు, పంచాయతీలు, ప్రాంతాల్లో కొత్త మల్టీపర్పస్ ప్రైమరీ అగ్రికల్చర్ కో ఆపరేటివ్ సొసైటీల ఏర్పాటుకు సంబంధించిన కార్యకలాపాలను నిర్వహించడానికి ఈ కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

రచ్చకెక్కిన ఎస్సీ కార్పొరేషన్

(7వ పేజీ తరువాయి)

కార్పొరేషన్ వీసీ అండ్ ఎండీని ఆదేశించింది. దీంతో విచారణాధికారిగా నియమితులైన ఆ సంస్థ జనరల్ మేనేజర్ సునీల్‌రాజ్‌కుమార్ కార్పొ రేషన్‌లో అక్రమాలు జరిగాయని, అక్రమ పదో న్నతులు జరిగా యంటూ సంస్థ ఎండీకి నివేదిక సమర్పించినట్లు తెలిసింది. దీంతో ఎస్సీ కార్పొ రేషన్‌లో ఈడీగా పని చేసిన సారయ్యను, ఈవో సెల్విని సస్పెండ్ చేశారు. అదేవిధంగా ఇద్దరు టైం స్కేల్ ఉద్యోగులకూ రివర్షన్ ఇచ్చారు.

నివేదిక కలెక్టర్‌కు పంపాం

ఎస్సీ కార్పొరేషన్‌లో జరిగిన విచారణకు సంబం ధించి విచారణాధికారి ఇచ్చిన నివేదికను కలెక్టర్‌కు పంపాం. అక్కడ నుంచి ఎస్సీ కార్పొరేషన్ ఎండీకి నివేదిక చేరుతుంది. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణా లు పొంది జేసీబీలు, ఇన్నోవా కార్లు తదితరాలు పొందిన వారి నుంచి రుణాల రికవరీ చేస్తాం.

- డాక్టర్ నిర్మలాదేవి, ఈడీ ఎస్సీ కార్పొరేషన్

పారిశుధ్యం మెరుగు..
ఎస్ఎంసీలదే బాధ్యత

- బడుల్లో మెరుగైన పరిశుభ్రతకు ప్రణాళిక
- ప్రత్యేకంగా యాప్, ప్రతి కమిటీకి గుర్తింపు సంఖ్య
- ప్రతి బుధ, శుక్రవారాల్లో పనుల పరిశీలన

సంగం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 2061 ప్రాథమిక, 256 ప్రాథమికోన్నత, 295 ఉన్నత పాఠశాలలు ఉండగా, సుమారు 1.82 లక్షల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఆయా పాఠశాలల్లో పరిసరాలు, మరుగుదొడ్ల పరిశుభ్రతను ఇప్పటి వరకు ఉపాధ్యాయులు పర్యవేక్షించారు. ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించి అందులో రోజుకు మూడు సార్లు మరుగుదొడ్ల ఫొటోలు అప్‌లోడ్ చేసేవారు. అప్పట్లో వైసీపీ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమైంది. అంతేగాక పాఠశాలల యాజమాన్య కమిటీలను రద్దు చేసి తల్లిదండ్రుల పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ కమిటీలు నెలవారీ జరిగే సమావేశాల్లో పాల్గొని తీర్మానాలపై సంతకాలు చేయడం, ఉత్సవ విగ్రహాల్లా ఉండటం మినహా ఎటువంటి అధికారాలు, బాధ్యతలు ఉండేవికావు. ఈ నేపథ్యంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం యాజమాన్య కమిటీలను పునరుద్ధరించింది. ఆగస్టులో పాఠశాలల వారీగా ఎన్నికలు నిర్వహించి నూతన కమిటీలను కూడా ఏర్పాటు చేసింది. అంతేగాక ఈ కమిటీలకు కొన్ని బాధ్యతలు అప్పగించడానికి కార్యాచరణ సిద్ధం చేసింది. ఇందులో భాగంగా ప్రతి బుధ, శుక్రవారాల్లో కమిటీ సభ్యులు పాఠశాలలకు వచ్చి మరుగుదొడ్లు, ఇతర పారిశుధ్య పనులను పరిశీలించి ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఇందుకోసం ప్రత్యేకంగా ఒక్కో కమిటీకి ప్రత్యేక ఐడీ, పాస్‌వర్డ్ కేటాయించింది.



పాఠశాల ఆవరణలో శుభ్రం చేస్తున్న సిబ్బంది

ఎస్ఎంసీలతోపాటు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్

ఒక్కో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలో సగటున 15 నుంచి 20 మంది సభ్యులు ఉంటారు. వారితోపాటు సచివాలయ సంక్షేమ సహాయకులు పారిశుధ్య పర్యవేక్షణ పనుల్లో భాగస్వాములు కానున్నారు. యాప్‌లో ఫొటోలు అప్‌లోడ్ చేసేలా కమిటీ సభ్యులకు శిక్షణ కూడా ఇవ్వనున్నారు. ఎక్కడైనా మరుగుదొడ్ల మరమ్మతులు, ఇతర సమస్యలు ఉంటే వెంటనే ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులకు నివేదించి సమస్యను పరిష్కరించేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో పాఠశాలల్లో సమస్యలకు పరిష్కారం లభించినట్లేనని విద్యార్థులు, ఉపాధ్యాయులు భావిస్తున్నారు.

పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠ



పోలేరమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న భక్తులు

సంగం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వంగల్లు గిరిజన కాలనీలో పోలేరమ్మ, పోతురాజు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

● కలిగిరి : స్థానిక కొత్తూరు ప్రాంతంలోని కోదండరామస్వామి ఆలయంలో శుక్రవారం హనుమత్ సమేత సీతారామ,లక్ష్మణ విగ్రహాల ప్రతిష్ఠాపన చేపట్టారు.స్వామివారి ప్రథమ దర్శనానికి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌తోపాటు మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి హాజరైనారు. నిర్వాహకులు ఆలయ ప్రాంగణం వద్ద భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ



కలువాయి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుల్లూరులో శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానం ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాధరం, నళినమ్మ దంపతులు, ఆల్ ఇండియా వడ్డెర కమ్యూనిటీ ప్రధాన కార్యదర్శి హెచ్ జయశంకర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

మండలంలోని బ్రాహ్మణపల్లిలో శుక్రవారం సిమెంటు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గోనుగుంట వెంకటేశ్వర్లు నాయుడు, నాయకులు గడ్డం కిషోర్‌రెడ్డి, చల్లా రఘురామిరెడ్డి, బట్టెడ్డి శ్రీనివాసులరెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా విత్తనాలు అమ్మితే చర్యలు

అల్లూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల రైతులకు విత్తనాలను అందుబాటులో ఉంచుతామని కావలి ఏడీఏ నాగరాజు తెలిపారు. శుక్రవారం అల్లూరు వ్యవసాయశాఖ కార్యాలయంలో వీఏఏలతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. అవసరమైన వారు రైతు కేంద్రాలను సంప్రదించాలన్నారు. గుర్తుతెలియని వ్యక్తుల వద్ద విత్తనాలు కొనుగోలు చేయవద్దని అనుమతులు ఉన్న కేంద్రాల్లోనే విత్తనాలు తీసుకోవాలన్నారు. అనుమతులు లేకుండా విత్తనాలను విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనుమతులు పొందిన వారే అన్ని రకాల పత్రాల ఆధారంగా లేబుల్స్‌తో విక్రయించాలే తప్ప కేవలం సంచుల్లో వేసి సీల్ చేసి విక్రయించరాదన్నారు. రైతుల నుండి ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పశువైద్య కేంద్రాలు

● వరండాల్లోనే ఉద్యోగుల సేవలు
● మందులు ఉంచేందుకు గదులు కరువు



శిథిలావస్థకు చేరి కూలే దశలో ఉన్న ఉదయగిరి పశువైద్య కేంద్రం



మందులతో నిండిన గదులు

ఉదయగిరి రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంతమైన ఉదయగిరిలో వ్యవసాయం కంటే పాడి మీద ఆధారపడి అధికశాతం మంది జీవిస్తున్నారు. అయితే ఈప్రాంతంలో శిథిలావస్థకు చేరిన పశువైద్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. ఉదయగిరి ఏడీ పరిధిలో సుమారు 16,800 గేదెలు, ఆవులు, 65 గొర్రెలు, మేకలు ఉన్నాయి. ఉదయగిరి పట్టణంలో 1963లో నిర్మించిన భవనంలో పశు వైద్యశాల కొనసాగుతోంది. ఈ భవనంలో మందులకే గదులు సరిపోగా సిబ్బంది వరండాలో కూర్చొని విధులు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. ఆవరణలో కంపచెట్లు మొలచి విషపురుగులకు నిలయంగా మారింది. కేంద్రాల్లో మౌలిక వసతులు లేకపోవడతో మూగజీవాలకు వైద్యసేవలు సక్రమంగా అందడంలేదు. గండిపాళెంలోనూ అదే పరిస్థితి. అలాగే ఉదయగిరి, సీతారామపురం మండలాల్లో వైద్యుల కొరత సైతం ఉంది. గత వైసీపీ ప్రభుత్వం పశువైద్య కేంద్రాల బాగోగులను పట్టించుకోలేదని, ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా నూతన భవనాలు మంజూరు చేసి మూగజీవాలకు మెరుగైన వైద్యసేవలందేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా: ఏడీ

భవనాల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రధానంగా ఉదయగిరి పశు వైద్యశాల భవనం పూర్తి శిథిలావస్థకు చేరింది. నూతన భవన నిర్మాణం చేపట్టాల్సి ఉంది.

టీడీపీ సభ్యత్వ నమోదు విజయవంతం చేయండి

● ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26నుంచి ప్రారంభమవుతున్న తెలుగుదేశం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలంతా సమిష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం వారికి సభ్యత్వ నమోదుపై అవగాహన కల్పించారు. పార్టీ బలోపేతానికి సభ్యత్వ నమోదు కార్యక్రమం ఎంతో కీలకమని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంతో ముందుచూపుతో కార్యకర్తల కుటుంబాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమం తీసుకవచ్చారని తెలిపారు. సభ్యత్వం తీసుకున్న కార్యకర్త ఎవరైనా ప్రమాదవశాత్తు మరణిస్తే 5 లక్షల రూపాయలు, సహజ మరణమైతే పదివేల రూపాయలు ఆ కుటుంబానికి ఆర్థికసహాయం అందిస్తామన్నారు. సభ్యత్వ నమోదులో కందుకూరును నెల్లూరు పార్లమెంటు పరిధిలో మొదటి స్థానంలో నిలిచేలా కృషి చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వర రావు, జనిగర్ల నాగరాజు, మాదాల లక్ష్మీనరసింహ్మం, పిడికిటి వెంక టేశ్వర్లు, కంచ్రా మాల్యాద్రి, షేక్ రఫీ, మధుబాబు పాల్గొన్నారు.

మాలకొండలో అభివృద్ధి పనులపై సమీక్ష

● వలేటివారిపాలెం : మాలకొండ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం అభివృద్ధి పనులపై శుక్రవారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆలయ అధికారులతో సమీక్ష నిర్వహించారు. మాలకొండపైకి వెళ్లే ఘాట్‌రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చుట, అమ్మవారు ఆలయానికి వెళ్లే మెట్ల మార్గంను మెట్ల పునర్నిర్మాణం, ప్రముఖులకు నూతన గదుల నిర్మాణం, వాహన పార్కింగ్, కొండ కింద చిరు వ్యాపారులకు షాపింగ్ కాం ప్లెక్స్ తదితర సదుపాయాలపై ప్రతిపాదనలు తయారు చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. అన్న ప్రసాదంలో నాణ్యత లోపిస్తే సహించేది లేదన్నారు. భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. కార్య క్రమంలో ఆలయ డిప్యూటీ కమిషనర్ సాగర్‌బాబు, ఎస్‌ఐ మరిదినాయుడు, మాదాల లక్ష్మీ నరసింహం పాల్గొన్నారు.

దోచుకుంటే సహించేది లేదు

కావలి టౌన్ (ఆంధ్రజ్యోతి): దోచుకుంటే సహించేది లేదని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి తెలిపారు. వైసీపీ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన కలెక్టరేట్ ముట్టడికి ఆయన తన నివాసం వద్ద నుంచి పార్టీ శ్రేణులతో తరలివెళ్లారు. పార్టీ కార్యకర్తలను ఇబ్బందిపెడితే ఊరుకోమన్నారు.

పశుగణనకు సహకరించండి : ఎమ్మెల్యే దగుమాటి



పశుగణన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి

కావలి, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి) పశుగణన సేకరణకు వచ్చే వారికి పశువుల సమగ్ర సమాచారం అందించాలని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. పశుగణనకు సంబంధించిన 21వ అఖిలభారత పశుగణన పోస్టర్‌ను శుక్రవారం సాయంత్రం కావలి ఎమ్మెల్యే కార్యాలయంలో పశుసంవర్ధక శాఖ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ నెల 25 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు పశుగణన జరుగుతోందన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ డీడీ డాక్టర్ ఎన్.మల్లారెడ్డి, ఏడీ డాక్టర్ రసూల్, డాక్టర్ లక్ష్మీశైలజ, డాక్టర్ కాముశ్వరరావు, సిబ్బంది. టీడీపీ నేతలు ఆవుల రామకృష్ణ, బొట్లగుంట హరిబాబు పాల్గొన్నారు.


వరద బాధితులకు విరాళం

విజయవాడ వరద బాధితులకు ప్రయివేట్ స్కూల్స్ యాజమాన్యం రూ.2లక్షల విరాళంను డీడీ రూపంలో శుక్రవారం రాత్రి కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డికి అందజేశారు. కావలి ఎమ్మెల్యే కార్యా లయంలో జరిగిన ప్రయివేట్ స్కూల్స్ యజమానులను అభినందించారు.

ఆపరేషన్‌కు ఆర్థికసాయం

మోకాళ్ల ఆపరేషన్ నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి ముందస్తు ఆర్థిక సహాయం కింద రూ.2,17,200ల చెక్కును శుక్రవారం ఎమ్మెల్యే దగుమాటి వెకావలిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కావలి మున్సిపాలిటీ పరిధిలోని చౌదరిపాలెం వృద్ధురాలు గొంది రామలక్ష్మమ్మ గత రెండేళ్లుగా మోకాళ్ల నొప్పులతో బాధపడుతూ శస్త్రచికిత్స చేయించుకునే ఆర్థికస్తోమత లేక ఇబ్బందులు పడుతోంది. ఈ విషయాన్ని బాధిత కుటుంబసభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించారు. ఈ సందర్భంగా వారు సీఎం నారా చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.





అమరవీరుల స్మృతి సంఘీభావ ర్యాలీ

కందుకూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల స్మృతి వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని సబ్ డివిజన్ పోలీసులు అమరవీరుల సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. కందుకూరు డీఎస్పీ వి.బాల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో సీఐలు, ఎస్‌ఐలు, ఇతర పోలీ సు సిబ్బంది పాల్గొన్నారు. పట్టణ పోలీసుస్టేషన్ నుంచి ఎన్టీఆర్ విగ్రహం సెంటర్ వరకు ఈ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

లియాఫీ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక




ప్రమాణం చేస్తున్న నూతనంగా ఎన్నికైన లియాఫీ కార్యవర్గ సభ్యులు

ఆత్మకూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆత్మకూరు బ్రాంచి కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం ఎల్‌సీ ఏజెంట్స్ యూనియన్ (లియాఫీ) సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మకూరు బ్రాంచి లియాఫీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. గౌరవాధ్యక్షుడిగా షేక్ ఖాజావలీ, అధ్యక్షుడిగా పడసాల శ్రీనివాసులు, జనరల్ సెక్రటరీగా మెంతం శ్రీనివాసులరెడ్డి, ట్రెజరర్‌గా కోడూరు ఓబుల్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా కంచర్ల శ్రీనివాసులు, జాయింట్ సెక్రటరీలుగా చెరుకూరు చిన్నమస్తానయ్య, ఎన్ శ్రీనివాసులు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కంచర్ల శ్రీధర్‌నాయుడు ఎన్నికయ్యారు. వీరిని ఎల్‌ఐసీ ఏజెంట్లు సన్మానించి అభినందించారు. అనంతరం నూతన కర్యవర్గ సభ్యులు మాట్లాడుతూ ఎల్‌ఐసీ ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్‌సీ డివిజన్ ఆఫీసుకు చెందిన లియాఫీ నాయకులు శ్రీధర్‌రెడ్డి, వీరాస్వామి, షణ్ముగం, లియాఫీ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



వాడివేడిగా మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంఈవో-2 ఆనందరావు

కొండాపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎంపీపీ బొడ్డు అనూరాధ అధ్యక్షతన శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. ముందుగా మూడునెలల్లో వైద్యం, విద్య, పంచాయతీరాజ్, పారిశుద్ధ్యం, వెటర్నరీ తదితర శాఖలతో మండలంలో జరిగిన అభివృద్ధి పను లపై ఎంపీడీవో ఆదినారాయణ సమీక్ష నిర్వహించారు. ఇటీవల పంచాయతీలలో సర్పంచులతో సంబంధం లేకుండా గ్రామసభలు నిర్వహించి సీసీ రోడ్ల పనులకు తీర్మాణాలు చేయడంపై వైసీపీ మద్దతుదారు సర్పంచులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారం రాష్ట్ర మంతా జరిగిందని అధికారులు చెప్పినా వారు వినిపించుకోక పోవడంతో గుడవళ్లూరు సర్పంచ్ మాచెర్ల కలుగజేసుకున్నారు. గత ప్రభుత్వంలో తన పంచాయతీలో రూ.40లక్షల పనులు తనకు సంబంధం లేకుండా చేసుకున్నప్పుడు మీరు ఎందుకు ప్రశ్నించలేదని వారిని నిలదీశారు. ఇలా సమస్యలపై సభలో గందరగోళం నెలకొనడంతో అధికారులు ఇరువురికి సర్దిచెప్పి సభను కొనసాగించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 ఆనందరావు, ఇన్‌చార్జి పీఆర్ ఏఈ వాణి, ఇరిగేషన్ ఏఈ రమేష్‌కుమార్, పలు శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు భూముల అప్పగింత

ఉలవపాడు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): 15 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న వక్ఫ్‌బోర్డు భూములను రెవెన్యూ అధికారులు శుక్రవారం జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ ఎస్‌కే ఖుదావన్‌కు అప్పగించారు. రాజుపాలెంలోని 39.64 ఎకరాలను స్థానికంగా 22 మంది రైతులు సాగు చేసుకుంటున్నారు. దీనిపై గత కొన్నేళ్లుగా రైతులు, వక్ఫ్‌బోర్డు మధ్య వివాదం జరిగింది. చివరకు ఆ భూముల వక్ఫ్‌బోర్డుకు చెందినవిగా రెవెన్యూ అధికారులు నిర్ధారించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కలిగిరి (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఎంపీపీ మెట్టుకూరు శిరీష అధ్యక్షతన మండలసర్వసభ్య సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ప్రత్యూష తెలిపారు.

రూ. 10.29 కోట్లతో అభివృద్ధి పనులు

● ఏడుకొండలు, ఆత్మకూరు పంచాయతీ రాజ్ డీఈ,



ఆత్మకూరు, అక్టోబరు 25 : (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఇటీవల విడుదలైన నిధులతో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని పంచాయతీరాజ్‌శాఖ డీఈ జి ఏడుకొండలు తెలిపారు.

? నియోజకవర్గానికి ఎన్ని కోట్ల నిధులు మంజూరయ్యాయి

! 6 మండలాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 10. 29 కోట్లు నిధులు కేటాయించారు.

? ఏయే మండలాలకు ఎన్నినిధులు కేటాయించారు

! ఆత్మకూరు మండలానికి రూ. 1.76 కోట్లు, ఏఎస్ పేటకు రూ. 1.74 కోట్లు, అనంతసాగరానికి రూ. 1.63 కోట్లు, మర్రిపాడుకు రూ. 1.86 కోట్లు, సంగంకు రూ. 1.54 కోట్లు, చేజర్ల మండలానికి రూ. 1.75 కోట్లు నిధులు కేటాయించారు.

? ఈ నిధులతో ఎన్ని సీసీ రోడ్లనిర్మాణం చేపట్టనున్నారు

! నియోజకర్గం మొత్తం మీద 198 సీసీ రోడ్ల నిర్మాణం చేపడతాం. అందులో ఆత్మకూరు మండలంలో 38, ఏఎస్‌పేటలో 31, అనంతసాగరంలో 36, మర్రిపాడులో 34, చేజర్లలో 29, సంగంలో 30 సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి.

న్యూస్ బాక్స్

అరుణాచలంకు ప్రత్యేక బస్సు

ఉదయగిరి రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 4వ తేదీ కార్తీక సోమవారం సందర్భంగా ఉదయగిరి ఆర్టీసీ డిపో నుంచి 3వ తేదీ ఉదయం 8 గంటలకు అరుణాచలంకు ప్రత్యేక బస్సు సర్వీసును ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ శ్రీనివాసరావు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయగిరి, దుత్తలూరు, వింజమూరు, ఆత్మకూరు మీదుగా సిరిపురం గోల్డెన్ టెంపుల్‌ను ప్రయాణికులకు చూపించి అరుణాచలం బయలుదేరుతుందన్నారు. రానుపోను ఒక్కో ప్రయాణికుడికి రూ.1650 చార్జీ ఉంటుందన్నారు. ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం ఉందని, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

ఉదయగిరి రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని ఎంఈవో షేక్ మస్తాన్‌వలి సూచించారు. శుక్రవారం మండలంలోని వెంగళరావునగర్ జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈసందర్భంగా మధ్యాహ్న భోజనం రుచి చూశారు. విద్యార్థులకు చేతుల శుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నూర్జహాన్, షకీలా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటినుంచి టీడీపీ సభ్యత్వ నమోదు

ఉదయగిరి రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల టీడీపీ కన్వీనర్ చింతనబోయిన బయ్యన్న శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో 26వ తేదీన జీ.చెరువుపల్లి, 27న జీ.చెర్లోపల్లి, 28న జీ అయ్యవారిపల్లి, 29న బండగానిపల్లి, 30న పుల్లాయపల్లి, 31న శకునాలపల్లి, నవంబరు 1న నేలటూరు పంచాయతీల్లో సభ్యత్వ నమోదు జరుగుతుందన్నారు

ఉదయగిరిలో జాబ్‌మేళా

ఉదయగిరి రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయిమెంట్ ఆఫీస్ మరియు సీడాప్‌లు సంయుక్తంగా జాబ్‌మేళా నిర్వహించాయి. ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంకు, డక్కన్‌వీల్స్ కంపెనీలు నిర్వహించిన ఈ జాబ్‌మేళాలో 23 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆకుల నరసింహులు, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి అఫ్జల్‌ఖయ్యూం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలపై వినతులు

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మండక్లపల్లి గ్రామంలో రీసర్వేలో వచ్చిన భూ సమస్యలపై తహసీల్దారు వై నాగరాజు సిబ్బందితో కలిసి గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు రీసర్వేలో నెలకొన్న తప్పిదాలపై అధికారులకు వినతులు అందజేశారు. వినతులను పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తామని తహసీల్దారు రైతులకు హామీ ఇచ్చారు.

మల్లవరప్పాడులో..

కొండాపురం: మల్లవరప్పాడులో జరిగిన రీసర్వేపై గ్రామసభకు 3వినతులు వచ్చినట్లు తహసీల్దార్ కోటేశ్వరారవు తెలిపారు. ఈ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ శ్రీనివాసులు, వీఆర్‌వో పోలయ్య, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

మెప్మా బజారు ప్రారంభం

కందుకూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మెప్మా సభ్యుల ఆధ్వర్యంలో శుక్రవారం అర్బన్ బజార్‌ను నిర్వహించారు. మెప్మా పీడీ డాక్టరు డి. రవీంద్ర ఈ మార్కెట్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ టీఈ కాంతయ్య, సీఓలు సూరత్న, మాధవీలత, డీఆర్‌పీ మహీధర, సంపత్ బాబు తదితరులు పాల్గొన్నారు.